

భారతి

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

అక్టోబర్ 1975

వెల: రూపాయిన్నర

CT

KLVA104M126

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

అక్టోబరు 1975

సంపుటము : 52 : సంచిక : 10 :

విడిప్రతిక వెల రూపాయిన్నర

3

విషయానుక్రమణిక

అక్టోబరు 1975

విచికిత్స	శ్రీ వి. సంపత్కుమారాచార్య	4
మధ్యతరగతి మందహాసం తిలక్	శ్రీ శివలెంక ప్రకాశరావు	5
సింహావలోకనము	కెప్టెన్ శ్రీనివాస్	10
తెలుగులో స్వర సమీకరణ	శ్రీ వేమూరి రామారావు	11
"మళ్ళీ విందుకు..."	శ్రీ విజయదత్తు	16
గణపతి—తెలుగు సాహిత్యం	కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు	17
జనన్మైకఫలం	శ్రీ తిరునగరి	21
రక్తయజ్ఞం	శ్రీ కలువకొలను సదానంద	22
రంగుల కెరటాల్లో బెంగుళూరు	శ్రీ సోమసుందర్	36
మహా సంప్రదాయం—ఒక దశ అంతం అవుతోందా ?	వెర్నర్ హెయిసన్ బెర్గ్	39
మీ ఆశీర్వాదమే చాలు మాష్టారూ !	హిందీమూలం : శ్రీ కృష్ణ అనువాదం : శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ	45
వన్యకవితా సామగ్రి	శ్రీ మన్నవ భాస్కర నాయుడు	50
కలగూరగంప		54
గ్రంథ విమర్శలు		60

వి చి కి త్స

శ్రీ వి. సంపత్కుమారాచార్య

ఈ జీవితమనే మహా కావ్యంలో
నన్ను ప్రహేళిక!...
అసలు జీవితమే ఒక ప్రవల్హిక!!......
నిన్నటి సూర్యుడు పడమట వ్రాలిన దగ్గర్నించీ
చీకట్లో మునిగి ...
నేటి సూర్యుడాడబోయే నిన్న మొన్న పాత నాటకాన్ని
మళ్ళీ చూడ్డం కోసం —
ఆకాశంలోకి నా అలవాటై చూపు! —
ఆ ఆకాశమనే మహా సముద్రంలో
మేఘాలనే ఓడలు! — మధ్య నెక్కడో
దారి తప్పి బిక్కమొగం వేసిన రెండేళ్ళ పాపల్లా
రెండో మూడో మినుకు మినుగురు చుక్కలు!!...—
ఆ తారల్నందుకోవాలని పరిగెడ్తున్న మేఘాలు
ఆఖరి భూమికి పదిలి పట్టినై
తమ అస్తిత్వాన్ని కోల్పోయినట్లే......
ఒక యూనివర్సల్ పొయెట్
విరచించి పారేసిన ఈ బ్రతుకు పత్రంలో
గోగంధనానికి...పోయిన్ని పుటలు ఎగిరిపోతూంటే
వాటిని దళిజేర్చుకుంటూ...క్రొత్తగా చదువుకుంటూ
ఏ పదాని కే అర్థమో — ఏ దినాని కే అనుభవమో
అన్వయం కుదరక —
ఆ అలంకారాలూ — శ్లేషలూ అర్థంకాక ...
శేషకాలాన్ని భుజం వెనక్కి వెట్టుకుంటూ
నేను! ...... ఒక మానవుణ్ణి!! ......
ముందొచ్చేది మరణమో ... మారణమో
          సుఖాంతోరణమో — మఖాంతో రణమో
తెలియదు! ...
అది కనపడేదాకా నా ఊహల్లో పైడి దేవళం!!....
ఈలోగా నాలో సందేహాల దేహం
అవిరామ ప్ర విదారణం!!......

మధ్యతరగతి మందహాసం - తిలక్

శ్రీ శివలెంక ప్రకాశరావు

'కవిత్వం జీవితానికి ఒక విమర్శ. కవియొక్క గొప్పతనము అతని శక్తివంతమైన, అందమైన భావాలను జీవితానికి సమన్వయించటంలోనే ఉంటుంది' అంటాడు ఆర్నాల్డ్ మహాశయుడు.

అందుకే 'కవిత్వం జీవితంనుంచి పుట్టి జీవితానికిచెంది, జీవితంకోసమే జీవిస్తుంది' అని అనడం జరిగింది. అటువంటి కవిత్వమే కవిపోయినా శాశ్వతంగా జీవించి ఉంటుంది

అలాగే తాను అస్తమించినా, తన కవితామృతం రసజ్ఞుల హృదయ క్షేత్రాలలో ఎల్లప్పుడూ కురిసేటట్లు చేసిన కవిచంద్రుడు దేవరకొండ బాల గంగాధర తిలక్. ఆధునికత్వానికి ప్రాణాలైన పరిశీలన, పరిశోధన, ప్రయోగాలనుచేసి, జీవిత రహస్యాలనెరిగి జీవించిన వాడు తిలక్. 'నవ వనాలైన ఊహావర్ణార్ణవాలపీద ఉదయించిన' ప్రభాకరుడీయన. 'గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ, జాజి పువ్వుల అత్తరు దీపాలూ, మంత్రలోకపు మణిస్తంభాలూ, కవితా చందనశాలలో కలం అనే కుంచెతో చిత్రవిచిత్రంగా చిత్రించిన చిత్రకారుడు'. 'అగాధ బాధాపాథః పతంగాల ఆక్రందనలను ఆలకించి', మానవీయ పతాకాన్ని ఎగరేసిన మానవతా వాది తిలక్. అందుకే 'నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాల'నీ, 'మానవత లేని లోకాన్ని స్మరించలేన'నీ చెప్పుకున్నాడీయన - ఆకలికి అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలాణ్ణీ, వర్షంలో వంతెన కింద ప్రసవించిన చూలాల్ని, తిండిలేక ఏడ్చిఏడ్చి మురికి కాలువ పక్క నిద్రించిన అనాథ బాలుణ్ణీ, నిరాహారుడుగా ఆఫీసుకు వచ్చిన ప్యూన్ వీరన్నని, క్షయరోగం వచ్చిన అర్ధాంగికై భర్తయిన గుమాస్తాని చూచి విలవిలలాడిపోయి, 'క్షతదుఃఖిత హృదయమూరడిల్లనంతవరకు నాకు శాంతి కలగదింక నేస్తం' అని, 'ఈ గుండెపట్లు ఎక్కడో కదిలినవి, ఈ కనులు వరదలై పారినవి, ఈ కలలు కాగితపు పేలికలై రాలినవి' అంటూ 'ఆర్తగీతం' ఆలపిస్తాడు తిలక్.

'కాలం విరిగినబండిచక్రంలా కదలలేకపోవడం మొండి చేతుల మానవత్వం తెల్లబోవటం' చూడగల క్రాంతదర్శి తిలక్.

నిజంగా కవికి క్రాంత దర్శిత్వంలేందే ఎదుటివారి బాధనర్థం చేసుకోలేడు. తోటివారి వ్యథలలో, ఒక భాగస్వామి కాలేడు. అందుకే ఒక మహాశయుడు 'కవితాసృష్టి కవికి పరకాయ ప్రవేశం వంటి'దంటాడు. ఆ శక్తి యుక్తులుంటేనే కాని కవిత నిజమైన కవితగా ఉండదు, వట్టిమాటలకూర్పులాగా, చప్పచప్పగా ఉంటుంది. నిజమైన కవితలో కవికి ఒక సన్నివేశంలో, ఒక సంఘటనలో కలిగిన హృదయ స్పందనం పఠితకు విస్పష్టంగా వినిపిస్తుంది అతనికి కలిగిన ఆర్తిని తలపిస్తుంది. అందుకే 'వ్యక్తి లోపలి జీవితంలోకి చూపును త్రిప్పేదే ఉత్తమ కవిత' అన్నారు.

ఈ ఉత్తమ కవితా లక్షణం తిలక్‌లో ప్రత్యణువునా ప్రతిధ్వనిస్తుంది.

బాధ తిలక్ కవితకు జీవగర్ర అందుకే 'దుఃఖానికీ బాధకీ కరగలేకపోతే ఈ బాలగంగాధరుడు తన కవిత్వాన్ని, తన ప్రాణాన్ని గూడా బంగాళాఖాతంలోకి విసిరేస్తాడు' అంటాడు ఒకచోట! తన చుట్టూ ఉండే సమాజం ఎటువంటి స్థితిలో తల్లడిల్లుతున్నదీ గమనించి తన కవితకు ఈ లోకాన్ని 'గీటురాయి'గా, తన హృదయంలో పొంగి పొరలే కరుణను 'చిగురు తురాయి'గా ధరించిన మహా మనిషి తిలక్.

ఆయన నేటి మధ్య తరగతి కుటుంబీకులను చూచి పడిన

ఆవేదనను 'నీడలు' అనే కవితలో ఎలా వ్యక్తం చేసినారో చూడండి.

నిజంగా నేటి మధ్యతరగతి కుటుంబీకుడు అటు అంతస్తుల అంబరాల్లో అల్లంతదూరాన స్వేచ్ఛగా విహరించే ధనవంతులకూ, ఇటు రక్తాన్ని చెమటగామార్చి, కండలను కరిగించి, తరతరాలుగా గుక్కెడు గంజి నీళ్ళకు అర్రులు చాస్తూ, పడగాపులు పడుతూ ఈ సమాజమనే అడవిలో జీవిస్తూన్న బలహీనవరాలకూ చెందక గబ్బిలంలా తన జీవితాన్ని వెళ్ళమార్చుకుంటున్నాడు. ఎవరికీకాకుండా చివరికి దిక్కుమాలిన చావు రోజుకొకసారి చస్తున్నాడు. మొండి అయుర్దాయంతో మళ్ళీ బ్రతుకుతున్నాడు. జీవచ్ఛవంలా జీవిస్తున్నాడు. "మా తాతలనాడు మేము నేతులు తాగాము. మా మూతులు వాసన చూడండి" అంటూ, పాతకాలపు ఆడంబరాలకూ, ఆర్భాటాలకూ పోతూ 'చింత చచ్చినా పులుపు చావలేద'న్నట్టు భూతకాలపు ఊబిలో దిగబడి, బయటకు వచ్చే ఓపికలేక, తనను చూసి తానే భయపడుతూ, వ్యర్థ జీవితాన్ని గడుపుతున్నాడీ మధ్యతరగతివాడు. ఈ తరగతికి చెందినవారు 'రేపటిని గురించీ, సంఘాన్ని గురించీ, చివరకు తమలో దాగిన తమను చూసే భయపడి పోతారనీ, అందరూ గతంలో కూరుకుపోయిన గతించిన కాలపు నీడల'నీ అంటాడు తిలక్.

అంతేకాదు. 'వీళ్ళందరూ తోకలు తెగిన ఎలుక'లట! 'కలుగుల్లోంచి బయటికి రాలేర'ట! 'లోపల్లోపలే తిరుగుతా'రట !

ఎలుక మూర్ఖత్వానికీ, అజ్ఞానానికి ప్రతీక. అంతేకాదు. ఈ మధ్యతరగతి ప్రజలు తాతలనుండి నాటి ఆస్తిపాస్తులవే తోకలు తెగిన ఎలుకలు. ఎలుకకు తోక ప్రాణంవంటిది. అది లేకపోతే సరిగా సంచరించలేదు. కాని తన మూర్ఖత్వాన్ని విడవనూలేదు. అలాగే తమ పాత పద్ధతులనూ, ఆచార వ్యవహారాలనూ విడిచిపెట్టి బయటకు రాలేరు వీరు. ఆ లోకంలతోనే సంచరించుతూ కూపస్థమండూకాల్లా బతుకుతారు అంటే వీరి పాత ఆచార వ్యవహారాలనే కలుగుల్లోనే గిరగిరా తిరుగుతూ ఉంటారన్నమాట!

అందుకే వీరిని కవి 'సంఘపు కట్టుబాటకు రక్షకభటులనీ, శ్రీమంతుల స్వేచ్ఛావర్తనకి నైతిక భాష్యకారులనీ, శిథిలాలయాలకు పూజారుల'ని విమర్శిస్తాడు.

ఈ మధ్యతరగతి వారికి మానవత్వం కూడా స్థిరంగా ఉండదు ఎప్పుడేమి ముంచుకొస్తుందో అనే భయం వీరిని వదలకుండా వెన్నంటి ఉంటూనే ఉంటుంది పెనుభూతంలా. అందుకే వీరిని 'సగం సగం మనుష్యులం'టాడు కవి.

మరి వీరి నిత్యకృత్యం చూడండి: 'పురాణాలు చదవటం, పాపం పుణ్యం కేటాయించటం, డైలీపేపరు తిరగేయటం, జాలి పడినట్టు నటించటం, చప్పబడిన నిన్నటి మాటల్ని మాటాడటం, కప్పబడిన నిన్నటి కలల్ని, తలపోయటం, చిరునవ్వు (రాకపోయినాసరే) నవ్వుకోవటం'- ఇదీ వరస.

ఏ పని చేదామన్నా భయం, అనుమానం. ఇంతకంటె పెద్ద రోగం మరొకటి అక్కర్లేదు ఇటువంటి దుఃఖ భాగినులను 'ముక్కలైన గాజుపెంకులు, చెల్లాచెదరైన మూగముత్యాలు కల్లాకపటం తెలియని కబోదిగుంపులు తమని తామే మోసగించుకునే విద్యార్థి కులు, విదూషకులు, తమ చెట్టు కొమ్మని తామే నరుక్కునే అమాయకులు, సంప్రదాయకులు' అని కన్నీరు కారుస్తాడు తిలక్.

ముక్కలైన గాజుపెంకులు కోల్పోయిన ప్రకాశ శక్తికీ, చెల్లాచెదరైన మూగముత్యాలు పతించిన ఆకారాలకీ, విలువకూ, కబోది గుంపులు అజ్ఞానాంధకారానికీ, విద్యార్థికులు బుద్ధిజాడ్యానికీ, విదూషకులు అవహేళన పాలవటానికీ, కవి యెన్నుకున్న చక్కని ఉపమానాలు.

ప్రతిమాటకూ కొంతబరువూ కోణం, వాడి, శక్తి ఉంటాయి. అవి సంపూర్తిగా తెలుసుకున్నవాడే ద్రష్ట. మాటల తేటలమంచి కవితామృతాన్ని ఒడుపుగా పిండగల శక్తివంతుడే స్రష్ట. అతని సృష్టియే ఉత్తమ కవిత. ఈ కోవకి చెందినదే తిలక్ కవిత.

మధ్యతరగతి వారిని ఏవిధంగా చూచినా దురదృష్టవంతులే, పాపం! మండే ఆకలి మంటల్ని పూర్తిగా చల్లార్చుకోనీయలేని దయనీయస్థితి వీరిది. కాని స్వైకిమాత్రం 'పాతకాలంలోని నీతుల్ని వల్లిస్తూ' ప్రస్తుత కాలాన్ని దొల్లిస్తూంటారు. కటిక దరిద్రంలోనే 'హరి దా సోఫలి' గుర్తిస్తూంటారు. గంపెడు పిల్లల్ని కని, ఇంటెడు చాకరీ నెత్తిన వేసుకొని, మూల్గుతూ మూల్గుతూన్న

వారులకు పీరు సహనాన్ని బోధిస్తారు తమ భీరుత్వానికి రంగుపూసి వీరు తమ సహనాన్ని, ధైర్యం' అని పిలుస్తారు. అందుకే ఇలాంటి పిరికి పందలవద్ద 'డైనమైట్ పేలాలి' అనీ, 'డైనమోలు తిరగాలి' అనీ అంటాడు తిలక్ విమర్శిస్తూ.

కవితకు వాస్తవికత, భావుకత పరస్పరాశయాలయితే తిలక్ భావుకత్వపు కోణంనుంచి అధునాతన వాస్తవిక జీవితాన్ని తిలకించి, మనముందుంచి, తరించినాడు. 'రేపటి ఉదయానికి యీవేళ వెలుగుల్ని సమకూర్చుకోవాలి' అనే మనస్తత్వం కలవాడు తిలక్. పరిస్థితుల ప్రవాహానికి కుంగిపోవటం ఆయన స్వభావానికి విరుద్ధం. 'మురికికాల్వమీద ముకుళితనందనం, మృషాజగతిమీద మహోదయం వికసించదు వసంతం హసించదు', 'సంపదాయ భీరువుకీ, అస్వతంత్ర వితంతువుకీ వసంతంలేదు' అంటాడు 'శిఖరారోహణ' అనే కవితలో తిలక్.

ప్రాచీన కవిత్వంలో లేని నవతాకవితలు కనిపిస్తాయి తిలక్‌లో. నవత ఉన్నప్పుడే కవిత రాణిస్తుంది. 'ప్రతి కవితా పాఠకుడికి, కవికి కలిగిన అనుభూతి ఆకారాన్ని అందించి, హత్తుకొని, కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి కదిలించాలి' అని తిలక్ కవితాశయం. అందుకే 'కవిత్వం' ఒక 'ఆల్కెమీ' అంటాడాయన.

ఆధునిక నాగరికతా వలయంలో విర్తీనంగా బ్రతుకుల నీడుస్తూన్న మధ్యతరగతి ఉద్యోగస్తులను 'గొంగళీ పురుగుల'నడంలో ఇదే విశేషం కనిపిస్తుంది. 'గొంగళీపురుగు' అందవికారమైన ఒక అల్పజీవి. చూస్తేనే ఒళ్ళు జలదరిస్తుంది. చీదరింపు కలిగిస్తుంది. ఇది నిరాశా నిస్పృహలకు ప్రతీకవంటిది. ఈ దశలో ఇది కనబడిన ఆకునల్లా 'గుడ్డెద్దు చేలోపడ్డట్టు' మేస్తూ, ముందుకపోతూ మత్తుగా పడుకొని, భవిష్యత్తులో రాబోయే సీతాకోక చిలుక దశను గూర్చి తీయటికలలు కంటుంది. అల్లుకున్న గూడులో కళ్ళు మూసుకుని, ఒళ్ళు ముడుచుకొని కాలం దొర్లిస్తూంటుంది.

అలాగే మధ్యతరగతి మానవుడు గానుగెదు జీవితాన్ని 'బల్లపరుపుగా పరుచు'కుంటాడు తన జీవితంమీంచి ఎంతమంది ఏ రకంగా నడిచిపోయినా చీకూచింతాలేని మానవుడతడు.

అందుకే అతని భార్యామణి తాపీగా వచ్చి

'పంచదారలేదు పొండబా లేదు!
బొగులేదు- రాతికి రగులేదు'

అని రోజూ పాడే పాత పాటకీ, నిత్యం చచ్చే బాధకీ అతని దృష్టిలో విలువేముంటుంది? విని కూడా సమాధానం చెప్పడు కదలకుండా. మెదలకుండా పడుకుని, భవిష్యజ్జీవనానికి సంబంధించిన 'పగం పగం కలల్ని నెమరేస్తూ' నిద్రపోతాడు.

ఈనాటి ప్రతి మధ్యతరగతి ఉద్యోగికీ ఇది మామూలు విషయమే! గానుగలోక ఉద్యోగాన్ని రెక్కలు ముక్కలయేటట్టు చేసి, ఇంటికి కాళ్ళీడ్చుకుంటూ జీవచ్ఛవంలా వచ్చి, కుర్చీలో కూలబడ్డ వెంటనే, ఏ చల్లనీళ్ళో, వేడినీళ్ళో తెచ్చిచ్చే వంకతో అరాంగి అరం లేని ప్రసంగంతో ప్రారంభించి, కావలసిన వస్తువుల జాబితా చేతి కందించటం, అదిచూసీ చూడకుండానే నిట్టూర్పుల తూరాగలో పక్కకు తోసివేయడం! రోజూ ఆవకాయ తిన్నట్టు' అలవాటైన 'టీస్ జీవితమే' ఈ చిన్న ఉద్యోగికి.

చూడండి—

'బల్లపరుపు జీవితంకింద కాషన్‌గా దాచిన
కోర్కెల సీక్రెట్ బాక్స్‌లోంచి తీసి
ఉద్రేకాన్నీ, సెక్స్‌నీ, శృంగారాన్నీ
క్రైమ్‌నీ, షాక్‌నీ, లాటరీ కాగితాన్నీ
చాటుకుండా చూసుకుని
నవ్వుకుని నిస్పృహ మెలెసుకుని
మాట్లాడకుండా జెంటిల్మన్‌లా
మత్తుగా పడుకుంది గొంగళీపురుగు'

ఇందులో వాడిన 'కాషన్, సీక్రెట్' ఇత్యాది ఆంగ్లేయపదాలు నింత భావార సోఫాకాలో గమనించండి. మాటకున్న శక్తిని, పద సూక్ష్మరుచి చూపించేవి ఇవి. తెలుగు సమాసాలో విలీనమయిపోయాయి. అందుకే తిలక్ 'అక్షరాలు' ప్రజాశక్తు లవహించే విజయ ధ్వజాలు.'

ప్రతివాడికీ కోరికలుండటం సహజం కాని అందని పండుకోసం అర్రులు చాచటం అవివేకం. అయితే చిన్న ఉద్యోగి అయిన ప్రతివాడికీ ఇది మామూలే! అసలే ఎముక బొడుగూలే ఉద్యోగం దానికిలోడు స్వర్గంలో విహరించే కోరికలు. అందుకే వాటిని 'కాషన్'గా సీక్రెట్ బాక్స్‌లో దాచుకుంటాడు. తనకు నిత్యమూ

జరుగుతూన్న అన్యాయాల నెదిరించాలనే ఉద్దేశం, ప్రకృతి సిద్ధమైన లైంగికానుబంధము, కొత్త మోజులుపడే శృంగారం, పని సాధిద్దామనే తెగింపు, ప్రత్యణువులో జీర్ణించుకొనిపోయిన భీరుత్వం, జీవిత వైకుంఠపాళీలో పెద్ద నిచ్చెనలా కనబడే లాటరీ కాగితం— ఇవన్నీ చిదంబర రహస్యాలే! చాటుగాతీసి చూసుకొని, ముడుచుకొని దాచుకోవలసినవే! కాని వెంటనే నిరాశా నిస్పృహలవల్లో క్రైమ్‌కి కూడా తెగించిన గుండెలు తీసిన మొనగాడు. ఒక్కసారిగా 'జెంటిల్మన్' అవుతాడు. ఏదీ ఎవరికీ చెప్పే ధైర్యంగాని, చేసే సామర్థ్యంగాని లేని దౌర్భాగ్య దామోదర చక్రవర్తి ఈనాటి ఉద్యోగి!

'కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పు కోటానికైనా' ధైర్యం లేని నిరాశాజీవియాతడు. అందుకే 'బస్‌షాప్ దగ్గర సరాయి ఆడది తనకేసి చూచినా, మెరీనా కాంటీన్ యీవల నుంచుంటే మినపట్టు వాసన ఘాటుగా వేసినా, అసలు అప్పుడే కాంగ్రెస్‌లో చేరివుంటే ఈపాటికి మినిస్టర్ని అయేవాడినవిపించినా', పెళ్ళాందగ్గర వర్యాగానైనా చెప్పుకోలేని దురదృష్టవంతుడు ఈ ఉద్యోగి.

ఇందులో మొదటిది అసమర్థతకూ, రెండవది ఆర్థికదుస్థితికీ మూడవది ఎంపికకూ నిదర్శనాలు. చివరి దానిలో నేటి రాజకీయాలపై చేసిన వ్యంగ్యంకూడా కనబడుతుంది. నిజంగా ఈ 'అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు'.

నేటి మధ్య తరగతి ఉద్యోగి కట్టుకున్న పెళ్ళాంతోకూడా మనసువిప్పి మాటాడుకోలేడు పాపం! "హయ్యో రామ పిబతుక్కి' ఇంత అదృష్టంకూడానా" అని ఎక్కడ మూర్ఛ వీరుస్తుందోనని భయం అందుకే 'ముడుచుకుపోయిన గొంగళీపురుగు తన్ని తనే తీసుకొని గోడఅవతలకి తన్ని తానె గిరవాటేసుకుంది అని అంటాడు తిలక్.

ఇందులో 'ముడుచుకుపోవటం' లో నిరాశా నిస్పృహలకు లోనయిన పరిస్థితి. తన్ని తానె గిరవాటేసుకోవటం'లో ఆశలన్నింటికి శాశ్వతంగా నీళ్ళు వదులుకోవటం ద్యోతకమవుతుంది.

ఇలాంటి వారు లక్షలు లక్షలు ఈనాడు. ప్రతిచోటా ప్రత్యక్షమవుతున్నారు ఈ భయంకర స్వప్నికమూన్ని మానవయత్న వైఫల్యాన్ని ఊహించుకొని ఒణకపోయాడు తిలక్.

తాను చూచిన అభాగ్యులను కొందర్ని ఉదాహరిస్తాడు చూడండి :

కోటేశ్వరరావు మొదటివాడు. ధనంవల్లకాకపోయినా రోజా ఆఫీసుకు కోటుతొడుక్కుని పోతూ తనపేరును సార్థకం చేసుకుంటాడు. అతనిది తొణకని, బెణకని మనస్తత్వం అందుకే 'భూకంపం వచ్చిందనా, మరోయుద్ధం రేగిందన్నా, తన భార్య కవలల్ని కన్నదన్నా' కంగారు పడక తాపీగా ఆఫీసుకెళ్ళొస్తాడు. దేనికి చలించక నిద్రాణ స్థితిలో బండబారిన మొద్దు జీవితానికి ఒక ప్రతీక ఈతడు.

రెండవవాడు వీరేశ్వరరావు. అధిగనాయకుడు. పగలల్లా ఆఫీసులో గొడ్డుచాకిరిచేసి ఇంటికొచ్చి నిద్రపటక మనశ్శాంతికోసం రాత్రి రెండో ఆట సినిమాకెళ్ళివస్తూ దారో రత్నమ్మ ఇంటిముందు రిక్షాలో దిగిన కామాంధుడి జేబులోంచిపడిన పర్సును భద్రపరచి, తిరిగి వచ్చిన తరవాత ఆతనికిచ్చి 'థాంక్స్' బిరుదును సంపాదించుకొని సంతసిస్తాడు ఈ కలియుగ ధర్మాత్ముడు. ఇది అసమర్థుని జీవయాత్రకొక నిదర్శనం.

మూడవవాడు వీరేశ్వరరావు. నిరుద్యోగి. అయినా వినయశీలి. అందుకే 'ఆతడి కుడిచేయి ఆఫీసర్లాస్తే సాల్యూట్ చేస్తుంది. ఆకలేస్తే గబగబా రాస్తుంది' రాయకేంచేస్తుంది పాపం! ఆకలి మంట చల్లార్చుకునే ఉపాయం వెలాగూలేనప్పుడు. రాసిరాసి బుర్ర ఖరాబయితే మాత్రం జేబులోంచి సెకండ్‌హాండ్ సిగరెట్టుముక్కల్ని తీస్తుం'దట! లోపలున్న ఆవేదనల పొగల్ని, ఆవేశాల సెగల్ని బయటికి క్రక్కడానికి. సిగరెట్టుముక్క లాతని ఆరిక దుపితికీ, నేటి మధ్యతరగతి ఉద్యోగి వ్యవస్థకు కవి చూపిన స్మృతి చిహ్నాలు. మరి కుడి చెయ్యి ఇటాగయితే 'ఎడమచెయ్యి నవ్వుకొంటూ ఎలక్ట్రిక్ స్తంభాన్ని అనుకుని షాక్‌తగిలి చల్లగా ప్రాణం తీస్తుం'దట. నిరుద్యోగ బారిపోయే వీరేశ్వరరావు నిస్సహాయ నిరాశాజీవి కొక తార్కాణం.

నాల్గవవాడు జోగీశ్వరరావు. నిజంగా ఈతడు కలియుగ యోగీశ్వరుడే! కోటీశ్వరరావుకు పోటీ. 'బ్లాక్ మార్కెట్‌లో బియ్యం బ్రాకెట్లు ఓపెనింగులు, క్లోజింగులు, థియేటర్లో కొత్తసినిమా, కాఫీహోటల్ రేడియోలో లతా, రోడ్డుమీద ఖరీదైన కారూ విన్ని కలో వెగినవారి ఊరేగింపు, కేకలు, కోకలు, మూకలు మురిసిన బజారు రోడ్డమ్మట వీనులుండి వినక, కళ్ళుండి కనక సిటార్లా

నేరుగా నడుస్తాడు.' సాధారణంగా ఈ చెప్పిన విషయాలన్నీ నేటి మానవుడు 'నాగరికత' అని పిలిచే నగ్నంగా పరిగెత్తే సత్యాలు. కాని వాటికికూడా లొంగని మనస్తత్వం అలవరుచుకున్నాడు జోగేశ్వరరావు. నిరాశా మేఘాలావరించిన ఆతని జీవితాకాశగమనమే దీనికి ముఖ్య కారణం.

ఇలాంటి గుమాస్తాలు, టీచర్లు, చిన్నచిన్న సంసారులు గొంగళీ పురుగు జీవితాలను అనుకరిస్తున్న వారెందరో ఈనాడు!

ఉద్యోగంలో చేరేముందు ప్రతివాడికీ కొన్ని ఆదర్శాలు, ఆశయాలుంటాయి. కాని కొన్ని రోజులకా విషయాలన్నీ జీవిత రథచక్రాల కిందబడి తుత్తునియలవుతాయి. పూర్వపు స్నేహాలకు స్మృతి చిహ్నాలుగా ఉన్న 'గోడమీద గ్రూప్ ఫొటోలు,' కష్టపడి సంపాదించుకున్న 'బియ్యే డిగ్రీలు' కృశిస్తాయి. అప్పుడు నిత్య నైమిత్తిక మృద్భిత్తి కల గుళ్ళు కడతాడు. వాటిలో 'సంఘ గౌరవ భైరవ దైవతమూర్తి' ప్రతిష్ఠిస్తాడు. రసహీనమైన జీవితాన్ని నివాళిస్తాడు'.

'మృద్భిత్తిక' అంటే మట్టి గోడ. ఇది ఏర్పడిన నిర్జీవ జీవనానికి ప్రతీక. 'గౌరవ భైరవుల' నడంలో అక్రమంగా అందలా లెక్కిన పెద్దమనుషులను దుయ్యపట్టటంకనవస్తుంది. వక్రోక్తి కావ్యజీవితం కదామరి!

'విత్త......గుళు' అనే సమాసంలో వచ్చపు సువాసనలు గుబాళిస్తాయి తిలక్ కవితనుగూర్చి రమణారెడ్డిగారన్నట్లు.

జీవితపు రాళ్ళకోసం జీవితపు విలువల వలువలను చింపి, పీలికలు నేసుకొన్న మధ్యతరగతి ఉద్యోగస్తుల జీవితాలకు అధికారుల 'పీడ' లేకటని మేడలు! పెటని మాడలు! రోజావచ్చే పీడకలలే పన్నని వలలు వీరికి. వీటి వెనగా నీరసంగా నుంచునే అసమర్థులు వీరు. అందుకే 'చనిపోయిన కోర్కెల్ని, పాతిపెట్టిన శ్మశానాలను దాటుకొని అలవాట్ల ఆచారాల రైలుపట్టాలమీదనే' దొరుకుంటూ ముందుకు పోతారు వీరు.

అలవాట్లనూ, ఆచారాలనూ రైలుపట్టాల నడం ఒక విశేషం. జీవితమనే రైలుబండి అలవాట్లూ, ఆచారాలూ అనే రైలుపట్టాల మీద ఒక్కసారి ఎక్కిందంటే మళ్లీ వెనక్కి రావడం కష్టం. ఎటా గొలాగా బతుకుదెరువు బరువుల లగేజీని మోసుకుంటూ ముందుకు పోవలసిందే! దరిదాపుల్లో ఈ రైలుబండి ప్రయాణం ఆగదు విషాదాంత జీవితాంత మనే స్టేషను చేరితే తప్ప.

ఇంకా చూడండి తిలక్ జీవిత చిత్రణ.

'చిన్నప్పుడు తెలియక చేసిన తప్పుకు రోగాలు మిగుల్చుకొని, యౌవనంలో వృద్ధాప్యాన్ని తగుల్చుకుని, భయాల చాటున, ఏడుపు కొండలమాటున ఆఫీసులకు పారిపోతారట నేటి మధ్యతరగతివారు.

మామూగు మీసాల నూత్న యౌవనంలో ఒళ్ళూపై తెలియక, చికిలింతైశ్వర్యంకోసం పడిన తిప్పలకూ, కలిగిన సుఖానుభూతులకూ భూతాల్లాగా, స్మృతి చిహ్నాలుగా మిగిలిన రోగాలకూ, నిత్యం జీవితంలోపడే ఇబ్బందులకూ ముప్పది యేళ్ళకే ముసలివాళ్ళవుతున్నారు వీరు. దుర్భరమైన జీవితాలను భరించలేక విసుగెత్తి ఆత్మహత్య చేసుకుందామని అనుకుంటే 'పెళ్ళాం మాటో! బాసుకేకో!' విని బడి, అదికూడా సానుకూల పడదు ఈ తరగతి నిర్భాగ్యుడికి.

దాంతో 'భయపడి గజగజవణుకుతూ తిరిగి తన జీవితాన్ని బలవంతంగా పరుచుకొని దానిమీద నిద్రపోతాడు సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ, సగం చచ్చిన ప్రాణాన్ని జోకొడుతూ' అంటూ 'దిగులు నీరు నిండిన కోటి సంవత్సరాల కవిత'ను వినిపిస్తాడు తిలక్.

ప్రతిపదంలోనూ కవిత్వానికి కావలసిన 'భావనాప్రేరకత్వం, హృదయాకర్షణం, రసోజ్జృంభణం అనే మూడువిషయాలూ ప్రస్ఫుటమవుతాయి. ప్రతి పాదంలోనూ కవికున్న మనస్తత్వ పరిశీలన, అనుభూతి ద్యోతక మవుతాయి.

'మనిషీ, సంఘమూ, ఈ సర్వ జగత్తూ జ్ఞాన సరస్సులో విరిసిన ప్రేమ పద్మంలాగ సత్యం శివం సుందరంగిలమై ఉండాలి' అని నేపథ్య గాయనిలా 'నిలువెత్తు తెరవెనక నిలిచి' ఎలుగెత్తి చాటిన తిలక్ ఆశ, 'ఆగామి ఆశల నీలాగగనంమీద దిగో ఆనందాల అనే యింద్రధనుసు, అలమటించేలోకానికి అండగా నిలుస్తుంది నవకవి వచసుధా సుమనస్సు,' అని నిరీక్షణ ప్రపంచానికి పిలిచే తిలక్ పలుకులు అమృతపు చినుకులై లోకాన్ని, బాధామయ జీవితాలను పునీతం చేయాలని ఆశిద్దాం!

సింహావలోకనం

(షేక్స్‌పియర్ "REMEMBRANCE" కు తెనుగు సేత.)

కేప్టన్ శ్రీనివాస్

ఆలోచనా లహరి ఆస్థానంలోనే నున్నప్పుడు
ఆజ్ఞాపించాను నా గత జీవితాన్ని, హాజరు కమ్మని!
గత జీవితపు వ్యథలు, వర్తమానపు నిరాశలు,
అందుకోలేని ఆశలు నిట్టూర్పులతో నింపాయి
వ్యర్థమైంది నా జీవిత సమరం.
తిథి ఎరుగని మృత రాత్రిలో నా వారు దాగిన స్మృతి
విస్మరించిన విఫల ప్రేమ సంస్మృతి,
కనుమరుగైన దృశ్యాలు కలిగించిన ఖర్చు
నిమాత్న దుఃఖాను భూతికి కరిగిన ఈ అవకాశాలు,
ప్రవాహ మెరుగని నా కళ్ళను,
జ్ఞాపకాల కెరటాల నీళ్ళలో ముంచాయి.

అప్పుడే కదా,

వలదని వదులుకొన్న ఆ బాధలు తిరిగి పొందవచ్చు
గొంతులో ఆపుకున్న ఆ ఆక్రందన కథ తిరిగి చెప్పవచ్చు
గుండె గాయాలతో చెల్లించిన ఆ రుణం మళ్ళీ చెల్లించవచ్చు
— కాని మిత్రమా, ఆ క్షణం తెచ్చిన నీ జ్ఞాపకాలలో
అన్ని నష్టాలు పూరించుకున్నాను. బాధలు మృగ్యమయ్యాయి!

తెలుగులో స్వర సమీకరణ

శ్రీ చేకూరి రామారావు

(గత సంచిక తరువాయి)

ఇ> ఉ మారునే ప్రాచీన భాషలో (క్రియల్లో) పర్ణసమీకరణంగా గుర్తించిన చిన్నయసూరి "ఇత్వంబుగాని యేత్వంబుగాని కూడుచో నవాద్యంబైన యుత్వంబున కిత్వంబగు "(క్రియ 85)" అని సూతించారు. ఆధునిక భాషలో ఈ స్వరసమీకరణం విస్తృతమయింది. దీన్నిగుర్తించే గోపాలకృష్ణయ్య (1958) "ఇత్వంగాని ఏత్వంగాని (భూతకాలిక సమాపక క్రియల్లో వచ్చే వివృతమైన ఏ) కూడితే అనాద్యమైన ఉత్వానికి ఇత్వం బహుళంగా వస్తుంది. "(క్రియ-133)" "వ్యతిరేకార్థక అకారం పరమైతే అనాద్యమైన ఉత్వానికత్వం వైకల్పికం (క్రియ-154)" అని సూత్రాలు రచించారు. ఆధునిక పద్ధతిలో రచించిన వ్యాకర్తలలో కొన్ని మత భేదాలున్నాయి.

కృష్ణమూర్తి, (1961). కెలీ (1965), రామారావు (1969)లు మధ్యాచును ఉత్తుగా గుర్తించారు. ప్రకాశం (1972) మధ్యాచ్చును ఫలాని అచ్చుగా గుర్తించనక్కరేదనారు ఆధునిక భాషా ధాతువులో అనాద్యమైన అచ్చులు ఉద్వివ్రాలులేవు 'కాబట్టి వాటిని అచ్చులని గుర్తిస్తే చాలునని ప్రకాశం మతం. నడిమి అచ్చు యకార పరకమైనప్పుడే ఇత్తుగా ఉంటుంది కాబట్టి ఇన్మధ్య ధాతువులో కూడా ఫలాని అచ్చు అని ప్రత్యేకంగా చెప్పక్కరేదు. స్వరసమీకరణకు సంబంధించినంతవరకు ఈ మతభేదాలు ప్రధానంకావు. కాని ఉ> ఇ గా మారే సరిసరాల్లో మాత్రం కొన్ని మత భేదాలున్నాయి. పై వారందరూ దీర్ఘాచ్చులు, హ్రస్వాచ్చులు కూడా సమీకారాలు అవుతయ్యని అంగీకరించారు. సుబ్బారావు (1971)కి కూడా ఇది అంగీకార్యమే. కాని రామచంద్రరావు (1974) దీన్ని నిరాకరించారు. ఆయన మతంలో సమీకరణాన్ని, పొందేవి, కలిగించేవి హ్రస్వాచ్చులు మాత్రమే. ఇ, ఉలు మాత్రమే సమీకరణను పొందుతయ్యవి ఇ, ఉ, అ లు సమీకరణని కలిగిస్తయ్యని ఆయన వాదం. అడుగు+తే> అడిగితే అనే చౌదర్థక రూపాన్ని అడుగు+ఏ> అడిగే అనే క్రియాజన్య విశేషణాన్ని సాధించటానికి దీర్ఘాచ్చుల్ని కూడా సమీకారాలుగా గుర్తించాల్సి ఉంటుంది. సుబ్బారావు (1971) కూడా చదువ్+ఏ> చదివే అనే రూపాన్ని ఉదాహరించారు. (అయితే దీన్ని Imperative emphatic అనటం ప్రామాదికం కావచ్చు. స్త్రీ వాచక సంబుద్ధి ప్రత్యయంముందు ఇత్వసమీకరణం జరగటం ఈ వ్యాసకర్త పరిచితం). అడుగు+తే> అడిగితే' అనే రూపం 'తే' ప్రత్యయంలోని ఏ కారం కలిగించిందంటే అడుగు+తాడు> అడిగితాడు ఎందుక్కాలేదురామచంద్రరావు ప్రశ్న. అందువల దీర్ఘాచ్చుల్ని సమీకారాలుగా గుర్తించకూడదని రామచంద్రరావు నిర్ణయం. అందువల్ల అడిగితే అనే రూపాన్ని అడుగు+ఇతే అని విశ్లేషించాలని ఆయన సూచన. కాని 'అడిగే' అనే క్రియాజన్య విశేషణాన్ని సాధించటానికి ఆయన ఏ మార్గమూ సూచించలేదు. సుబ్బారావు కీ చిక్కులేదు. ఆయన వ్యాకరించిన భాషలో 'తే' ప్రత్యయంముందు సమీకరణ జరక్కుండా అడుగుతే అనే ఉంటుంది. ఆయన వ్యవహరించేది కాకినాడ ప్రాంతపు భాష. వ్యంజన పూర్వకమైన ప్రత్యయస్వరం సమీకరణను కలిగించలేదని సుబ్బారావు మతం. కాబట్టి రామచంద్రరావు అభ్యంతరం ఆయనకు వర్తించదు.

'అడుగుతాడు' అనే క్రియారూపంలో ధాతువులో సమీకరణ జరక్కపోటానికి రామచంద్రరావు ప్రకారం ప్రత్యయంలో ఉన్నది దీర్ఘస్వరం కావటం, సుబ్బారావు ప్రకారం ప్రత్యయస్వరం వ్యంజన పూర్వకం కావటం కారణాలు. వీరిద్దరి ప్రతిపాదనలకు విరుద్ధమైన ప్రయోగాలు తెలుగులో ఉన్నై.

కొ > కొడతాడు. చెడ > దలాడు చేర> చేరతాడు వెళ > వెళ డు అనే రూపాలో ధాతువులో చివరి అచ్చు అత్తు కవటానికి 'తా' ప్రత్యయంలోని దీర్ఘాన్నే కారణంగా చెప్పాలి. చెడు> చెడతాడు యిట్టుగా పొగుడు + తడు> పొగడతాడు

అని కావటంలేదు. (కొన్ని మండలాలో కావచ్చు. ఈ వ్యాస కర్త వ్యవహారంలో లేదు.) ఈ మార్పు రెండక్షరాల ధాతువులోనే జరిగింది. వెళు > వెళతాడు అయినట్లు గా మళు > మళతాడు అని గాని *మళతాడు అవిగాని కాలేదు. దీన్నిబట్టి రెండక్షరాల ధాతువులో అద్విరుక్త వ్యంజనం ఉన్నప్పుడే జరుగుతుందని గ్రహించవచ్చు. సమీకరణ కంటే ముందు వెళ్ళు, కొట్టు వంటి ధాతువులో ద్విరుక్త వ్యంజనం అద్విరుక్త మవుతుంది. మళు, మెట్టు వంటి ధాతువుల్లో ఈ మార్పు జరగదు. (రామారావు, 1969) రెండక్షరాల ధాతువులైనా ఉపధ వ్యంజనాలు అద్విరుక్తాలయి అగు > *అగతాడు, పొకు > *పొకతాడు అనే రూపాలు కావటం లేదు. దీన్ని నిరోధించటానికి "రెండక్షరాల ధాతువులో ఉపధ కంటే ద్విరుక్త వ్యంజన పూర్వకమైన చివరి అచ్చు తా ప్రత్యయం ముందు అత్తు అవుతుంది" అని సూత్రీకరించుకోవచ్చు. ఈ సూత్రం పదాలో కనిపించని చోటకూడా అత్తును విధిస్తుంది. ఉదా: చేసాడు, సేన్తాడు అనే రూపాల్లో అత్తు కనిపించదు. అయినా స, వ, ల తర్వాత ఈ సూత్రం వల్ల అత్తు వస్తుంది. ధాత్వక్షర స్వర వివృతీకరణకు ఈ అత్తు అవసరం. లేకపోతే సంయుక్త వ్యంజనాన్వితి కమియ్యే స్వర వివృతీకరణ జరుగుతుందనాలి ఉంటుంది. అందుకు ఆధారం కనిపించదు. పదంలో పరాచ్చు అత్తు అయితే పూర్వాచ్చు వివృత మవుతుంది. మేకు—మేక అనే పదాన్ని ఉచ్చరించి చూస్తే మొదటి అచ్చులో ఉచ్చారణ భేదాన్ని గమనించవచ్చు. పరంలో ఉన్న అత్తు ప్రభావంవల్ల మేక అనే శబ్దంలో ఏ అనే అచ్చు వివృతమయింది. ఇట్లా అన్ని అచ్చులూ వివృతమవుతై. ఇట్లా వివృతి కలిగించే సూత్రాన్ని స్వర వివృతీకరణ సూత్రం (vowel lowering rule) అంటారు. ఇది స్వరాల ఉచ్చారణ భేదానికి సంబంధించిన సమీకరణ. దీన్ని గిడుగు రామమూర్తి గారు 1912 ప్రాంతంలోనే గుర్తించారు (రామారావు, నరసింహారెడ్డి, 1972).

పై చర్చనుబట్టి తా ప్రత్యయం పరిమితమైన సమీకరణను కలిగించగలదని, సుబ్బారావు వ్యంజనపూర్వకత నియమం రామచంద్రరావు స్వర దీర్ఘత్వ నియమం ఈ సమీకరణను నిరోధించలేకపోతున్నట్లు తెలుస్తున్నది.

ఇది గాక అకార సమీకరణ జరిగే చోట్లు ఒకటున్నై. ప్రత్యక్ష విధి పరోక్ష విధిగా మారే సమయంలో ఈ సమీకరణ జరుగుతుంది.

తిను + అన్నాడు > తినమన్నాడు

అడుగు + అన్నాడు > అడగమన్నాడు.

ప్రత్యక్ష విధిలో 'అడుగన్నాడు' అవుతుంది గాని సమీకరణం జరగదు. పరోక్ష విధిలో మకారాగమం జరిగింది. అయితే ఈ మకారాగమానికీ స్వర సమీకరణానికి సంబంధం ఏమిటి? ప్రకాశం (1972) గుర్తించినట్లు గా స్వరసమీకరణం పదస్థాయి లోనే జరుగుతుంది కాబట్టి "అడుగన్నాడు" అనే చోట సమీకరణం జరగలేదు. పరోక్ష విధిలో అయినా అన్నాడు వేరే పదం అవుతుంది. ఇక్కడ అనుకృతిలో వచ్చే అని అనే రూపం అను ధాతు నిష్పన్న క్రియాపద వరకమైనపుడు లోపిస్తుంది.

అడుగు + అని + అన్నాడు > అడగమని అన్నాడు > అడగమన్నాడు

అడుగు + అని + చెప్పాడు > అడగమని చెప్పాడు.

సుబ్బారావు, ప్రకాశం-ఇద్దరూ ధాతువులో స్వరసమీకరణ జరిగిన తరవాతే మకారాగమాన్ని ప్రతిపాదించారు. వారు ప్రత్యేకంగా పేర్కొనక పోయినా ఆ తరవాత అని శబ్ద లోపం అను ధాతురూపం ముందు జరుగుతుందని గుర్తించి ఉండాలి. అయితే అని లోపం తరవాతకూడ ఈ సమీకరణ అట్లాగే నిలవటం విశేషం. పర సమీకారణమైన ప్రత్యయం లోపించి సమీకృత రూపం నిలిచే చోటు ఇంకోటి కనిపించదు. ఈ చిక్కును తొలగించాలంటే ఆగమాన్ని అమ్ అనే విధంగా ప్రతిపాదించవచ్చు. అట్లా చెయ్యటంవల్ల అని శబ్ద లోపాన్ని మిగతా సూత్రాలతో ముడిపెట్టకుండా తప్పించవచ్చు. అంటే అని శబ్దలోపం ఎప్పుడు జరిగినా స్వర సమీకరణకు ఆటంకముండదు. క్రమ సూత్రాలు (ordered rules) క్రమ రహిత సూత్రాలు (unordered rules) ఒకే రకపు రూపాలని సాధిస్తే క్రమరహిత సూత్రాలే ఎక్కువ అభిలషణీయం. సూత్రాల క్రమత్వాన్ని ఎక్కువ పొదుపుగా వాడుకోవాలని ఇటీవలి పరిశోధకుల అభిప్రాయం.

కాని అమ్-ఆగమ ప్రతిపాదన నిరాటంకం కాదు. 'పెళ్ళున్నాని, గుభిల్లుమని, ఢబేల్మని' వంటి ధ్వన్యనుకరణ శబ్దాల్లో

ఆగమం కేవలం మహాగంగానే కనిపిస్తుంది. ఆగమ శబ్దం అన్ అంటే అది స్వరలోపం వేరే చెప్పాలి. అన్ శబ్దాన్ని వ్యాసూత్రాల క్రమం నుంచి తొలగించటం అభిలషణీయమైనా అన్-ఆగమ ప్రతిపాదన లేనిపోని చిక్కుల్ని తెచ్చిపెడుతున్నది కాబట్టి నిరాకరణీయం. వేరేమార్గం తరవాత సూచించబడుతుంది.

సుబ్బారావు (1971) అని శబ్దం సమీకరణ కలిగించలేని కొన్ని అనుకూల రూపాల్ని ఉదాహరించారు. తెలుసు + అని > తెలుసని అయిందేగాని *తెలిసని కాలేదు. దాన్ని నిరోధించటానికి తెలుసుము + అని మూలరూపంగా ప్రతిపాదించి స్వరసమీకరణ సూత్రం వర్తించిన తరవాత ము శబ్దలోపం చేస్తే ము శబ్దం స్వరసమీకరణను నిరోధించి తరవాత తను తొలగిపోతుందని వారి వివరణ. ము శబ్దం స్వరసమీకరణను ఎందుకు నిరోధించాలి? అంటే ము శబ్దానికి అటువంటి నిరోధక శక్తిని అదనంగా ప్రతిపాదించాలన్నమాట. ఈ ఉదాహరణలు మకారాగమానికీ స్వరసమీకరణానికీ ఉన్న సంబంధాన్ని తెలియజేస్తున్నాయి. దీనివల్ల అని కి ఉందనుకుంటున్న సమీకరణ సామర్థ్యాన్ని శంకించాల్సి వస్తున్నది.

ప్రకాశం (1972) స్వరసమీకరణం జరిగేవి జరగనివి మరి కొన్ని రూపాలు ఉదాహరించారు. కదులమ్మా-కదలవమ్మా — కదలయ్యా-కదలవయ్యా అనే విధంగా వకారాగమం రానిరూపాలు వచ్చే రూపాలివి. అమ్మా, అయ్యా శబ్దాలు బంధుత్వ బోధకాలయితే వకారాగమం రాదని, కేవల సంబుద్ధి బోధకాలయితే 'వ' కారాగమం వస్తుందని చెప్పారు. అందుకుపబలకంగా కదులక్కా, కదులన్నా అనే వకారాగమం రాని రూపాలను ఉదాహరించారు. కలదవే అనేచోట వకారాగమానికి ఏ ప్రత్యయం కేవల సంబుద్ధి బోధకం కావటమే. ఇట్లా అనేకన్నా స్వరాది సంబుద్ధి బోధక ప్రత్యయాలముందు వకారాగమం వస్తుందని సూత్రీకరించుకోవచ్చు. అంటే బంధుత్వ బోధ ప్రసక్తి అనవసరమన్న మాట. స్వరాది అవటం కదలరా వంటి రూపాల్లో వకారాగమాన్ని నిరోధించటంకోసం. ఇక్కడ గమనించాల్సింది కదలరా, కదలవే అనే రూపాల్లో ధాతువు అత్వసమీకరణం పొందటం. కదలరా లో దీర్ఘాకారం సమీకరణను కలిగించిందంటే కదలరోయ్ అనే రూపంలో అటువంటి పరిసరం లేదు. ఇట్లాంటి రూపాలన్నీ నిర్ధారకంలోనే వస్తున్నాయి కాబట్టి విధిలో ధాతువు కదల అనేవిధంగా మారుతుందని ప్రకాశం నిర్దేశించారు. ఇట్లాంటి రూపాల్ని సుబ్బారావు కూడా ఉదాహరించి 'ను + అ + వోయ్' అని విడదీశారు. ఇక్కడ 'అ' కారాన్ని గుర్తించటం సరైనదే. ఈ అకారం ఎక్కడనుంచి వచ్చిందీ సుబ్బారావు చెప్పలేదు. ప్రకాశం పద్ధతిలో ఈ రూపాలు విధి ఏకవచన ప్రత్యయమైన ఉ ఏ అని, సంబుద్ధి ప్రత్యయాలముందు అ-గా మారటంవల్ల వచ్చినవి. [illegible] కూడా ఆగమాన్ని అవ్ అని ప్రతిపాదించవచ్చుగాని, రా, రోయ్ ప్రత్యయాలకు అర్-ఆగమాన్ని సూచించలేం.

ఇవాది ప్రత్యయాలైన క్త్వార్థక-ఇ, భూతకాలిక సమాపక ఇన్, భూతకాలిక క్రియాజన్య విశేషణ-ఇన అప్యర్థక-ఇనా ప్రత్యయాలముందు అడుగు> అడిగి అనేవిధంగా మారటంలో స్వర సమీకరణ రుజామార్గంలోనే ఉంది. చేదర్థక-తే ప్రత్యయం, భూతేతర కాలిక క్రియాజన్య విశేషణ-ఏ ముందు కూడా అడిగి అనేవిధంగా రావటంలోనే చిక్కులున్నాయి. అట్లాగే అదాది ప్రత్యయాలైన వ్యతిరేకార్థక-అ, తుమున్నర్థక-అనే, భావార్థక అటం వ్యక్త్వార్థక-అకం ప్రత్యయాలముందు అడగ-అనేవిధంగా సమీకరణ రావటంలో బాధలేదు. కాని పరోక్ష విధిలో వచ్చే వకారాగమంముందు, సంబుద్ధిలో వచ్చే వకారాగమం ముందు, రా, రోయ్ ప్రత్యయాల ముందు, నిషేధార్థంలో వచ్చే కు ముందు అత్వసమీకరణ రూపాలు రావటంలోనే చిక్కులున్నాయి. పరిమితంగానైనా తా ప్రత్యయం ముందు అదంత రూపం రావటం చిక్కే.

చాలా రూపాల్లో ధాతువుకువచ్చే హ్రస్వ స్వరాది ప్రత్యయాలే సమీకరణను కలిగించటం పై ఉదాహరణల్లో గమనించవచ్చు. అంటే సుబ్బారావు (1971) రామచంద్రరావు (1974)ల సూచనలు రెండూ అభిలషణీయాలే. అట్లా లేనిచోట సమీకరణను వ్యాకరించటం ఎట్లా అనేదే సమస్య.

అందుకు ఈ వ్యాసకర్త సూచించే పద్ధతి ఇది :

తెలుగు ధాతువుల చివరి అచ్చును ధాత్వంగంగానే పరిశ

ణిస్తే. ధాతువును విస్తరింపజెయ్యటానికి ధాతుస్వరూపాన్ని ప్రయోగించటమేకాక ఇ,అ అనే అచ్చులను చేర్చే పద్ధతి ఒకటి ఉంది. వీటిని క్రమంగా ఇదీస్వరణ అదీస్వరణ అని వ్యవహరిదాం. కడిగిపెట్టు, కడిగివేయు, రాలిపోవు అనే క్రియలో మొదటి ధాతువుకు ఇ ప్రత్యయం చేరింది. ఇది క్త్వార్థక ప్రత్యయం కాదు. క్త్వార్థక క్రియ భిన్న వ్యాపారాలున్నప్పుడే వస్తుంది. ఇక్కడ ఇతు ధాతువిస్తారక ప్రత్యయం. అట్లాగే అరగదీయు, అరవేయు; కనపడు, వెడగొట్టు, చేరదీయు, తిరగబడు వంటి ధాతుక్రియలో మొదటి ధాతువులో అతు తుమున్నంతం కాదు ధాతు విస్తారక ప్రత్యయం ఈ పద్ధతినే అనుసరించి ఇదీస్వారిత ధాతువులమీద తే, ఏ ప్రత్యయాలు చేరినయ్యని అదీస్వారిత ధాతువులమీదకు, వద్దు, రా, రోయ్ వంటి ప్రత్యయాలు, మకార, వకారాగమాలు చేరినయని చెప్పుకోవచ్చు. అప్పుడు ధాతువులకు చేరే ప్రత్యయాలను మూడు విభాగాలు చెయ్యవచ్చు. 1. విస్తరణ విరపేక్షకాలు. హస్వరాది ప్రత్యయాలన్నీ ఈ వర్గం లోనే చేరుతై. అడుగుతే అని వ్యవహరించే దాంట్లో తే ఈ వర్గం లోనే చేరుతుంది. 2. ఇదీస్వరణాపేక్షకాలు చాలావరకు భాషలో తే. క్రియాజన్య విశేషణ ప్రత్యయమైన—ఏ ఈ వర్గంలో చేరతై. 3 అదీస్వరణాపేక్షకాలు ఆగమ మకార, వకారాలు. సంబుద్ధి రా, రోయ్ ప్రత్యయాలు. విషేధార్థకమైన కు మొదలైనవీ వర్గంలో చేరతై. ధాతు విస్తరణ (stem derivation లో అవసరమైన ప్రక్రియనే పద నిష్పాదన (stem inflexion) లో కూడా వాడుకోటంవల్ల ప్రక్రియాధిక్యంకూడా లేదు ఈ పద్ధతివల్ల తెలుగు స్వర సమీకరణ సులువు అవుతుంది ఇంకా పరిశీలించలేదు ని క్రియానిష్పాదనకూడా తేలికవుతుంది వ్యాకరణంలో ఈ ప్రత్యయాలను ఉటంకించినప్పుడు వాటితోపాటు వాటి సామర్థ్య సామర్థ్యాలనుకూడా చేర్చాలి. ఉదాహరణ ప్రాయంగా ఈ కింది వాటిని గమనించవచ్చు.

1. తే [చేదర్థకం; ఇదీస్వరణాపేక్షకం]
2. ఏ [క్రియాజన్య విశేషణం; ఇద్యస్వరణాపేక్షకం]
3. తా [భూతేతరకాలికం]
4. దా [ఉభయప్రార్థనం]
5. వా [పరోక్ష విధ్యర్థకారకం, ధ్వన్యనుకరణానా కారకం. అదీస్వరణాపేక్షితం]
6. వ్ [స్వరాద సంబుద్ధిబోధక ప్రత్యయ పరకం, అద్యస్వరణాపేక్షకం]
7. కు [వ్యతిరేక విధి, అదీస్వరణాపేక్షకం]
8 రా [సంబుద్ధి, అద్యస్వరణాపేక్షకం; పదపూర్వకంగా ఆదర బోధకం]
9. రోయ్ [సంబుద్ధి, అద్యస్వరణాపేక్షకం; పదపూర్వకంగా అనాదరార్థకం]
10. లు [నామబహువచనం, సమీకరణ సమర్థకం]

పై ఉదాహరణ ప్రాయమైన పట్టికలో తా, దా లకు విస్తరణాపేక్షను విధించలేదు చెడు, చేరు, ఆడు, పాడు వంటి ధాతువులో మాత్రమే ఉ>అవుతున్నది గనక ఈ పరిమిత సమీకరణాన్ని అదీస్వరణ లేకుండా సాధించవచ్చు. లేకపోతే పరిమిత అదీస్వరణాపేక్షత్వాన్ని ప్రత్యయానికే విధించవచ్చు. ఆపక్షంలో తా, దా లకు విధించే అదీస్వరణాపేక్షకత్వానికి ధాతువులో అక్షరసంఖ్య, రెండో వ్యంజనం లక్షణాలను పరిసరంగా విధించవచ్చు. అప్పుడు పరిసరాన్ని ఈవిధంగా రాయవచ్చు.

$$(C)V\begin{bmatrix}+\text{వ్యంజనం}\\ \text{ఓష్ఠ్యం}\\ \text{కంఠ్యం}\end{bmatrix}V+-$$

C అంటే వ్యంజనం' V అంటే అచ్చు. ధాతువులను హలంతంగా గ్రహిస్తే రెండో V ని పరిసరంనుంచి తొలగించవచ్చు. పైన సూచించిన రెండు పద్ధతుల్లో ఏది గ్రహించినా సమీకరణంగానే అర్థం చేసుకోవచ్చు. (స్వాతంత్ర్య పద్ధతికి, చూ రామారావు, 1970)

విస్తరణ ప్రక్రియ ధాతువుకే జరుగుందని గమనించాలి. పూర్ణ క్రియారూపానికి జరగదు. తెలుసురా అనేచోట విస్తరణ జరక్కపోవటానికి తెలుసు అనేది ఇక్కడ పూర్ణ క్రియారూపం. అని స్వర సమీకరణ సమర్థం కాకపోవటంవల్ల, తెలుసు సంపూర్ణ

క్రియారూపం కావటంవల్ల *తెలసని, *తెలసనని అనే రూపాలేర్పడవు.

ఇప్పటికే విస్తారమైన ఈ చర్చను ఇంతటితో ముగిస్తూ ప్రధాన విషయాలను ఈ విధంగా క్రోడీకరించవచ్చు.

1. ప్రాచీనాధునిక భాషల్లో ప్రత్యయాల్లో జరిగే సమీకరణను ప్రకృతుల సమీకరణంనుంచి వేరు చెయ్యాలి. ప్రత్యయాలో ఉ> ఇ అనే మార్పే సర్వత్రా ఉంది,

2 ప్రాచీన భాషలో నామాల్లో ఇ > ఉ అనే మార్పు, క్రియల్లో ఉ> ఇ అనేమార్పు సంఖ్యావాచకాల్లో రెండు మార్పులూ ఉన్నై. ఆధునికభాషలో క్రియేతర శబ్దాల్లో భాషలో మార్పులతో దాదాపు సమానం. క్రియల్లో మాత్రం ప్రాచీన ఉ> అ అనే మార్పు అదనంగా వచ్చింది. ఆధునిక వ్యవహారంలో మిగిలిన అన్మ, ఇన్మధ్య ధాతువులు ఉన్మధ్యాలుగా మారినై. ఇత్వమీకరణలో కొత్త పరిసరాలు చేరినై.

3 ఆధునిక భాషాక్రియలో ధాతువుకు హ్రస్వ స్వరాది ప్రత్యయాలే స్వరసమీకరణను కలిగించేవిగా గుర్తించటం అభిలషణీయం.

4. పై నిర్ణయంవల్ల ప్రత్యయాలను అద్విస్వరణ, ఇద్విస్వరణ నిర్విస్వరణ-అపేక్షకాలుగా విభాగించి గుర్తించాలి ధాతువులను హలంతంగా గ్రహిస్తే ఉద్విస్వరణాపేక్ష కూడా అవసరం.

5. విస్వరణ సామర్థ్యంలేని ప్రత్యయాలు స్వరసమీకరణను కలిగించలేవు. (ఇందుకు అండి ప్రత్యయం బాధకంగా ఉంది).

6. స్వరసమీకరణం ఏకపద తుల్యరూపాల్లోనే జరుగుతుంది.

[సమాప్తము]

రిఫరెన్సులు

1. కృష్ణమూర్తి, భద్రిరాజు (1961) Telugu Verbal Bases : A comparative and Descriptive Study. Berkely, U. S. A. : University of California Press.

2. కెల్లి, జెరల్డ్ (1965) A Grammar of Telugu. (Unpublished)

3. గోపాలకృష్ణయ్య, వడ్లమూడి (1958) వ్యావహారిక భాషా వ్యాకరణం. రాజమహేంద్రవరము : అద్దేపల్లి అండ్ కో.

4 ప్రకాశం, వెన్నెలకంటి (1972) A Systemic Treatment of Certain Aspects of Telugu Phonology. York, U. K. : University of York. (Unpublished D. Phil. dissertation).

5. రామచంద్రరావు, చిరుమామిళ్ళ (1974) Vowel Harmony in Telugu. Paper Presented at the Seminar on Telugu Phonetics, Hyderabad. (Unpublished)

6. రామమూర్తి, దూసి (1950) బాల వ్యాకరణ సారస్య సర్వస్వ పేటిక. మద్రాసు : వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.

7. రామారావు, చేకూరి (1969) A Grammatical Sketch of Telugu. (To be published) Calcutta: Ministry of cultural Affairs.

8. రామారావు, చేకూరి (1970) తెలుగులో బహువచన రూప నిష్పత్తి. భారతి, జూన్ (12-225)

9 రామారావు చేకూరి & పి. సి. నరసింహారెడ్డి (1972) భాషాకృషి. మహతి (సం.) గూడ వెంకట సుబ్రహ్మణ్యం, ఇరివెంటి కృష్ణమూర్తి, వంగపల్లి విశ్వనాథం. సికింద్రాబాదు : యువభారతి. (32 48)

10. సుబ్బారావు, కరుమూరి వేంకట (1971) Vowel Harmony in Telugu and Parenthesis and Infinite Rule Schemata. Papers from the 7 th Regional Meeting of the chicago Linguistic Society. Chicago, U. S. A. (543-552)

[ముద్రిత పద్యాలు రచనా కాలాన్ని తెలియజెయ్యటం లేదు గనుక ఆంధ్ర శబ్ద చింతామణి, బాలవ్యాకరణాలకు రిఫరెన్సులు ఇవ్వలేదు. బాలవ్యాకరణం మొదటి ముద్రణ 1858లో జరిగింది.]

"మళ్ళీ ఎందుకు...."

శ్రీ విజయదత్తు

తన్వీ
నా చేత మళ్ళీ ఎందుకీ
పాత పాటలు తిరిగి వ్రాయిస్తున్నావు
శృతికలవని తీగెలని
తెలిపి తెలిసి
తిరిగి తిరిగి మీటుతున్నావు
ఆనాడు అలనాడెన్నడో
పొగడ నీడన
మనం కలిసి – కలిపి నవ్వుతున్న దినాల
కలగలుపుకున్న అభిమానాల్నెందుకు
ఇంకా తెగిపోని జ్ఞాపకాల
దారాలతో తిరిగి పేనుతున్నావు
కదిలే కాలంతో నేనూ ప్రయాణిస్తూ
ఉన్నానని సూచించే గడియారం గొంతూ
గుండెలవంతా
ఇవేగా మాకు మిగిల్చిన తోడు
పేలవమైన బ్రతుకుల్లో
హేలా విలాసాలు ఊరికే విరబూస్తాయనుకోము
కల కూజితాలు – మలయ మారుతాలు
ఉత్తుత్తి పదాలే అంటాను
నవ్వే కళ్ళూ ఒణికే పెదవులూ
అవి ఇవీ అన్నీ
అన్నట్టు ఆనాటి మెత్తని ఊర్పులవన్నింటినీ
దహించేసిన నిట్టూర్పుల కొలిమిని
ఇలా సిరా కలిపిన కన్నీటి బొట్లతో
చల్లార్చేసుకుని
తిరగబడి చిచ్చుపెట్టే తలపుల్ని
జోకొట్టేస్తూ తెల్లార్చేయడం
అలవాటు చేసుకునే ఈ పొద్దుకు
తన్వీ
ఎందుకు మళ్ళీ ......

గణపతి - తెలుగు సాహిత్యం

కళాప్రపూర్ణ విడుదవోలు వేంకటరావు

సంస్కృత కావ్యాలకంటె తెలుగు కావ్యాలలో ఉన్న ప్రత్యేక విశిష్టత ఇష్టదేవతాస్తుతి-అందులో గణపతి అగ్రస్థాన మధిష్ఠించినాడు-ఇదిని "హరిహరాజ గజాననార్క" అని భారతస్తుతి మొదలుకొని, నేటివఱకు ప్రాచీన రీతిని రచితమైన కావ్యాల్లో గణపతి స్తుతి కనపిస్తూనే ఉంటుంది.

ఆ స్తుతులెంతో మనోరమములు-అయితే వాని నన్నింటిని వివరించడనికి స్థలసంకోచం. ముచ్చటకు మూడుదాహరిస్తాను-

చ. అరుదుగ వామభాగమలనాకలవా చలనాత్మజాడె నయా
హారుగ గాంచి, తానును తదాకృతియౌగతి నేకదంతుడై
కరికరిణీగుణంబులు మొగంబున దాల్చి జగంబులేలు నాం
తర కరుణా సనాథు గణనాథు మరుద్గణ నాథు గొల్చెదన్".

"తల్లిదండ్రులైన ఈశ్వరుడు అర్ధనారీశ్వరుడు, అనగా సగము పురుషభాగము సగము స్త్రీ భాగము కలవాడు—ఆరీతిగానే నేను కూడా అర్ధ నారీశ్వరుడను సుమండీ! అని ఆ స్వరూపం దాల్చినవాడు గణపతి.

"గజాననునికి, ఒకటే దంతముంటుంది. అందునకే అతడు ఏకదంతుడు-ఏనుగుముఖం గలవాడు గదా గణపతి-' ఏనుగులలో మగయేనుగుకు మాత్రమే దంతాలుంటాయి-ఆడయేనుగుకు ఉండవు' అందువల్ల దంతమున్న భాగము పురుషభాగము. దంతము లేని భాగము స్త్రీ భాగము. ఆడయేనుగు మగయేనుగు గుణాలొక్క మూర్తియందే భాపించినని."

ఈ పద్యము నంపధ్రావాలియమను నామాంతరముగల కావ్యాలంకార సంగ్రహము కృత్యాదిలో నున్నది. శారదామూర్తి మూర్తి, అనగా భట్టుమూర్తి కవిరచితము.

ఈ పద్యంలో భావం ప్రాతం-భట్టుమూర్తికంటె 8 శతాబ్దములు ముందటిది-మహాశివభక్తుడు మహావిద్వాంసుడూ అయిన హలాయుధుడు రచించిన హలాయుధస్తవములో మొదటి శ్లోకములో నున్నది.

"విఘ్నం విఘ్నన్ ద్విరదవదనః ప్రీతయేవోఽస్తు నిత్యం
వామే కుంభే ప్రకటిత బృహద క్షిణే స్థూల దంతః
యః శ్రీకంఠం పితరముమయాశ్లిష్ట వామార దేహం
దృష్ట్వా నూనం స్వయమపి దధావర్ధనారీశ్వరత్వం"

2

"చ. తనయునియొక్క మెత్తనినె దక్షజయు న్నిటలాక్షుడున్ ముదంబున నిరు చెక్కులం గొనుచు ముద్దుగొనంగ, నొకింత నెమ్మొగంబమువుగ వెన్కకుం దిగిచి, యత్నవిహీన పరస్పరాస్యచుంబనములు తల్లిదండ్రులకు వస్సున గూర్చు గజాస్యు వేడెదన్—"

"ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు, తమ కుమారుడైన గణపతిని యిద్దరిమధ్య కూర్చోబెట్టుకొని ఇద్దరూ ఒక్కమాటే, అతని ముద్దుపెట్టుకోవాలనుకున్నారు. తీరా వారట్లు ముద్దుపెట్టుకోబోయే సమయంలో గణపతి తన ముఖం క్రిందికి దించివేశాడు. దానితో అనుకోకుండా పార్వతీ పరమేశ్వరులిద్దరూ, ఏ ప్రయత్నం లేకుండానే, ఒకరినొకరు ముద్దుపెట్టుకున్నారు."

ఈ పద్యం ప్రసిద్ధమైన అప్పకవీయము "అను ఛందోలక్షణ గ్రంథం అవతారికలో ఉన్నది అప్పకవి ఛాందసుని ప్రతీతి కాని ఎంత ఛాందసునికైనా, ఒక్కొక్కప్పుడు శృంగారం అవసరమే!

"ఉమ్మగిలన్ జేరి శంభుడు కుమారుని తొట్టెను బెట్టి నీవు చే
లాంచల మేల పట్టుకొనవెదమ్మ కడంజనుమన్న భక్ష్యమి
మ్మంచని పోర, చంద్రకళ నక్కర గైనిడ, కేల్ద్రోయుచున్
ద్రుంచిన దోసె యంచనెలోరపు బొజ్జగలాని గొల్చెదన్."

తాను శయనించబోతూ శివుడొకనాడు గజాననుని తొట్టెలో పడుకోబెట్ట బోయాడు. కాని అతడందుండలేదు. శివుని ఉత్తరీయం కొంగుపట్టుకొని, నాకేమైనా తినడానికి ఇవ్వమని లాగాడు. శివుడు "నా దగ్గరేముంది నాయనా! మీ అమ్మ దగ్గరకు వెళ్ళు" అన్నాడు. గణపతి పార్వతి దగ్గరకు వెళ్ళి అడిగాడు. ఆమె వెంటనే, శివుని తలపై ఉండే అర చంద్రుణ్ణి యిచ్చినది. అతడు

"ఇదేమిటి నాకు సగం దోసెమాత్రమే యిచ్చావు నిండు దోసె యివ్వలేదే" అని విసుక్కున్నాడు.

ఈ పద్యం తమిళనాటిలో ఇప్పటికి రెండువందల ఏండ్ల క్రిందనున్న పుదుక్కోట రాజా కోటి రఘునాథనాయకుడు రచించిన "పార్వతీపరిణయము" అన్న ప్రబంధములోనిది. తమిళ నాటిలో పుట్టింది కాబట్టే దోసెల ప్రస్తావన.

నన్నెచోడ మహాకవి హరవిలాసంలోను పార్వతీపరిణయమున్నది. కాని కోటి రఘునాథ నాయకుడు, వారిద్దరినే మాత్రం అనుసరించకుండా, నూతన భావాలతో కావ్యాన్ని స్వతంత్రంగా రచించాడు.

ఇప్పటికి అరవై యేడేండ్ల క్రిందట ముద్రితమైన ఈ రసవత్ప్రబంధం- నేటివరకు ఎన్నో ప్రాచీన ప్రబంధాలు అచ్చుపడ్డా పునర్ముద్రణానికి నోచుకోలేదు!

గణపతి అనగా, గణములు - సేనలకుమ - పతి నాయకుడు. దేవతలకు మొదటి సేనానాయకుడతడే. దక్షాధ్వర ధ్వంసంలో సేనానాయకత్వం వహించినవాడు గజాననుడే.

ఈ విషయం నన్నెచోడకవి కుమార సంభవమువల్ల మనకు విశదమవుతుంది. గణపతి శివుని ప్రథమ పుత్రుడు.

శివుని రెండవ కుమారుడైన కుమారస్వామి జన్మించిన వెనుక కుమారస్వామి దేవతలకు సేనానాయకుడైనాడు.

అప్పుడు గణపతి విఘ్నములకు రాజైనాడు, అతడు విఘ్నరాజా అంటే సేనానాయకుడు రాజైనాడని అర్థం.

భోజరాజీయంలో ఒక చక్కని కథ ఉన్నది "వంజరుడు" అనే భూస్వామి, తన భూమికి గంగ కావాలని శివుణ్ణిగూర్చి తపస్సు చేయడం ప్రారంభించాడు. (ఈ వంజర శబ్దమునుండి వచ్చినదే 'బంజరు' బంజరుభూమి).

పూర్వం ఎవరైనా తపస్సు చేస్తూంటే దానికి ఏదో విధంగా తపస్సు ఫలించకుండా విఘ్నాలు కలిగించేవారు. దానివల్ల అది ఆగిపోయేది.

వంజరుడు తపస్సు చేస్తూన్న సంగతి పార్వతికి తెలిసింది. విఘ్నేశ్వరుడివద్దకు వెళ్ళి అతనితో ఇట్లు చెప్పింది.

"నాయనా! నీవు వెళ్ళి, వంజరుని తపస్సుకు భంగం కలిగించబోకు. ఏమంటే, వంజరుడు శివుణ్ణి గూర్చి గంగకోసం తపస్సు చేస్తున్నాడు. శివుడతనికి గంగనివ్వాలని అనుకుంటున్నాడు. నీవు అడ్డుపడితే అది ఆగిపోతుంది. నీవు అడ్డుపడకుండా ఉంటే.

శివుడు గంగను పూర్తిగా వంజరున కిచ్చేస్తాడు.
నాకు సవతిపోరు తప్పిపోతుంది"

గణపతి అడ్డు పెట్టలేదు. కాని శివుడుమాత్రం వంజరునికి గంగనంతా ఇవ్వకుండా కొంచెం మాత్రమే యిచ్చాడు. ఆ ప్రవాహమే, వంజరా, వంజీరా అయి మంజీరాగా మారింది. ప్రస్తుతం "మంజీరానది" అదే.

గణపతినిగూర్చి పదియంశములు.

1. గణపతి వేదకాలంనాటి దైవం

గణపతి వేదకాలంనాటి దైవం కాబట్టే సాయణమాధవులు తమ యజుర్వేద భాష్యగ్రంథంలో గణపతిని ప్రథమంగా ఇట్లు ప్రార్థించారు.

"వాగీశాద్యాస్సుమనసః సర్వార్థానాముపక్రమే
యంనత్వా కృతకృత్యాః స్స్యుస్తం నమామి గజాననమ్".

2. గణపతి కవి

"గణానాంత్వాగణపతిగ్ం హవామహేకవిం కవీనాం

ముసన శమస మం" అని శ్రుతి-

భవభూతి ఉత్తరరామ చరిత నాందీశ్లోకము-

"ఇదం కవిభ్యః పూర్వేభ్యోనమోవాకం ప్రశాస్మహే
విందేవ మహిచతాం వాణీ మమృతామాత్మనఃకలా"

ఇందు కవి శబ్దము గణపతి పరమే అని కొందఱు వ్యాఖ్యాతలు-

3. గణపతి వాగధిష్ఠాన దేవత

యాస్కాచార్యులు నిరుక్తంలో 'గణ' శబ్దానికి 32 వ అర్థం 'వాక్కు' అని తెలిపారు కావున గణపతి వాగధిష్ఠాన దేవత-

4. గణపతి లిపికారుడు

తెలుగుదేశమున-' ఓం నమశ్శివాయ" మంత్రంతో అక్షరాభ్యాసం చెయడం-అందరికీ పరిచితమే-ఇది 12వ శతాబ్దికి ముందుగానే ఉన్నట్లు నన్నెచోడని కుమార సంభవంవల్ల తెలుస్తుంది. కాని మళయాళదేశంలోను ఉత్తర హిందూస్థానంలోను.

"శ్రీ గణేశాయనమః"-అని అక్షరాభ్యాసం చేయడం పరిపాటి-

5. గణపతి లేఖకుడు

లేఖకులో మొదటివాడు గణపతి-వేదవ్యాస మహర్షి. భారతం చెబుతూ ఉండగా గణపతి దానిని వ్రాసేవాడు. ఒక్కొక్కప్పుడు. తాను వాసినది అర్థమయ్యేదికాదు—కొంచెం ఆగేవాడు భారతంలో అటి వానికే "వ్యాసఘట్టాలు" అని పేరు-

ఇవి కొన్ని సంస్కృతభారత ప్రతులలో ఉన్నట్లు తెలుస్తున్నది. కాని భండార్కారు పరిశోధనాలయం వారు ప్రకటించిన పరిశోధిత ముద్రణంలో లేదు—నన్నయ కూడా దీనిని ప్రస్తావించలేదు-అయితే—ఈ బలిష్ఠం-రాజశేఖర కవి తన బాలరామాయణ నాటకావతారిలో మనకు పరిచయం చేశాడు.

6. గణపతి జ్యోతిర్మండలము

గణపతి ఒక నక్షత్రం. అది భాద్రపదశుద్ధ చవితి నాడే కనిపిస్తుంది దాని పక్కనే-సప్తర్షి మండలం ఉన్నది. అది మనకు-భాద్రపదశుద్ధ పంచమినాడు దర్శనమిస్తుంది. ఆదినమున-"ఋషి పంచమి వ్రతము" అను వ్రతాన్ని-స్త్రీలు రజోదోష నివారణార్థమై చేస్తారు. దీనికి ఉద్యాపన-లక్షవర్తి వ్రతం-అనగా "లక్షవత్తుల నోము.

సప్తర్షి నక్షత్రాలలో-అగస్త్య నక్షత్రం-అన్నింటికన్నా పెద్దది అందువల్లనే-

"అన్నీ ఒక్క ఎత్తూ, అగస్త్యుడొక్కడూ ఒక్కయెత్తూ"
అన్న సామెత పుట్టింది.

7. గణపతి బౌద్ధమతము

వైదికమతంలోనేకాక. అవైదికమైన బౌద్ధమతంలోనూ గణపతి పూజింపబడడం విశేషమే భారతీయుల కారాధనీయులైన దేవతలలో, ఇతరదేవత లెవ్వరూ లేకుండా, బౌద్ధమతంలో, ఒక్క గణపతి మాత్రమే ఉండడం. అంతకంటె విచిత్రం-

అసలు బౌద్ధమత స్థాపకుడైన బుద్ధునికి — వినాయకుడని పేరున్నది.

"సర్వజ్ఞస్సుగతో బుద్ధో ధర్మరాజస్తథాగతః
సమన్తభద్రో భగవాన్ మారజిల్లోకజిజ్జినః
షడభిజ్ఞో దశబలోఽద్వయవాదీ వినాయకః".

అని అమరము-

వినాయక శబ్దమునకు-"సర్వాన్ వినయతిహితమను శాస్తీతి వినాయకః" అని వ్యుత్పత్తి. 'ప్రాణులకు హితము బోధించువాడు' అని యర్థము.

బౌద్ధంలోఉన్న వినాయక శబ్దాన్ననుసరించి - తెలుగులో, వెనకయ్య చేతికి వెలిచ్చెనన్నట్లు.' అను సామెత వచ్చింది. దీనిని మొదట నాచన సోముడు ఉత్తర హరివంశంలో ప్రయోగించాడు-

8 గణపతి ప్రాచ్యవిదేశాలు

బౌద్ధమతం భారతవర్షంలో పతనించినా, అది నేడు చైనా జపాను దేశాలలో వ్యాప్తిలోనున్నది. ఆరెండు దేశాలలోను గణపతి

పూజనీయుడు భారతదేశానికి, వాయవ్యంగా ఉన్న ఆఫ్ఘనిస్థానంలో గణపతి విగ్రహం బయలుపడినదని — కొన్నియేండ్ల క్రింద అర్కి శాఖ వారు ప్రకటించారు.

9 గణపతి దక్షిణాది

తమిళనాటిలో, ముఖ్యముగా మదరాసులో గణపతి అనుపేర ఆరాధింపబడుచున్నాడు... 'పిళ్ళ' అను పేరు తమిళులలో శైవులకు గలదు. బౌద్ధభాషయగు పాళీభాష యందలి—

పిల్ల — అను శబ్దమే - తమిళమున 'పిళ' అయినది పాళీ భాషలో 'పిల' అనగా ఏనుగుపిల ' అని అర్థము. తెలుగున నది చిన్న బిడ్డకు పర్యాయపదముగా వాడుకలోనున్నది.

తమిళనాటిలో గణపతి - వెలయుటకు కారణము చారిత్రాత్మకమని, క్రీ. శ. 630 ప్రాంతమున, పల్లవ నరసింహవర్మ సేనా నాయకుడు చిఱుతొండనంబి — పశ్చిమ చాళుక్య రాజైన పులకేశిని జయించి, అతని రాజధానియైన -

'వాతాపి' నుండి గణపతి విగ్రహమును దెచ్చి — కాంచీపురమున ప్రతిష్ఠించెనని - అప్పటినుండి - గణపతి పిళయార్‌గా పూజింపబడుచున్నాడని తమిళ విద్వాంసులు చెప్పుచున్నారు[1] — /

సంగీతమున "వాతాపి గణపతింభజే' అన్నది. పై ఐతిహ్యాన్ని — స్థిరపఱచుచున్నది.

10. గణపతి తెలుగు సాహిత్యము

తెలుగు భాషలో, శైవవాఙ్మయము, వైష్ణవ వాఙ్మయము అవి ఉన్నట్లుగా.

'గాణాపత్య వాఙ్మయము' అనగా గణపతినిగూర్చి ఒకసాహిత్యము విస్తరిల్లినది—

గణపతిని గూర్చి యింకను, ఎంత పరిశోధన చేయవలెనో మాపుటయే ఈ వ్యాసోద్దేశము—

---

1. మదరాసు విశ్వవిద్యాలయమున — తమిళ భాషాశాఖాధ్యక్షులై తమిళ భాషావిద్వాంసులైన కీర్తిశేషులు. తిరు. ఆర్ పి. సేతుపిళ్ళగారు, తమ పేరు వ్యుత్పత్తిని తెలుపుతూ పై విషయమును నాకిప్పటికి పదునైదేండ్ల క్రిందట తెలిపిరి. చారిత్రక పరిశోధనలు దీనిని ఋజువు చేయుచున్నది.

జననైకఫలం

శ్రీ తిరునగరి

మొలకెత్తిన ప్రతి మొక్కా
తాను మహావృక్షం కావాలని
మూగ కోరికను గుండెల్లో పెంచుకొని
మోహనంగా పైకి లేస్తుంది.
శాఖోపశాఖలుగా విస్తరించాలని
కొమ్మకొమ్మకూ కోటి పుష్పా పూచి నవ్వాలని
తన ఆకుల చాటున దాగుకొని
ఆకులకన్నా చిన్న పిచ్చుకలు ఆడుకోవాలని
మెత్తని పూల గుత్తులపై వాలుతూ లేస్తూ
సుమగంధాల నాఘ్రాణిస్తూ భ్రమరాలు పాడాలని
కొల్లకవాన పూలగుత్తులనుండే
లేత పిందెలు తలలెత్తాలని
లేచిన ప్రతి పిందెనూ మాతృహృదయంతో
చూచి పరవశించాలని
కాయలుగా మారిన పిందెలను
పండేవరకూ కంటిరెప్పల్లా కాపాడాలని
పండిన పండ్లన్నీ అమృతం చిలుకగా
పరువంతో పగులబడి నవ్వుతుంటె
వాటి స్నేహానికి చేయిచాస్తూ
చిలుకలూ — గోర్వంకలూ
పలుకు పలుకున తేనియలొలికే కోయిలలూ
రెక్కలు రెపరెపలాడిస్తూ
విశాలమైన తన బాహువులపై వచ్చి వాలుతుంటే
తన జన్మం ధన్యమైనట్టు
తన జీవితం స్వర్గసౌఖ్యాలలో తేలినట్టు
ఆనందిస్తానని ఆ గతంపైన
వేనవేల ఆశలు పెంచుకుంటుంది మొక్క
తానూ ఫలించి జీవకోటిని సేవించాలనే
తపనతో కొత్త చిగుళ్ళు వేస్తుంది మొక్క
మొక్క గుండెలో పురివిప్పేది
మ్రానుగా రూపొందాలనే కామన
మ్రాను కడుపులో నిండి ఉన్నది
తానూ పరోపకారంకోసం పుట్టాననే భావన.

రక్తయజ్ఞం

శ్రీ కలువకొలను సదానంద

(గత సంచిక తరువాయి)

సుందరం చాలా చింతించాడు. అతని తత్వానికి పూర్తిగా విరుద్ధమైన సంఘటన జరిగింది ఈరోజు

తిట్టుకోవడం, దెబ్బలాడుకోవడం, పగపెంచుకోవడం, ప్రతీకారం అన్వేషించడం-యివన్నీ అశాంతికరమైన స్వభావాలు

సుందరానిది చాలా మృదుస్వభావం. అతడు కఠినం .. మాటలాడినా మెత్తగానే ఉంటుంది.

సాటి ప్రాణిని శారీరకంగాను, మానసికంగాను నొప్పించడం కుసంస్కారుల లక్షణం అని అతని అభిప్రాయం

బడిలో పిల్లల్ని గట్టిగా కొట్టాలన్నా అతనికి మనసురాదు ఎవరిని గురించిచైనా ప్రత్యక్షంలోగానీ, పరోక్షంలోగానీ మాట్లాడవలసి వచ్చినప్పుడు-తన మాటల ప్రభావం ఎవరికైనా హానినిగానీ, హీనతనుగానీ ఆపాదిస్తుందా అని ఆలోచించి మరీ జాగ్రత్తగా మాట్లాడతాడు. ఎవరైనా తనను న్యూనత పరచి మాట్లాడితే, ఆరోజు బాధపడి, ఆ మరునాడు మరిచిపోతాడు. తనను కించపరచిన వారికి కీడు:సుమాత్రం కాంక్షించడు.

నడుస్తూ నడుస్తూ-పాదం మోపేచోట చీమ కనిపిస్తే చాలు, అవతలికి గెంతేస్తాడు.

ఒకరోజు వాన వెలిసిన తర్వాత అతడు షికారుకు వెళ్ళి తిరిగి వస్తూంటే మసకచీకట్లో ఒక చిన్నకప్ప గెంతుతూవచ్చి అతని కాలి క్రింద చిక్కుకోబోయింది; అది ఎక్కడ నలిగిపోతుందో అని సుందరం గబగబా గెంతాడు, కానీ ఆ కప్పకూడా అతని కాళ్ళకు అడ్డంగానే గెంతింది. సుందరం దాన్ని కాపాడలేకపోయాడు. అది నలిగిపోయింది. ఆ రోజల్లా అతని మనస్సు బాధపడింది. నరకం వుందని, అక్కడ తనను శిక్షిస్తారనీకాదు అతని బాధ. 'అయ్యో, కప్ప నలిగి చచ్చిపోయింది పాపం! అది ఎంత బాధను అనుభవించిందో! అది చావకుండా వుంటే ఇంకా ఎని రోజులు బతికి వుండేదో? ఎక్కడెక్కడ గెంతి వుండేదో? మరెన్నిసార్లు ఇలాంటి చల్లని వానలో విహరించి వుండేదో?' అనుకుని బాధపడ్డాడు.

ఏడేళ్ళ కుర్రవాడుగా వుండగా అతడు చేసిన ఒకపని లీలగా జ్ఞాపకం వుందతనికి. అతని తండ్రి ఒక లరకోడిని కొనుక్కొచ్చాడు. దాని కాలికి తాడు కట్టి, 'ఎలుండి పండక్కి దీన్ని కోసుకుందామే రాజీ!' అన్నాడు. దాన్ని చంపేస్తారని సుందరం మనసు ఆరాటపడింది. కత్తి తీసుకుని దానిగొంతు పరపరా కోసేస్తారు అది గిలగిలా తన్నుకుని చస్తుంది నెత్తురు కారిపోయేలా దానిగొంతు కోసేస్తూవుంటే దానికి బాధగా ఉండదూ?.. ఎవడైనా ఓ రాక్షసుడు తనను యిలాగే పట్టుకుపోయి గొంతుకోసేస్తే?...అబ్బ!... ఈ కోడి బతికిపోతే ఎంతబాగుంటుంది!...సుందరం పండుగకు ముందురోజు చీకటిపడ్డ తర్వాత ఆ కోడిని దారంవిప్పి వదిలేశాడు. మరునాడు అతని తండ్రి వెతుక్కుంటూ వుంటే, 'నేనే వొదిలేశాను నాన్నా' అన్నాడు. 'వెధవా! వెధవా! పెద్దవాడయ్యాక ఎలా బతుకుతావురా నువ్వు?' అన్నాడు అతను.

ఆ కోడి బ్రతికి బయటపడిందా? లేదు. నాలుగిళ్ళ అవతలి పాకలో వుంటున్న పాయిబులు దాన్ని పట్టుకుని పీకకోసి పండుగ చేసుకున్నారు.

మాంసం తినడం కూడా బాల్యంలోనే వదిలేశాడు సుందరం. అందాకా వేడి నెత్తురు ప్రవహిస్తూ వుండి, చల్లబడిపోయిన

ఏమిటి కండలు! ఆ క్షణం వరకూ జీవంతో స్పందిస్తూ వుండి, చైతన్యాన్ని కోల్పోయిన చలని కండలు! ఎలా తినడం వాటిని? అలా తినే అధికారం, హక్కు ఒక్క మనిషికి తప్ప, ఏ యితర ప్రాణికీ లేదు అనిపించింది అతనికి.

అలాంటి సుందరం—చైతన్యం నిండిన మనస్సున్న సుందరం—సుకుమారుడైన సుందరం—గుండెనిండా జీవకారుణ్యం నిండిన సుందరం—పోట్లాట అంటే గిట్టని సుందరం—ఓ గయ్యాళి పిల్లతో పోట్లాట పెట్టుకున్నాడు. ఆమెచేత నీచమైన మాటలు అనిపించుకున్నాడు. చాలా అల్పమైనస్థాయికి దిగజారిపోయినట్టగా సిగ్గు వేసిందతనికి.

అతడు రోజులాగా వాహ్యాళికి వెళ్ళలేదు. తిన్నగా లైబ్రరీ వైపు నడిచాడు.

లైబ్రరీలో పిల్లలు, పెద్దలూ కూర్చుని ఎవరికి దొరికిన పత్రిక వారు చదువుకుంటున్నారు. సుందరం బల్లముందు కుర్చీలో కూర్చుని, బాగా నలిగిపోయి పడివున్న వారపత్రికను చేతికి తీసుకున్నాడు. పరధ్యానంగా పేజీలు త్రిప్పడం మొదలుపెట్టాడు. మనస్సు మళ్ళీ సాయంకాలం జరిగిన సంఘటనమీదికి వెళ్ళింది.

ఆ గయ్యాళి పిల్లపేరు గౌరి! ఔను తనకు జ్ఞాపకమే!... ఈ ఐదారేళ్ళలో ఆ పేరు తాను మరిచిపోయాడు. ఆ ముఖాన్నికూడా మళ్ళీ తానెప్పుడూ చూచినట్టు గుర్తులేదు. ఒకవేళ చూచినా, పరీక్షగా గమనించకపోయి వుండవచ్చు.

గౌరి అప్పుడెంత చిన్నపిల్ల! ఇప్పుడెంత పెద్దదయిపోయింది! ఆ శరీరాన్ని, ఆ నోటిని, ఆ తెంపరితనాన్నీ చూస్తే ఆశ్చర్యం వేస్తూ వుంది.

గౌరి కత్తులవీధికి చెందిన పిల్ల. ఊరికి చివరి అంచున వుంది కత్తులవీధి. ఆ వీధిలో వున్నవాళ్ళందరూ ఒక్క కులం వాళ్ళే! ... ఆ వీధి కులంవాళ్ళ ఐకమత్యం తలుచుకుంటే సుందరానికి అసహ్యం వేస్తుంది. వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా జట్టుగా వెళ్ళే వాళ్ళు. ఆకతాయి పనులు చేసేవాళ్ళు. ఇతర వీధుల పిల్లల్ని హేళన చేసేవారు. లేనిపోని కారణాలు కల్పించుకుని కయ్యానికి కాలు దువ్వేవాళ్ళు. ఒంటరిగా ఎవడైనా పొరుగు వీధుల కుర్రాడు కనిపిస్తే, వాణ్ణి కవ్వించి ఏడిపించేవారు. వాళ్ళు అన్యాయంగా ప్రవర్తించినా, వాళ్ళ మాటల్లో అది న్యాయమే! వాళ్ళు దేన్ని అన్యాయం అంటారో అదే అన్యాయం. ఒకడికి తనకు అన్యాయం జరిగిందనుకుంటే—ఇరవైమంది కలిసి వాడిమీదకి దండెత్తే వాళ్ళు. పిల్లల కయ్యాల్లో పెద్దవాళ్ళు, ఆడవాళ్ళు ముందుకు వచ్చేవాళ్ళు. వాళ్ళ ఉనికిని, ఆధిక్యతను ఆవిధంగా మొదటినుంచీ కాపాడుకుంటున్నారు.

ఆ వీధి మధ్యలో నాగరాజు డాబాయిల్లు వుంది.

నాగరాజు—గౌరి తండ్రి.

ఆ వీధి చివర—మెయిన్ రోడ్డు ప్రక్కన ఓ హోటలు నడుపుతున్నాడు నాగరాజు.

దేశం బ్రిటీషువాళ్ళ హయాంలో వున్నప్పుడు అతడు కొంత కాలం సైన్యంలో పనిచేశాడు. ఆ నౌకరీలోనుండి తిరిగివచ్చి, కత్తుల వీధిలో డాబా కట్టుకున్నాడు. ప్రక్కనే మెయిన్ రోడ్డులో మిలటరీ హోటలు ప్రారంభించాడు. సైన్యంలో వుండగా అతడు ఏలాగో చాలాడబ్బు సంపాదించాడని అంటారు.

సుందరానికి ఓ పెద్ద రుబ్బురోలు జ్ఞాపకం వచ్చింది. అది నాగరాజు యింట్లోవుండేది. గౌరి శరీరంలాగా ఎత్తుగా, విశాలంగా వుండేది. అతనికి పెద్ద పెద్ద యిడ్లీలు కూడా జ్ఞాపకం వచ్చాయి. రెండుతింటే చాలు-ఊపిరాడేదికాదు. ఆ పచ్చడి చాలా రుచిగా వుండేది.

రాజమ్మ రోజూ అతని యింటో పిండి రుబ్బుతుండేది. సుందరానికి ఎప్పుడైనా డబ్బు కావలసి వచ్చినప్పుడు. ఆలస్యాన్ని భరించలేక అక్కడికివెళ్ళి తల్లిని తొందర చేసేవాడు. నడవలో ఆ పెద్ద రుబ్బురోలు ముందర స్టూలు మీద కూర్చుని చేతులు మార్చుకుంటూ పిండి రుబ్బుతుండేది ఆమె. అమ్మ తనను త్వరగా పంపించదంటోందే అనుకుంటూ సుందరం అసహనంగా చూస్తూ అక్కడ నిలుచునేవాడు.

నాగరాజు భార్య ఎత్తుగా, లావుగా వుంటుంది. అతనికో ఉంపుడుగత్తెకూడా వుంది. ఆమెకూడా స్థూలకాయురాలే! ఆమెకు పిల్లలేరు. అతని అలుబిడ్డలతోబాటు ఆ యింట్లోవుంటూ వారిలో సహజీవనం నెరపుతున్నది.

నాగరాజుకు ముగ్గురు పిల్లలు.

పెద్ద పిల్ల పేరు రంగనాయకి.

వాసు రెండోవాడు.

అందరికంటే చిన్నపిల్ల గౌరి!

ఆడపిల్ల అయినా తల్లి పోలిక. వాసు తండ్రి పోలిక!

రంగనాయకి సుందరంకంటె చాలా పెద్దది. సుందరం చదువుకుంటూ వున్న రోజుల్లోనే ఆమె ఓ యువకుణ్ణి మెచ్చి, ప్రేమించి పెళ్ళిచేసుకుంది.

వాసు సుందరంకంటే రెండేళ్ళు చిన్నవాడు. గౌరి మరీ చిన్నది.

వాళ్ళ చదువు సంధ్యల పట్ల నాగరాజుకుగానీ, అతని కుటుంబంలోని వారికిగానీ శ్రద్ధాసక్తులు వుండేవికావు. అసలు ఆ పిల్లలకు కూడా చదువుమీద మనసుండేది కాదు. అందరూ ఐదో తరగతి వరకూ చదువుకుని, అంతే చాలనుకుని మానేశారు.

వాసు ఎప్పుడూ హోటల్లోనే వుంటూ వుండేవాడు.

గౌరి మాత్రం ఇంటికీ, హోటల్కూ తిరుగుతుండేది. రుబ్బిన పిండీ అవీ తీసుకుని హోటలుకు వెళ్ళేది. పకోడీలు, కారాలు ఒళ్ళో పోసుకుని ఎప్పుడూ నములుతూ వుండేది.

ఆమె కప్పుడు పన్నెండేళ్ళు.

పరికిణీ జాకెటు వేసుకుని తిరిగేది అప్పటికే ఆమె వక్షోజాలు జాకెట్టును కొద్దిగా నెట్టుకుంటూ, చూపులకు వికారాన్ని కలిగించేవి. ఆడుతూ పాడుతూ ఇల్లంతా గెంతేది ఆమె. మగ పిల్లలతో కలిసి ఆటలాడేది. వాళ్ళతో కయ్యాలాడుతూ వచ్చి బూతులు తిట్టేది. మగ పిల్లలుకూడా చెయ్యలేని సాహసాలు చేసేది. చేదబావి గోడమీద నిలబడి నడిచేది. చెట్టు మీదికెక్కి, చిటారుకొమ్మమీద కూర్చునేది. పరికిణీ గోచీలా పెట్టుకుని అవలీలగా కంచెలు దాటేసేది. మైలు దూరంలో చిట్టడివి వుంది. అక్కడ రేగు చెట్లున్నాయి. 'అడివికెళ్ళి రేగుపళ్ళు కోసుకుందాం రండిరా!' అని మగపిల్లల్ని పిలిచేది. ఓరోజు ఆమె ఓ మగపిల్లాడి జుట్టు పట్టుకుని దెబ్బలాడుతూ, వాడితో నేలమీద దొర్లుతూ వుండడం చూశాడు సుందరం.

అతడు వాళ్ళింటికి వెళ్ళగానే 'రాజమ్మా! నీ కొడుకొచ్చాడు.' అనేది గౌరి. ఎప్పుడైనా వాళ్ళతనికి ఇడ్లీలు, గారెలూ పెట్టే వాళ్ళు సుందరం సిగ్గు పడుతూ తినేవాడు

ఓసారి సుందరం వాళ్ళ యింటిలోపలికి వెళ్ళబోతుంటే— లోపలినుంచి బయటకు పరుగెత్తుకు వస్తూన్న గౌరి అతన్ని ఢీకొన్నది. ఆమె చిన్ని రొమ్ములు అతనికి మెత్తగ తగిలయి.

గౌరి కోపంతో 'ఛీపో!..' అంది.

సుందరానికి అభిమానం వచ్చి, ఆరోజునుంచి వాళ్ళ యింటికి వెళ్ళడం మానుకున్నాడు.

నాగరాజు బాగా సంపాదించేవాడు. అంత పెద్ద సంసారాన్ని పోషించేవాడు. విచిత్ర మేమంటే—తన పెళ్ళాంలాగా, ప్రియురాలిలాగా లావుగా కాకుండా అతను సన్నగా వుంటాడు. అంత సన్నటి ఒంటి మీద కండలు మాత్రం బిరుసెక్కి గుండ్రంగా వుంటాయి. అతని ముఖంలో భయంకరంగా కనిపించేవి - పెద్దపెద్ద కళ్ళు, మెలి తిరిగిన మీసాలు. ఆ మీసాలను అత డెప్పుడూ మెలిపెట్టుకుంటూ వుంటాడు.

తొలి రోజులలో ఆ హోటలు ఓ పూరి పాకలో వుండేది. కాయకష్టంమీద బ్రతికే జనం చాలామంది అక్కడికి వచ్చి తింటూ వుండేవాళ్ళు. లోపల పొగ సుళ్ళు తిరుగుతూ వుండేది. బెంచీలు, బల్లలు మురికి చేరకుపోయి నల్లగా, అసహ్యంగా వుండేవి. అయితే— రద్దీ మాత్రం ఎప్పుడూ వుంటూ వుండేది. అక్కడ లభించే ఆహార పదార్థాలు రుచిలోను, పరిమాణంలోను ఆకర్షణీయంగా వుండేవి

ఇప్పుడా పూరిపాకే డాబా అయింది.

నాగరాజుకు ఓ తుపాకీ వుంది. అప్పుడప్పుడూ ఆ తుపాకీ బురదను తుడుచుకుంటూ హోటలు ఎదుట కూర్చునేవాడతను. సీసం కరిగించి రవ్వలు తయారుచేసుకునేవాడు. రెండు రోజులకోసారి వెళ్ళి తిత్తిరి పిట్టల్ని కొట్టుకొచ్చేవాడు. ఊరిచుట్టూవున్న పిట్టల ప్రాణాలు తీయటంకోసం యమధర్మరాజు నియమించిన కింకరుడిలా తుపాకీ భుజాన వేసుకుని తిరిగేవాడు. అప్పుడప్పుడూ పెద్ద పెద్ద తూటాలు తయారు చేసుకుని పొడుగాటి టార్చిలైటు తీసుకుని కుందేళ్ళకోసం రాత్రుల్లో బయలుదేరి వెళ్ళేవాడు. సహప్రాధిక శక్తి విశారదుడై, పిట్టల నాగరాజా అని బిరుదు తెచ్చుకున్నాడతను.

తన సాహసాన్ని కేవలం పిట్టలపైనే కాకుండా తరుచుగా మనుషులమీద కూడా ప్రయోగించేవాడు. చాలమందిని కొట్టాడు. చాలామందిచేత తన్నులు తిన్నాడు. ఓసారి ఒకడితో తగాదా పెంచుకుని, తుపాకీ తిరగేసి వాడి నెత్తి బద్దలు కొట్టాడు. అదృష్టం కొద్దీ, వాడు చావలేదు. నాగరాజు ఎవరెవరికాళ్ళో పట్టుకుని

వాలుగైదు వందలదాకా మొగుళ్ళలు చెరి ంచుకుని బతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు

సుందరం గుండె ఒక్కసారి గుబగుబలాడింది. మొగవాళ్ళతో చెప్పి చెప్పుతో కొట్టిస్తానంది ఆపిల్ల. వాళ్ళు మంచివాళ్ళు కారు. ఆ పిల్లతో తానెందుకు తగాదా పెట్టుకోవాలి ?...నిజంగానే వాళ్ళు కొట్టడానికి వస్తారేమో ? వాళ్ళు రెచ్చిపోతే న్యాయమూలేదు, అన్యాయమూలేదు. ముందూ వెనకా ఆలోచించరు. తాను ఈవూళ్ళో ఎంతో పరువుగా బ్రతుకుతున్నాడు. పైగా పంతులు ఉద్యోగం చేస్తున్నాడు. వెధవది-లోకంలో ఎవ్వడికీ అక్కర్లేని పరువు ప్రతిష్ఠలు, మాన మర్యాదలు, నీతినియమాలు ఈ ముష్టి పంతులు గాడికే కావాలి ! అన్నం లేకపోయినా ఫరవాలేదు. ప్రాణం పోయినా చింతలేదు. 'అయ్యో—నా పరువు !'

'నాలుక కోస్తాను' అన్నాడు తాను. ఆ ఒక్క మాటా అనకుండా వుంటే బాగుండేదేమో ?

'ఇదిగో...ఎంత పిరికివాణ్ణి నేను ! ఇలా బెదిరిపోతున్నానేమిటి ? ఎంతో సహనాన్ని కోల్పోయిన తరవాతకదా ఆ మాటన్నాను నేను ? ఆపిల్ల అత్యున్న అన్నమాటలుమాత్రం బాగున్నాయా ? ఇతరులంటే భయమూ భక్తీ లేకుంటే మానె! నీతీ న్యాయమైనా పాటించవద్దా ? ఆ అమ్మాయి దురాగతానికి ఎవరికిమాత్రం కోపం రాదు? అప్పటికీ నేనెంతో మేలు ! ఇంకెవరైనా అయితే ఆ అమ్మాయిని దవడపళ్ళు రాలగొట్టి వుందురు. కోపం రాని నావంటి వాడికే కోపం తెప్పించిందంటే—ఆపిల్లదే అన్యాయం ! నన్ను కొట్టడం మహాఘోరం ! అలా జరగడమే విధి నిర్ణయమైతే—దేవుడనేవాడు కళ్ళూ చెవులూ లేని జడ్డితో సమానం !' అనుకున్నాడు సుందరం.

పరిచితమైన గొంతు విని ఉలికిపడ్డాడతను. అతని వెనుక రామలింగం నిలబడి వున్నాడు.

'పుస్తకం తలకిందులుగా పట్టుకుని చదువుతున్నావేంటూ సుందరం ?'

అప్పటికి లైబ్రరీలోనుంచి అందరూ వెళ్ళిపోయారు. గోడ గడియారంలో గంట ఎనిమిదైంది. చెలా చెదురుగా పడివున్న పత్రికలను, పుస్తకాలను తీసి అలమారులో పెటేశాడు అటెండరు. కిటికీలన్నీ మూసేస్తున్నాడు. లైబ్రేరియన్ తాళంచెవుల గుత్తి చేతికి తీసుకుని గలగలలాడిస్తున్నాడు అసహనంగా.

సుందరం, రామలింగం బయటకు వచ్చారు.

సుందరం నిలబడి రామలింగం ముఖంలోకి చూశాడు.

'రామలింగం !'

'ఏం సుందరం ?'

సుందరం తటపటాయించాడు.

రామలింగం అతని బాల్యమిత్రుడు. సహోద్యాయి. రైల్వేలో ఇంజన్ కీనర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతని కాపురం కత్తుల వీధిలో.

సాయంత్రం జరిగిన సంఘటన గురించి అతనికి చెబుదామని నోటిదాకా వచ్చింది సుందరానికి. మళ్ళీ సందేహించాడు అతనితో చెప్పవలసిన అవసరం ఏముంది ?... రామలింగం నవ్వుతాడేమో ? తనను పుత్తకంగారు మనిషి అని అనుకుంటాడేమో !

'ఏమీ లేదులే !' అన్నాడు సుందరం

అతనివైపు చిత్రంగా చూశాడు రామలింగం.

* * *

మెత్తని గుండెలు దడదడలాడేటట్టు 'బొయ్యి' మంటూ పంచాయతీబోర్డు సైరను చెవులు చిల్లులు పడుతోంది.

గంట ఎనిమిది !

సుందరం యింటిదారి పట్టాడు.

అవంతమైన చీకటిలో వీధిదీపాలు మిణుగురులా వెలుగుతున్నాయి. వీధుల్లో జనం రద్దీ పలచబడింది. బజారు వీధిలో వర్తకులందరూ కొట్లు మూసుకుంటున్నారు. గజి కుక్క పడుకోటానికి చోటు వెతుక్కుంటోంది.

తనకు ఎదురుగా నడిచే మనుషులవైపు అనుమానంగా చూస్తున్నాడు సుందరం. అప్పుడప్పుడూ వెనక్కి తిరిగి చూస్తున్నాడు. ప్రతివాడూ అతని కంటికి నాగరాజా అనుచరుడిలాగా కనిపిస్తున్నాడు

సుందరం ఆలోచనలు గొరివేపిన ప్రవాహం మిడిసి వున్నాయి.

'పిలిస్తే పలికే మనుషులు వాళ్ళకు ఎక్కువగా వున్నారు. పైగా, ఆ కత్తుల వీధివుందే–అది విచిత్రమైన వీధి. వాళ్ళలో వాళ్ళు తన్నుకు చస్తూ వుంటారు. పొరుగు వీధి వాడితో ఎవడికైనా తగాదావస్తే మాత్రం అందరూ ఒక్కటైపోతారు...రాత్రికి నాగరాజు వస్తాడేమో!...అతని వెంట ఓ నలుగురు దయలేని మనుషులుంటారు. వాళ్ళకు బుద్ధి, హృదయం బొత్తిగా వుండవు. ఈ మనిషాల ప్రపంచంలో వాళ్ళకు తెలిసింది ఒకటే! ఎవడైతే తమకింత కబళం వేస్తాడో, ఎవడైతే ఓ పావలా సారా పోయిస్తాడో వాడు చెప్పిన పని గబుక్కున చేసెయ్యడం. అదొక్కటితప్ప యింకోపని చేతగాదు వాళ్ళకు!...ఇంటి ముందరికివచ్చి, కేకలేస్తాడు నాగరాజు. 'ఏమిటా, నా కూతుర్ని తిట్టావట? కొవ్వు నెత్తికెక్కిందా?' అంటాడు. నేను న్యాయం చెప్పబోతాను. న్యాయం, ధర్మం వాడికి గిట్టవు. వాడు రావడమే జడ్జిమెంటుతో వస్తాడు. పిడికిలి బిగించి నన్ను కణతమీద ఒక్క దెబ్బ కొడతాడు. తుపాకి పిడిలాగా గట్టిగా వుంటుందేమో పిడికిలి! ఆ దెబ్బ తీసుకుని నే నూరుకుంటానా? నేనూ యువకుణ్ణే కదా? ముసలివాడిచేత దెబ్బలుతిని, చచ్చిన పీనుగులా వూరుకుంటే–నా ఉడుకు నెత్తురు బూడిదలో పారబోయటానికా? ...అప్పుడు నేనతన్ని కొడతానా? కొట్టకపోయినా, తిడతానేమో!... అతని బంటుకు అది చక్కని అవకాశం. వెంటనే నలుగురూ నాలుగు దెబ్బలు వేస్తారు. నేను వాళ్ళతో పెనుగులాడాలి. నన్ను చితగ్గొట్టి, వాళ్ళు విజయగర్వంతో కేకలు పెడుతూ వెళ్ళిపోతారు. వీధిలోనివాళ్ళందరూ మూగి చూస్తారు. తెల్లవారాక బడిలో పిల్లలందరికీ తెలిసిపోతుంది. నేను తప్పు చేశాననీ, నాగరాజు శిక్షించాడనీ అందరూ అనుకుంటారు. నా పరువు మట్టిలో కలిసిపోతుంది. ఛీఛీ! ఈ మానవ జీవితం వెధవది! మనిషిగా పుట్టడం కంటే అడవిలో జంతువుగా పుట్టడం మంచిది!...అడవిలో పులులూ, తోడేళ్ళూ వుండవా? ఈ మనుష్యుల్లాగానే అవికూడా హింసించవా? ఏమైనా అదికాస్త నయం! అవి కండలే కదా తింటాయి? నెత్తురేకదా తాగుతాయి?...పరువు పోతుందనే భయం అక్కడలేదు. ఇప్పుడేం చేయాలి నేను? ఈ విపత్తు గడవడం ఎలా...'

సుందరం అడుగులు భారంగా పడుతున్నాయి.

'ఈ పాటికే వాళ్ళెవరన్నా ఇంటికి వచ్చివుంటారా?... అలా వచ్చివుంటేనే బాగుంటుంది. ఇంట్లో నేను కనబడకపోయేసరికి, వాళ్ళకు నిరుత్సాహమైపోతుంది. వాళ్ళ వేడి చల్లారిపోతుంది. ఇంట్లో అమ్మ, అత్తయ్య వున్నారుకదా, వాళ్ళేదైనా సర్ది పంపేస్తారు. అది నాకూ గౌరవంగా వుంటుంది. నేను యింట్లో లేని సమయంలో వాళ్ళు వచ్చి వెళ్ళారు గనుక–వాళ్ళతో దెబ్బలాడే అవసరమంటూ వుండదు గనుక–గెలుపు ఎవరిదో, ఓటమి ఎవరిదో తేలదు. వాళ్ళదే పైచెయ్యిఅని వాళ్ళనుకోవచ్చు, నేనే మొనగాణ్ణి అని నేననుకోవచ్చు.'

సుందరం తన వీధిలోకి వచ్చాడు. తన గుండెచప్పుడు స్పష్టంగా వినిపిస్తోందతనికి. ఇంటిని సమీపించాడు. ఇంటి బయట అలికిడేలేదు. లోపల ఏదైనా సందడి వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించాడు. నిశ్శబ్దంగా వుంది.

'ఇంకా వాళ్ళెవరూ వచ్చినట్టులేదు. అసలు ఎవ్వరూ రారేమో! ఆ పిల్ల హడలగొట్టడానికి అలా అన్నదేమో!

'ఏమో! రారు అని గ్యారంటీ ఏముంది?.. ఇక ముందు వస్తారేమో!'

లోపలికి వెళ్ళాడు సుందరం.

'ఆడపిల్లకాదది. ఆడపులి!' అంటోంది రాజమ్మ.

'ఎందుకొచ్చావా అని వాడే సిగ్గుపడి వెళ్ళిపోయాడు, పాపం!' అంటోంది శాంతమ్మ.

సుందరం చొక్కా విప్పుతూ 'ఏమిటత్తయ్యా?' అన్నాడు ప్రశాంత గంభీరంగా.

'ఎవడో దాని అన్నట, సుందరం! వాడొచ్చిపోయాడు...'

ఓ అరగంట క్రితమే గౌరి అన్న వాసువచ్చి వాకిట్లో నిలబడ్డాడు. గుబురుగావున్న క్రాపు వాడిది. మెడలో పులిగోరు. మెడ చుట్టూ రుమాలు. చేతి మణికట్టుకు జేబురుమాలు చుట్టుకున్నాడు.

శాంతమ్మ వాణ్ణి వర్ణిస్తూవుంటే సుందరానికి అసహనంగా వుంది.

...వాకిట్లో నిలబడిన వాసు రాజమ్మను చూచి ఉగ్రుడై మండిపడుతూ 'పిలకకోసే మొనగాడు–ఎవడువాడు? ఇలారమ్మను, నోటిపళ్ళు విరగ్గొట్టి చేతికిస్తాను' అన్నాడు.

'ఎవరేమన్నారని యిక్కడికొచ్చి కేకలేస్తావు?' అంది రాజమ్మ.

'మా చెల్లి నీళ్ళకొస్తే—నీ కొడుకు ఏమేమో అన్నాడటనే? నాలిక కోస్తా డటనే! ఆడపిల్లనంటే, పెద్ద మొనగాడై పోయినట్టా? ఏదీ, నా దగ్గిర నాపించమను ఆ తలబిరుసు!...లోపలున్నాడా? రమ్మను బయటికి!'

'మావాడు పోటాడే రకంకాదు నాయనా! వాడిమీదికి నువ్విలా రాకు!.. అనవసరపు మాటలన్నీ నీ చెల్లే అనేసి, వాడిమీద చాడీలు చెప్పి నిన్ను పంపించిందా? ఆడపిల్ల మాటవిని అదే నిజం అనుకోవటం మంచిదికాదు నువ్వెళ్ళు నాయనా! వాడింటో లేడు...'

'ఏం జరిగిందో తెలుసుకోకుండా, అలా మాటలు పారేసుకోకు బాబూ! ఈ వీధిలో వాళ్ళందర్నీ అడుగు! ఎవరిది తప్పో, వాళ్ళే చెబుతారు. నీళ్ళు పట్టుకుంటుంటే, బలంగా పక్కకు నెట్టింది. 'ఎందుకమ్మా తొందర?' అన్నాను. అంతే! జేట్టా, గీటా అంది. 'చెప్పుతో కొడతాను, పొగ్గించి తంతాను, ముష్టి ముండా, అడుక్కుతినే ముండా, గుడిచేటి' అంటూ నన్ను బండబూతులు తిట్టింది. ఇది బాగుందా నీకు?'

'అయితే మీరూ మీరూ కదా తిట్టుకోవాలి? ఆడపిల్లను పట్టుకుని వాడెందు కంటాడు అంతమాట? నాలిక కోస్తానంటే అదేం చిన్నమాటనా?' అన్నాడు వాసు

'నాలిక కోస్తాననలేదు బాబూ! నాలిక కాస్త లోపలి పెట్టుకుని మాట్లాడు—అన్నాడు. 'తంతాను, నోరుమూసుకోరా' అంది నీ చెల్లి. వాడే భయపడి లోపలికొచ్చేశాడు. వాణ్ణి ఎన్ని మాటలంది! అది చాలక, కొట్టి రమ్మని నిన్ను పంపిందా! బాగుంది నాయనా!'

వాసు సిగ్గుపడ్డాడు. 'నేను దాన్ని మందలించుకుంటాను గానీ, మాటలు మీరు పట్టించుకోకండి. అదేమన్నా అంటే మాతో చెప్పాలిగానీ, దాన్ని తిడితేమాత్రం బాగుండదు' అంటూ అతను వెళ్ళిపోయాడు.

...జరిగిన సంగతి విని, 'అయ్యో, ఆ సమయంలో నేను లేకపోయానే' అన్నట్టు బాధపెట్టాడు సుందరం. వాసు తనను వాడూ వీడూ అనడం, తనను కొట్టగలంతటి ధీమను ప్రదర్శించడం అతనికేమీ నచ్చలేదు.

లోపలేమో అతనికి సంతోషమే వేసింది. మనసు కాస్త తేలికపడింది. తాను లేని సమయంలోనే ఈ గొడవకాస్తా ఏర్పాటు కావడం అతనికి యిష్టంగానే వుంది. వాసు ఎలా వుంటాడో ఈ ఐదేళ్ళ తరవాత తాను సరిగా చూడలేదు. ఇప్పుడు పెద్దవాడై వుంటాడు మీసాలు కూడా వచ్చి వుంటాయి. దెబ్బలాడటం బాగా అలవాటై వుంటుంది తాను ఇంట్లోనే వుండి వుంటే, వాడితో పోటాడవలసి వచ్చేది. నచ్చచెప్పటానికైనా అవకాశమివ్వకుండా దుడుకుమాట లంటుంటే, తాను వూరుకోగలడా? మాటకు మాట అంటూ సిగపట్లు పట్టుకోవలసి వచ్చేది...ఎంత నీచమైన పని అది!

...ఎవడో ఒకడు—వచ్చాడు, వెళ్ళిపోయాడు. చాలు!

సుందరం భోజనం చేసి, సాయంత్రం వేసిన బొమ్మను చేతికి తీసుకున్నాడు. ఆ బొమ్మ నొసట తాను బొట్టు పెట్టనే లేదు. ఆ బొట్టు పెట్టనివ్వకుండా అడ్డుపడింది గౌరి. లేకుంటే చిత్రం ఎప్పుడో పూర్తయి వుండేది.

ఈసారి నాగరాజు వస్తాడేమోనన్న ఊహ కలిగిందతనికి. అలా అనుకోగానే అతని ముఖం మళ్ళీ కళావిహీనమైపోయింది. వాసు పిల్లవెధవ! వాడు రాజీపడేమాత్రం నాగరాజు వూరుకుంటాడా? ఒకవేళ నాగరాజు లేకుండావుండి, ముందుగా పెద్దలా వీడు వచ్చాడేమో!...ఈ వ్యవహారాన్ని నాగరాజు యింత తేలిగ్గా పోనిస్తాడంటే తనకు నమ్మకం కుదరటంలేదు.

సుందరానికి మళ్ళీ దిగులువేసింది. వెళ్ళి పరుపుమీద పడుకున్నాడు. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. నాగరాజు రాక కోసం ఎదురు చూస్తున్నవాడిలా పడుకున్నాడు.

'అతను వస్తే నేనెలా ప్రవర్తించాలి?...నాగరాజు నన్ను మాట్లాడనివ్వకుండా తిడతాడు కొట్టడానికి వస్తాడు. అప్పుడు నేను తిరగబడాలా? ఊహుఁ!...చాలా శాంతంగా, వినయంగా మాటాడుతాను. వాణ్ణి ఏమండీ అని చాలా మర్యాదగా పిలుస్తాను. 'మీరు పూర్తిగా విని, నా తప్పేమయినావుంటే మీ కాలిచెప్పుతో కొట్టండి. తింటే తప్పులేదు. మీరు పెద్దవాళ్ళు!...మా అత్తయ్య చాలా మంచిదండీ! ఆవిడ ఎవరినిగానీ పల్లెత్తుమాట అనే మనిషి కాదు. ఆమెను పట్టుకుని మీ బిడ్డ చాలా హీనమైన మాటలంది. 'నాలిక కాస్త లోపల పెట్టుకుని మాటాడవమ్మా' అన్నాను నేను. నువ్వు లోపలికి పోరా బేటా!' అంది. లోపలి కొచ్చేశాను. నేనేమీ అనలేదు. ఎందుకంటాను? మీ గౌరి నా చెల్లెలులాంటిది. మీరు నాకు చిన్నప్పటినుంచీ తెలుసునే!...మీపట్ల నాకెంతో భయభక్తులున్నాయి...' అని చెప్పుకు

పోతే? ఛీ! అంతకంటే సిగ్గుమాలినతనం యింకొకటిలేదు. ఏం జరిగినాసరే - నా వ్యక్తిత్వాన్ని కించపరచుకునే విధంగా నేనే ఎందుకు మాట్లాడాలి? ఎవరు తిటినా. ఎవరు కొట్టినా నేను హుందాగానే వుంటాను. న్యాయం ఓడిపోయినాసరే, ఆత్మగౌరవం అనే గోచీని మాత్రం విప్పి పారనేయను' అనుకున్నాడు సుందరం.

మనిషిలో సామాజికదృష్టి; విశ్వమానవతా భావం - గొంగళి పురుగు పట్టుకున్న ఆకుల్లాగా క్రమంగా తరిగిపోతున్నాయి. వైయక్తికమైన ఆలోచనలే బలిసిపోతున్నాయి. లోకం ఎలా పోతే తనకేం, తన దారిలో ఏ అడ్డంకులూ లేకుంటే అంతే చాలునని అవకాశాలతో రాజీపడే మనుషులే ప్రపంచమంతటా నిండిపోతున్నారు. నడివీధిలో ఒకడు మరొకడి తల నరుకుతుంటే—మనకెందుకులే అని, చూసీ చూడనట్టు తలవంచుకొని వెళ్ళిపోయేంతటి ఉదాసీనతకు అలవాటుపడిపోతున్నారు.

నాగరాజు తనమీదికి దౌర్జన్యానికివస్తే, అడ్డుపడేవాళ్ళు ఈ వీధిలో వున్నారా? ఈ వూళ్ళో వున్నారా? లేరు! లేరనుకోవడం ఎంత సిగ్గుచేటుగా వుంది! వాళ్ళుమాత్రం ఏం చేస్తారు? పాపం, మనుషులు! ఈ జీవితం స్థిరమైనట్లు, దీని ఆయుర్దాయం పదివేల సంవత్సరాలన్నట్లు, ఏమాత్రం పొరబడినా మానెగిన్నెలాగా క్రిందజారిపడి అదంతా ఒలికిపోతుందన్నట్లు మెలకువగా వుంటారు. వారివారి బ్రతుకులు తప్ప తక్కినవాటి వూసు వాళ్ళకెందుకు ?

నాగరాజో, అతడికి సంబంధించిన మనుషులో తనను కొడతారనుకో! ఏం చేయాలి తాను?...వున్నారుకదా రక్షక భటులు! వాళ్ళకు రిపోర్టిస్తే?...ఔను! అదే కర్తవ్యం! బలహీనులకు, రక్షాహీనులకు వాళ్ళేకదా దిక్కు?

'మహారాజ రాజశ్రీ దుష్టశిక్షకులూ శిష్టరక్షకులూ అయిన పోలీసు సబ్ఇన్స్పెక్టరువారి దివ్యసముఖమునకు ధర్మరాజుల గుడి వీధిలోనుండు కె. సుందరం అను పేరుగల నేను వినయ పూర్వకముగా నమస్కరించి వ్రాసుకొను అర్జీ ఏమనగా—అయ్యా... (ఆడవాళ్ళు పోలీసు సబిన్స్పెక్టర్లుగా వుంటే, అమ్మా అనాలి. మొర పెట్టుకోటానికి అయ్యా అనటం కంటే అమ్మా అనే సంబోధనే బాగుంటుంది.)...నేను చాలా మంచివాడను! (సందేహమెందుకూ?) కన్ను మిన్నుగానకపోవు లారీక్రింద కుక్కపిల్ల పడి నలిగిపోయినచో అయ్యో అనుకొందును. ఆడపిల్ల జడ పట్టుకుని లాగి పారిపోవుచున్న పిల్లవాడు రోడ్డుమీద జారిపడి, మోకాళ్ళు రాచుకొనిపోయినచో అయ్యో అనుకొందును. ఒకరిని తిట్టవలెనన్నచో గుండెలదరును. కొట్టవలెనన్నచో కాళ్ళదరును. ఇట్టి హృదయమును మానసికవేత్తలు దుర్బల హృదయమని అందురు. కాని మహాత్ములు సాధుహృదయమని అందురు. నా మంచితనమునకును, సాధుత్వమునకును నా ఉపాధ్యాయవృత్తియే నిదర్శనము. సాధు గుణముగలవాని పాలిటికి బతుకొక పోరాటమే! ఆ అడవిలో కోయ దొరవలె సంచరించు ఏటు గడ, సదా హృదయ కాఠిన్యము అతనికి అలవడలేదు గనుక సాధు జంతువువలె మనుష్యులకు బానిసై, దారిద్ర్యమునకు సమ్మాటు అగుచున్నాడు. గొడ్డుచావడివంటి బ్రతుకున కలవాటుపడి, గంజియే పాయసమనుకొని తృప్తి పడుచున్నాడు. బ్రతుకలేనివాడు బడి పంతులు అను నానుడికి అర్థమిదే!... (ఈ సోదె అంత పోలీసు వాళ్ళతో చెప్పుకోవడ మెందుకులే !)

'...ఇట్టి నన్ను కత్తుల వీధిలోనుండు శ్రీ నాగరాజు...(శ్రీ అనేది గౌరవ వాచకం. విరోధినికూడా గౌరవించే మనిషి చాలా ఉన్నతుడు)...శ్రీ నాగరాజు, అతని అనుచరులు మరికొందరు—మా యింటికి వచ్చి, నన్ను వీధిలోనికి లాగి, దుర్భాషలాడుచు, చాలా అన్యాయముగా కొట్టినారు. కుట్టుట తేలుకు స్వభావమైనట్లు, కొట్టుట వారి స్వభావము గాన కారణము అవసరములేదు. వారిని విచారించి, తగు చర్యగైకొని, నాబోటివారి మాన ప్రాణములకు (ధనములేదు) రక్షణ కల్పించవలసినదిగా ప్రార్థించుచున్నాను.'

పోలీసు అధికారితో ముఖతః మరిరెండుమాటలు కూడా విన్నవించుకోవాలి.

'ఇన్స్పెక్టరుగారూ! లోకంలో ఒకడు మరొకణ్ణి కొట్టడం, ఖూనీ చేయడం సర్వసామాన్యమే! అయితే దురదృష్టం కొద్దీ బిడ్డను తల్లిముందు, తల్లిని బిడ్డముందు, పెళ్ళాన్ని మొగుడి ముందు, మొగుణ్ణి పెళ్ళాంముందు కొట్టే అడవి మనుషులుకూడా వున్నారు. అలాంటివాళ్ళు, చాలా అనాగరికులు, సంస్కార హీనులు, క్రూరులు. వాళ్ళకు హృదయం ఉండదు. ...ఈ ఒళ్ళు నాది కాదండీ. మా అమ్మది. ఈ శరీరాన్ని ఆమె పువ్వులాగా రేకు కందకుండా పెంచింది. ఇది వాడి ఎండిపోకుండా వుండాలని ఆమె తన జీవితమంతా చెమటోడ్చి కష్టపడింది. ఆమె పస్తులుండి నాకు అన్నం పెట్టింది. ఆమెరక్తమంతా నా ఒంట్లోనేవుంది. ఆమె ప్రాణానికి నేను రూపాన్ని! ఆమె శరీరానికి నా శరీరానికీ విద్యుత్తులాంటి సంబంధంవుంది. ఇక్కడ స్విచ్ వేస్తే అక్కడ లైటు వెలుగుతుంది. ఇక్కడ హలో అంటే అక్కడ వినిపిస్తుంది. ఇక్కడ

కొడితే అక్కడ నెత్తురు కారుతుంది. ఈ గుండె మూలిగితే ఆ గుండె కెవ్వుమంటుంది. అలాంటి మా అమ్మముందు ... ... అమ్మ ముందు...'

* * *

'ఒరే సుందరం! లే నాయనా! మీ అత్తయ్య వూరికెళ్ళా లంటోంది.'

సుందరం ఉలికిపడి లేచి కూర్చున్నాడు.

బాగా తెల్లవారి పోయింది. ఎదురింటి కప్పమీద పడుతున్న నీరెండ కళ్ళకు మిరుమిట్లు గొలిపింది.

సుందరం కళ్ళు నలుముకున్నాడు. ఏమిటీ? ఇంత ఆశ్చర్యకరంగా తెల్లవారి పోతుందని తాను అనుకోలేదే!...అయితే నాగరాజా రాలేదన్నమాట!

అతడు నవ్వుకున్నాడు: తాను లేనివి, పోనివి ఊహించుకుని దిగులుపడిపోవడం కాకపోతే—నాగరాజేమిటీ, రావడమేమిటి ?

సుందరం లేచి ఒళ్ళు విరుచుకున్నాడు.

శాంతమ్మ తల దువ్వుకుంటోంది.

'రాకరాక వచ్చి అప్పుడే వెళ్తానంటావేమత్తయ్యా? రెండు రోజులుండి వెడుదువుగానిలే!'

'వచ్చి రెండు రోజులయిందికదా సుందరం!...మీ మామయ్య కోప్పడతారు. ఒక్కరోజు నేను లేకపోతే, ఆ యిల్లు ఎరువు దిబ్బలా తయారవుతుంది.'

సుందరం స్నానంచేసి వచ్చాడు.

అతని తల్లి, అత్తయ్య యిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

'ఆడపిల్లను కన్నవాళ్ళం కాబట్టి అలుసైపోయాం. మొదట మేమే అడుక్కోవాలనుకుంటున్నావా వదినా?' అంది శాంతమ్మ.

కాకపోతే ఆ అవకాశం పోగొట్టుకుంటావనుకున్నావా?'

శాంతమ్మ నవ్వింది.

'ఆయన కూడా—నీతో మాట్లాడి, నువ్వేమంటావో తెలుసుకుని రమ్మన్నారు, సుశీల ఎదిగి రెండేళ్ళు దాటిపోతోంది. నువ్వు సరేనంటే ఆ మూడుముళ్ళూ వేయించి, పంపించేస్తాం.'

'ఎక్కడికి?'

ఇంకెక్కడికి? వాళ్ళత్త దగ్గరికి!'

రాజమ్మ నవ్వుతూ కూర్చుంది.

'నాతో యిన్ని మాటలెందుకు శాంతా? వాడికన్నా, మీరు కదూ! ఆ ఒక్క మాటా వాణ్నే అడుగు!'

'నువ్వే అడుగు!'

'ఏం సుందరం? వాళ్ళ పిల్లను చేసుకుంటావా?'

సుందరం గోడవైపు తిరిగి తలదువ్వుకుంటున్నాడు.

'ఏ పిల్లమ్మా? పెద్ద పిల్లా, చిన్నపిల్లా?'

'చిన్నపిల్లకు యింకా ఈడు రాలేదురా!' అంది శాంతమ్మ, కొంటెగా.

'ఎవరైతేనేం గానీ, నన్నేం అడక్కమ్మా! నీ ఇష్టమే నా ఇష్టం! అన్నాడు సుందరం, బుద్ధిగా క్రాపు దువ్వుకుంటూ.

'ఇది మరీ బాగుందిరా! సుశీల మనకొద్దు అంటే నువ్వు నిజంగా ఒప్పుకుంటావా?...పిచ్చివేషాలుమాని మాటిగా చెప్పు!'

'సిగ్గుపడుతున్నాడు వదినా! వాళ్ళిద్దరికీ యిష్టమే!'

రాజమ్మ విస్మయాన్ని అభినయించింది. 'మరి యింతసేపూ చెప్పవేం? అత్తా, అల్లుడూ అప్పుడే కూడబలుక్కున్నారన్నమాట! అయితే, నన్ను బతిమాలుకోవడం దేనికీ? నటన గాకపోతే! ..సరే, వాడూ అదీ యిష్టపడ్డ తర్వాత మన యిష్టంతో పనేముంది?... మీరే వాణ్ణొక యింటివాణ్ణి చెయ్యండి!'

ఉపాహారం తిని, కాఫీ త్రాగి శాంతమ్మ, సుందరం ఇంట్లో నుంచి బయలుదేరారు.

'వెళ్ళొస్తా వదినా! అంది శాంతమ్మ.

'వెళ్ళిరా శాంతా! . వెళ్ళగానే ఉత్తరం రాయి!'

'అలాగే!'

సుందరం, శాంతమ్మ బజార్లో నడుస్తున్నారు.

ఆమె ఓ ఫాన్సీ దుకాణంముందు ఆగింది.

'ఏమైనా కొనుక్కోవాలా అత్తయ్యా?'

'సుశీల కాటుక డబ్బీ ఒకటి కావాలంది సుందరం!'

ఇద్దరూ దుకాణంలోకి వెళ్ళారు.

శాంతమ్మ కాటుకడబ్బీ కొనుక్కుంది. అక్కడ వరసగా వేలాడ దీసిన సవరాలవైపు చూస్తూ ఒక సవరాన్ని చేతిలో ముట్టుకుని 'దీని ధర ఎంతండీ?' అని అడిగింది.

'ఇరవై రూపాయలమ్మా!'

'ఆ సవరం కొనుక్కుంటావా అత్తయ్యా?' అని అడిగాడు సుందరం.

'ఎందుకు నాయనా? పూరికే అడిగాను. సుశీలకు సవరం పెట్టుకోవలసిన అవసరమే లేదు. దానివి -పొడుగాటి వెంట్రుకలు. తన జడే తనకు బరువనంటూ వుంటుంది.'

అద్దాల వెనుక ఆకర్షణీయంగా వున్న గాజులవైపు చూచిందామె.

'ఆ చమ్కీగాజులిలా తియ్యండి.' అంది.

దుకాణంవాడు అద్దాల తలుపు పక్కకునెట్టి, 'ఏవి కావాలో చూడండమ్మా!' అన్నాడు.

శాంతమ్మ సైజు వెతికి, 'వీటిని చూడు సుందరం! ...సుశీల చేతులకు ఏ గాజులైతే బాగుంటుందో చెప్పు!' అంది.

సుందరం ఆగాజులన్నీ పరీక్షించి, గులాబీరంగు గాజుల్ని చూపి, 'ఇవి తీసుకో అత్తయ్యా!' అన్నాడు.

ఆ గాజులు ఓ రెండు జతలు కొనుక్కుంది శాంతమ్మ.

ఇద్దరూ బస్‌స్టాండు చేరుకున్నారు.

ఆమె బస్సులో ఎక్కి కూర్చుంది. సుందరం కండక్టరు దగ్గరనుంచి టిక్కెట్టు కొని ఆమెకిచ్చాడు. దగ్గరగా వున్న కొట్లో ఓ డజను అరటిపళ్ళు కొనుక్కున్నాడు. ప్రక్కనే పూలదుకాణం వుంది.

'ఈ కదంబాలు సుశీలతలలో వుంటే, ఎంతో అందంగా వుంటుంది.'

అతను ఓ అర్థరూపాయికి కదంబాలు కొన్నాడు. పళ్ళు, పువ్వులూ బస్సులో కూర్చున్న శాంతమ్మకు అందించాడు.

ఆమె ఆ పువ్వుల్ని ఓసారి వాసనచూచి 'పువ్వులు చాలా బాగున్నాయి సుందరం!' అది. తాను కొంత తెంపి తలలో ఉంచుకుని, మిగిలిన పువ్వుల్ని సంచిలో పెట్టుకుంటూ 'సుశీలకు కదంబా లంటే ప్రాణం!' అంది.

డ్రైవరు హారను నొక్కాడు.

'ఇక నువ్వెళ్ళు సుందరం! బడికి వేళవుతుంది: నేను వెళ్ళి ఉత్తరం రాయిస్తాను. బదులు రాస్తావు కదూ? ...ఎప్పుడైనా ఓ సెలవురోజున వూరికిరారా! దగ్గరేకదా!' అంది శాంతమ్మ.

'వస్తాలే అత్తయ్యా!'

బస్సు వెళ్ళిపోయింది. సుందరం బడికి బయలు దేరాడు.

అతనికి హాయిగావుంది. మనసులో తేనెలూరుతున్నాయి అత్తయ్య తనతో మాటి మాటికీ సుశీలను గురించి మాట్లాడింది. సుశీలకు కాటుక కొనుక్కోవాలంది. ఆమె వెంట్రుకలు అందంగా వుంటాయుంది. ఆమె చేతులకు ఏ గాజులు బాగుంటాయో తననే సెలెక్ట్ చెయ్యమంది. 'కదంబాలు బాగున్నాయి, సుశీలకు కదంబా లంటే ప్రాణం' అంది. సుశీలను తన మనస్సులో నిలిపివేయాలని ఆమె ప్రయత్నం. లోకంలో ఆడవాళ్ళంతా యింతేనేమో! తన మొగుడు తనకే బందీ కావాలనుకుంటారు. తన అల్లుడు తన కూతురికే బందీ కావాలనుకుంటారు.

సుందరం నడుస్తున్నాడు.

తాను కొన్న కదంబాలు తాజాగా, అందంగా వున్నాయి. అత్తయ్య వాటిని సుశీలచేతిలోపెట్టి 'మీ బావ కొనిచ్చాడే' అంటుంది. సుశీల వాటిని ప్రేమగా తలలో పెట్టుకుంటుంది. పిరుదుల్ని తాకే ఆ పొడుగాటి నల్లని జడలో కదంబాల చెండు—నాగేంద్రుడి తల మీది మణిలాగా ప్రకాశిస్తుంది ... తలచుకున్నప్పుడల్లా ఆమెను చూపించే మాయాదర్పణం ఒకటి తనకు వుంటే వింత బాగుంటుంది!

సుందరం బడిలోపల అడుగుపెట్టాడు.

హెడ్మాస్టరు గదిలో-మేజామీదికి కొదిగా వంగి, టీచర్స్ అటెండెన్సు రిజిస్టరులో సంతకం పెడుతున్న పంతులమ్మను చూసి అలాగే నిలబడిపోయాడు.

సనరం పెట్టి అల్లుకొన్న పొడుగాటి జడ పిరుదులమీద నడి నోంట నల్లని పగలో కదంబాలు నవ్వుతున్నాయి. ప్రపంచంలో- పువ్వులన్నీ ఒకేచోట పూయవు. అందం కూడా పువ్వులాంటిదే! తాను మాయా దర్పణంలో చూడదలచుకొన్న అందానికి ప్రతిబింబంలా వుంది ఈ అందం!

ఆమె రిజిస్టరులో సంతకంచేసి, పక్కకు తిరిగింది. సుందరం తన సిగలోకి తదేకంగా చూస్తున్నాడు. వంటులమ్మ సిగ్గుపడింది.

'ఏం సార్ ?' అంది, నవ్వుతూ.

సుందరం ఉలికిపడి 'అబ్బే-ఏంలేదండీ' అంటూ తొట్రుపడ్డాడు.

4

సూర్యుడు పడమటి కొండమీదికి వాలేవేళ-తూర్పు వైపు వెళ్ళిరావడం సుందరానికి అలవాటు.

తూర్పు దిక్కున ఏముంది ?

అతడు ఆరాధించే సౌందర్యమంతా వుంది.

ఆ వూరికి తూర్పు దిశలో కనిపించే ప్రకృతి సౌందర్యానికి అతని హృదయం పులకించి పోతుంది.

పచ్చని పైర్లు, కొండలు, కాలిబాటలు, చెరువులు, కుంటలు తోటలు, చెట్లు, పొదరిండ్లు, పచ్చికబీళ్ళు, పచ్చికమేసి తిరిగివచ్చే ఆలమందలు, అలసిపోయిన అందంతో యింటి ముఖం పట్టే పశ్లె పడుచులు... ఈ సౌందర్యానికి కంచెవేసినట్లు సుదూరాలలో దిక్చక్రం చుట్టూ ఎత్తైన నీలికొండలు, బిడ్డ ముఖం మీదికి ప్రేమగా వంగిచూచే కన్న తల్లి కళ్ళలాగా—ఆ ప్రకృతిమీద విశాలంగా పరచుకొన్న నీలాకాశం—ఇవన్నీ సుందరానికి సహవాసినులు!

తక్కిన మూడువైపులు అంత అందంగా వుండవు. ఉత్తరాన విశాలమైన రైల్వే క్వార్టర్సు, బొగ్గుల మిట్టలు, బూడిదల రాసులు, పడమటి దిక్కున పొడుగ్గా, పాము మెడలాంటి సన్నటి రోడ్డు. ఆరోడ్డులోనుంచి వెళ్ళి, ఊరి పొలిమేరలు దాటుకోవాలంటే చాలాసేపు పడుతుంది. ఆరోడ్డులో ఎదురుగా బస్సువస్తే ప్రక్కకు తప్పుకోవడం కష్టం. ఊరు దాటుకున్న తర్వాత కూడా అంతే! సన్నగా రోడ్డు. అటూయిటూ పచ్చగా చెరకు తోటలు, పైన ఆకాశం. ఇంకేమీ కనిపించదు రోడ్డులో నడవడం విసుగెత్తిపోతే, చెరకుతోటలోకి దూరడం తప్ప గత్యంతరం లేదు. దక్షిణ దిక్కున పటి చవిటి పర్రలు, తాటాకు పాకలు. అక్కడ కల్లు దుకాణాలున్నాయి. సారాకొట్లున్నాయి. గోమాంస విక్రయశాలలున్నాయి. మురుగుగుంటలున్నాయి వాటిని దాటుకుంటే-కంపోస్టు ఎరువుల గుంతలు, పాకీవాళ్ళ లాగుడుబండ్లు వుంటాయి, వాటిని అధిగమిస్తే వల్లకాడు. రక్తమాంసాలన్నీ ఊళ్ళో ధారపోసి, వల్లకాటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఎముకలు! ఆ ఎముకలే నేలమీద మొలిచి పెరిగినట్లు ఎండిన మోడులు; ఆ మోడులమీద-పరకాయ ప్రవేశంచేసిన మనుషులా కూర్చున్న రాబందులు!

ఇలాంటి జుగుప్సాకరము, వికారమూ అయిన దృశ్యాలు ఆ వూరి తూరుపు వైపున కనిపించవు. అక్కడంతా పచ్చదనమే! చెట్లను ప్రేమించి పూజించే మనస్తత్వం ఎక్కడుందో—అక్కడే అందం వుంటుంది.

రోజూ ఆవైపు షికారువెళ్ళి, మునిమాపువేళ యింటికి తిరిగి రావడం సుందరానికి అలవాటైపోయింది.

ప్రకృతితో అతనికి మానసికంగా బాల్యంనుంచీ సాన్నిహిత్యం వుంది. తాను బొమ్మలువేసే తొలిరోజులలో అతను ప్రకృతి దృశ్యాలే చిత్రించేవాడు. ఏరు, ఏటిగట్టున కొబ్బరిచెట్టు—జలపాతం. జలపాతం మీదుగా గంతులువేసే పిట్టలజంట—కొండ. కొండదిగువ పచ్చిక మైదానం—ఎత్తైన ప్రదేశంలో కుటీరం. కుటీరంచుట్టూ పచ్చని చెట్లు-సెలయేరు, సెలయేటి గట్టున ఎగిరే కొంగ...ఇలా ఎన్నో బొమ్మలు వేశాడు. ప్రకృతిని ప్రేమించడం అతనికి ఆనందదాయకం!

ఆ ఆనందానికి ప్రస్తుతం అంతరాయం వాటిల్లింది.

ఊరికి తూర్పుఅంచున కత్తులవీధి వుంది.

వీధిమధ్యలో గౌరి వాళ్ళున్నారు. వీధికి ఒక చివర మెయిన్ రోడ్డుప్రక్కన నాగరాజు హోటలుంది. మరో చివర సుందరం వాహ్యాళికి వెళ్ళవలసిన కాలిబాట పోతుంది.

ఆ పరిసరాల్లోకి వెళ్ళడానికే భయం వేస్తూ వుందతనికి

అందుకే, మూడు సాయంకాలాలు మూగవైపులకు వెళ్ళి వచ్చాడతను. ఆ మూడు రోజుల్లోనూ నాగరాజు తనకు తారసిల్లలేదు

గౌరమ్మ్మాత్రం కొళాయిలోంచి నీళ్ళు పట్టుకుపోతూ వుంది.

తాను రెండు మూడుసార్లు ఆమె కళ్ళలోకి చూడడం జరిగి చూపులు దించుకున్నాడు.

అతని భయానుమానాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి.

'నేననుకున్నంత దుర్మార్గుడు కాడు నాగరాజు! మంచివాడే! పెద్దమనిషే! అలా నోరుచించుకుని ఇతరులమీదికి కయ్యాలకు వెళ్ళనందుకు గౌరినే మందలించి వుంటాడు. అందుకే రెండు మూడు రోజులుగా ఆ పిల్ల గాజుల చప్పుడు తప్పితే, గొంతుకూడా వినిపించడంలేదు! అనుమానం జబ్బులా పట్టుకుంటూవుంది నన్ను. అనవసరంగా మనసు పాడుజేసుకుంటున్నాను. ఇకమీదట ధైర్యంగా వుండాలి. ఎవరూ ఏమీ చేయరని నమ్మకం కుదిరిందికదా? ఇక ధైర్యాన్ని వహించాలి!, అనుకున్నాడు.

ఆరోజు సాయంకాలం ఆవైపే షికారువెళ్ళి రావాలనుకున్నాడు. వీధిలోకి వచ్చాడు. మెయిన్‌రోడ్డులోనుండి—ప్రక్కనున్న కొబ్బరితోటలోని కాలిబాటలోకి దిగుతూవుంటే—బిందెలు చేతబట్టుకుని రోడ్డుమీద ఎదురుగా వస్తూన్న గౌరి కనిపించింది. ఆమె అతన్ని చూచింది.

అతడు కొబ్బరితోట దాటుకున్నాడు. కత్తులవీధి కొసలో వున్న చింతతోపు దాటుకున్నాడు. రెండు ఫర్లాంగులదూరం నడిచాడు.

ఎండ బాగా చల్లబడింది. చెట్లలోనుండి చల్లని గాలి వీస్తోంది. ఏరెండలో పొలాలు పచ్చగా మెరుస్తున్నాయి. సుందరం ఓ రాతిగుండుమీద కూర్చున్నాడు.

గౌరి తనను చూచింది. ఈవైపు రావడం ఆమె గమనించి వుంటుంది. ఆమె ఏ గొడవా తెచ్చిపెట్టదుకదా? తన బావతో—ఒంటరిగా చిక్కిన తనను అటకాయించరుకదా?

తనను వెతుక్కుంటూ ఆ వీధి కుర్రాళ్ళెవరైనా యిటు వస్తారేమో? దెబ్బలాడటం తనకు చేతకాదు...ఈవైపు రాకుండా వుంటేనే బాగుండేది.

సుందరం అనుమానంగా చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు, అయినా తాను మెలకువగా వుండడం మంచిది కదా?

ఆత్మరక్షణార్థం ఏదైనా ఆయుధం దగ్గరుంటే మంచిది. కొంతమంది చేతిలో కర్రలు పట్టుకుని తిరుగుతుంటారు. బొడ్లో చాకు కూడా వుంచుకుంటారట! అలాంటివి దగ్గరుంచుకోవడం తనకు అలవాటులేదు. రూళ్ళకర్ర చేతబట్టుకుని బడికిపోవాలన్నా సిగ్గే! పట్టుకోడానికి వాటంగా వుండే కర్రముక్క ఏదైనా యిక్కడ పడివుందా?'

అతడు చుట్టూ చూశాడు. అలాంటి కర్రముక్క ఏదీ కనిపించలేదు.

'రాళ్ళున్నాయి. రాళ్ళతో ఎదుర్కోవడం బాగుంటుందా? ఛీ! చిన్నపిల్లాడిలా అంత అమాయికంగా దెబ్బలాడటం ఏం గౌరవం?...'

'ఆ చెట్టునుంచి ఓ బెత్తం విరిచి పెట్టుకుంటే?... తీరా—నన్ను కొట్టడానికి ఎవరూ రాలేదనుకో! తరువాత ఆ బెత్తంతో ఉపయోగం ఏముంటుంది? దెబ్బలాటకు—మొదటనేనే సిద్ధపడినట్లు అవుతుంది. వొద్దు!'

'ఒకడే వస్తే నేను సమాళించుకోగలను. బహుశా—వాణ్ణి సునాయాసంగా చితగ్గొట్టేయగలనేమో!...ఎక్కువమంది వస్తేనే కష్టం! వాళ్ళచేత అవమానాల పాలు కావాలి. సినిమాలో కథానాయకుడు వింతగా పోట్లాడుతాడు! వందమంది వచ్చినాసరే, వడ్లు దంచినట్టు దంచేస్తాడు. నేనూ అలా కొట్టగలిగితే (ఆత్మరక్షణార్థం) ఎంత బాగుంటుంది!...'

...ప్రొద్దుపోయింది. ఇంకా వెలుతురుంది. చీకట్లు ముసురుకోలేదు. సుందరం త్వరగానే పైకిలేచాడు. ఇంటికి బయలుదేరాడు. అనుమానం కలిగేచోట నిమిషమైనా వుండకూడదు!

అతడు నడుస్తున్నాడు. చీకట్లు దట్టంగా ముసురుకోకపోయినా—చలిగాలి ప్రారంభమైంది.

'ఇప్పుడెవడైనా నా కెదురుగా వస్తాడేమో! నన్ను అగ్గిపెట్టె యిమ్మని అడుగుతాడు. నా దగ్గర లేదు కనుక లేదంటాను. ఎందుకు లేదురా—అంటూ వాడు నన్ను కొడతాడు. నేను తిరగబడి కొడతాను. అప్పుడు చెట్ల చాటునుంచి నలుగురైదుగురు వస్తారు. మా వాణ్ణెందుకు కొట్టావురా—అంటూ నన్ను బంతిగా చేసి ఆడుకుంటారు. ఎక్కువ ఓట్లు సంపాదించగలిగితే అన్యాయం తప్పకుండా గెలుస్తుంది, న్యాయమూ, అన్యాయమూ ఎలక్షనలో నుంచుంటున్నాయి. నలుగురు దొంగలు కలిసి, మేకను గాడిద అంటే—అది గాడిదే!...బలహీనుడు తిరగబడితే తప్పు!'

సుందరం చింతతోపులోకి వచ్చాడు.

అతని గుండె ఆగి, మళ్ళీ వేగంగా కొట్టుకుంది.

కత్తుల వీధి చివర గౌరి నిలబడి అతనివైపే చూస్తున్నది. 'ఆమె పక్కన నిలబడ్డ వాడెవడు? నాగరాజేనా?... ఇంకొకడెవడు? వాసుకదూ? వాళ్ళ వెనక యింకా చాలా మంది వున్నారే! దారి తప్పించి వెళ్ళిపోనా? అయ్యో! దగ్గరికే వచ్చేశారే! ఇప్పుడెలా?...వాళ్ళు చూస్తూ వుండగా అడ్డదారి తొక్కి తప్పించుకుపోవడం సాధ్యమా? వాళ్ళు ఆటకాయిస్తే?...'

'ఒరేయ్! అక్కడే ఆగు!' అన్నాడు నాగరాజు.

సుందరం నోటమాటరాక ఆగిపోయాడు.

'ఇక లాభంలేదు. ఇన్నాళ్ళూ జాగ్రత్తపడి, ఇవాళ సులభంగా వీళ్ళ చేతికి దొరికిపోయాను. ఇటువంటి దురవస్థ నాకెప్పుడూ రాలేదు. ఎంత అవమానం! హే భగవాన్! నా శాంతమే నన్ను రక్షించుగాక!'

ఆ వీధి చివర ఓ నాలుగైదు యిళ్ళవారు అప్పటికే బయటకు వచ్చి అరుగులమీద నిలబడ్డారు. వాళ్ళలో మగవాళ్ళంతా సుందరం చుట్టూ నిలబడిపోయారు. వాళ్ళందరూ ఎర్రటి, నల్లటి బట్టలు ధరించారు. ఒకడు నల్లపంట్లాంమీద ఎర్రచొక్కా తొడుక్కున్నాడు. ఇంకొకడు మెడచుట్టూ నల్లటి, ఎర్రటి చారలున్న రుమాలు చుట్టుకున్నాడు. మరొకడు చొక్కా జేబులమీద నల్లటి, ఎర్రటి దారాలతో బొమ్మలు కుట్టుకున్నాడు. వేరొకడు నల్లటి, ఎర్రటి గళ్ళుబనీను తొడుక్కున్నాడు.

పరువు పోకుండా వీళ్ళ పిడికిట్లోంచి బయట పడడం ఎలా?

అందరూ అతన్ని తిట్టడం మొదలుపెట్టారు. ఆ లోపల నాగరాజు భార్య, ఉంపుడుగత్తె కూడా రొప్పుతూ వచ్చేశారు.

నాగరాజు సుందరం భుజంమీద ఓ చెయ్యివేసి 'ఏంరా? అమ్మాయిని ఏమన్నావు నువ్వు?' అన్నాడు.

'ఏమీ అనలేదండీ!' అన్నాడు సుందరం వినయంగా.

'నాలిక కోస్తానన్నావా, లేదా?'

లేదు అనాలనిపించింది సుందరానికి. 'నాలుక కోస్తాననలేదండీ, నాలుక కాస్త లోపల పెట్టుకో అన్నాను' అని చెప్పాలనిపించింది. అయితే గౌరి అక్కడే వుంది. తన పిరికితనాన్ని హేళన చెయ్యబోతున్నట్టుగా చూస్తూ వుంది. అలా అబద్ధం చెప్పడం మరీ అవమానకరం! అలా చెప్పడంకంటే దెబ్బలు తినడమే నయం!

'అన్నాను!'

సుందరం చెంప ఛెళ్ళుమంది.

'ఎన్ని గుండెలురా నీకు; అలా అనటానికి?'

సుందరం కళ్ళు గిర్రున తిరిగాయి. లోకం తనను మొట్టమొదటిసారిగా కొట్టింది. నిండు సభలో కౌరవులు ద్రౌపదిని మానభంగం చేసినట్టుగా—తనను నడివీధిలో నిలబెట్టి అవమానించింది.

అతనికి కోపం వచ్చింది. ఏడుపు వచ్చింది. ఇందరిలో ఏడవడం చాలా హీనం! ఏడవడంకంటే మరి నాలుగు దెబ్బలు తినడం మంచిది.

నేను మంచివాణ్ణి గనుక ఆ మాటమాత్రం అన్నాను. మీ అమ్మాయి అన్నమాటలకు మరొకరైతే నాలిక కోసేవాళ్ళే! మీ అమ్మాయిని దండించుకోక నన్ను కొడతారేమండీ?

'నన్నే నాలిక కోస్తానంటావ్రా?' అంటూ వాసు తన చేతిలోని కర్రతో అతని కణతమీద ఒక్కటి వాయించాడు. నలుగురూ నాలుగు దెబ్బలు కొట్టారు. తప్పతాగి ఓ యింటి అరుగుమీద ఒంటిపై ధ్యాసలేకుండా పడివున్న తాగుబోతుకూడా కళ్ళు తెరవకుండానే 'చంపేయిరా వాణ్ణి' అంటున్నాడు.

సుందరం నోరు తెరవలేదు. మళ్ళీ ఏదైనా మాటాడితే తనకు శిక్ష పెరిగిపోతుంది.

ఆ సందడిలో తనకు బాగా స్నేహంవున్న ఓ గొంతు వినిపించిందతనికి.

'మరి నాలుగు తన్నండిరా!'

ఆ గొంతు రామలింగానిది!

అందర్నీ నెట్టుకుని గుంపులోకి జొరబడ్డ రామలింగం సుందరాన్ని చూచి నివ్వెరపోయాడు.

'నువ్వట్రా సుందరం!'

రామలింగం అతన్ని శ్రీకృష్ణ పరమాత్మలాగా రక్షించాడు. సుందరాన్ని రెక్కపట్టుకుని దూరంగా ఈడ్చుకెళ్ళాడు.

ఆ వీధిలోని గుంపంతా సుందరాన్ని తిడుతూవుంది. 'రౌడీ వెధవ! ఏ రౌడీతనం మా దగ్గిర పుడకదు, జాగర్త! ఏముక లేరేస్తాం!' అంటున్నారు.

చీకటి పడింది.

రామలింగం సుందరాన్ని ఓదారుస్తూ లలన్ని యింటిదాకా తీసుకొచ్చాడు. 'వాళ్ళతో ఎందుకురా గొడవ తెచ్చిపెట్టుకున్నావు? వాళ్ళు మంచివాళ్ళుకారు. అటువేపు ఎందుకొచ్చావు?... పోనీలే మనసులో ఏమీ బాధపెట్టుకోవద్దు.' అన్నాడు.

ఆ మాటల్లో సుందరానికి ఓదార్పు లభించలేదు. 'ఒరే రామలింగం! నేను కాకుండా మరొకడైవుంటే నువ్వుకూడా నాలుగు తన్నేవాడివికదూ?' అన్నాడు.

దెబ్బలు తిని వచ్చిన సుందరాన్ని చూచి రాజమ్మ కడుపు తరుక్కుపోయింది. ఆమెకు యింట్లో కాళ్ళు నిలవలేదు. 'గొర్రెపిల్ల లాంటి నిన్ను కొడతార్రటా వాళ్ళు? వాళ్ళ చేతులు పడిపోనూ!...' అంటూ యింటో నుంచి బయలుదేరింది.

'ఇప్పుడెక్కడికి వెళ్తావమ్మా? వాళ్ళదగ్గరికి పోవద్దు!' అన్నాడు సుందరం. ఆమె వినలేదు. కత్తుల వీధిలోకి వెళ్ళి, నాగరాజు యింటి ముందర నిలబడి కేకలువేసి, తాను నాలుగు మాటలని, వాళ్ళచేత పదిమాటలనిపించుకుని తిరిగివచ్చింది.

సుందరం పడుకున్నాడు. ఆమె అతనికి వేడినీళ్ళతో కాపడం పెట్టింది. 'కడుపు కట్టుకుని, ఒళ్ళు కందకుండా మల్లిపువ్వులా పెంచాను. కసాయి ముండా కొడుకులు నా బిడ్డనిలా కొట్టి పడేశారు. దేవుడు వాళ్ళ బిడ్డల్ని కొట్టడూ?' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

సుందరం కళ్ళలో నీళ్ళు తిరిగింది. అతడు కళ్ళు మూసుకున్నాడు ఇంత పెద్దవూళ్ళో అమ్మ ఒక్కతే తనకోసం ఏడుస్తోంది. తాను తిన్న దెబ్బలకంటే, తాను పడిన అవమానంకంటే—ఆ ఏడుపు ఎంతో బాధాకరంగాను, హాయిగాను వుంది. ఎంత పాపకార్యం చేశాడు తాని రోజు! తాను దెబ్బలుతిని, అమ్మకు బాధకలిగించాడు. తాను జాగత్తగా వుండివుంటే—ఆమెకు యిప్పుడీ కష్టం కలిగేది కాదు గదా?...నాగరాజు తనను కొట్టలేదు. అమ్మను కొట్టాడు.

'నాగరాజా! మా అమ్మ చాలా మంచిది! ఆమెకంటే మంచి వాళ్ళు లోకంలో లేరు. నువ్వు మా అమ్మను కొట్టావు. నువ్వు మహాపాపివి!...ఇందుకు ప్రతిఫలంతప్పకుండా అనుభవిస్తావు! మా అమ్మ కన్నీళ్ళు నీ కొంపమీద నిప్పులై రాలిపడతాయి చూసుకో!'

ఇలా అనుకోవడం అతని మనస్సుకెంతో శాంతిని ప్రసాదించింది.

'ఒక కులం ఒక్కటై నన్ను కొట్టింది ఈరోజు. ఈ జాతులు, ఈ కులాలు నాదేశంలో పిచ్చితలలు వేస్తున్నాయి తన నాగరికతను, తన సంస్కృతిని సంరక్షించుకోవడానికి జాతీయతా భావం అవసరమేకానీ, అది యితరుల పాలిటికి దానవత్వంగా పరిణమించ కూడదు. ఈనాడు దేశంలో కులాభిమానం ప్రబలిపోతూ వుంది. పౌరులందరికీ సమాన హక్కులున్న నా ప్రజాస్వామిక దేశం కులాల పరుగు పందేనికి ఆటమైదానంగా తయారైంది. మంచికీ, చెడ్డకూ కులాభిమానం గొర్రెదాటు వేస్తూవుంది కేవలం అభిమానంతో ఒక్కొక్క కులం—రేచుకుక్కల దండులా ఒక్కటవుతూవుంది కులాన్ని గుడ్డిగా ప్రేమించేవాడు, న్యాయాన్నీ, ధర్మాన్నీ అవకాశాన్నీ తనకులానికే ఆపాదించుకునేవాడు సమాజంలో ఎందుకూ? కాకులు దూరని కారడవిలా వుండాలి! అలాంటి వాళ్ళకంటే రేచుకుక్కలకు విజ్ఞత తెలుసు! తాము వుండవలసినచోటేదో వాటికి తెలుసు! అవి అడవుల్లోనే వుంటాయి...'

నాగరాజు కులంవాళ్ళందరూ తనను తలా ఒక దెబ్బ వేశారు. ముక్కూ ముఖం తెలియనివాడుకూడా తనను ముఖంమీద కొట్టాడు. వాళ్ళందరూ అలాకలసి కొట్టడమేకాకుండా—తనకు రౌడీ అనే ముద్రవేశారు. అదే అతనికి బాధగావుంది. ఎవరు రౌడీ? ఎవరు?

నాగరాజుమీద ప్రతీకారం తీర్చుకోవాలి. పోలీసులకు రిపోర్టివ్వాలి. పోలీసుల గుండెలు కరిగిపోయేలా రిపోర్టు వ్రాయాలి.

'వాళ్ళ గుండెలు నిజంగా కరుగుతాయా? వాళ్ళద్వారా నాకు న్యాయం చేకూరుతుందా? ... ఏమో! అనుమానంగానేవుంది. పోలీసులు దేవుళ్ళలాంటి వాళ్ళు! దేవుడున్నాడు. ఎక్కడున్నాడు? పోలీసువాళ్ళున్నారు. ఎక్కడున్నారు? దేవుడు లేడా? దేవుడే లేకుంటే—ఈగాలి ఎలా వీస్తోంది? వర్షం ఎలా కురుస్తోంది? అది సైన్స్ అంటావా? పోనీ, ఈ విశ్వానికి అంతెక్కడ? చంద్రగ్రహానికి వెళ్ళటానికి మూడురోజులు పట్టింది నీకు. విశ్వపు అంచులు కనిపెట్టడానికి ఎంతకాలం పడుతుందో చెప్పు! ఇన్ని గ్రహాలు ఎలా తిరగ్గలుగుతున్నాయి? అదికూడా సైన్సేనంటావా?

సరే! మనిషి ఎక్కణ్ణించి పుడుతున్నాడు? చచ్చిన తర్వాత ఎక్కడికి వెడుతున్నాడు? అక్కడున్నాడు దేవుడు! అతడు మృత్యువులాంటివాడు! మృత్యువు అర్థం కానట్టే దేవుడుకూడా అర్థంకాడు లతడున్నాడు!'

'...ఊళ్ళో నాలుగు బస్సులూ తిరిగే రోడ్డుమీదనే ఇన్ని నాటుసారా కొట్లున్నాయి. ఇందరు త్రాగుబోతులు దేవతలా అమృతం త్రాగి, రోడ్డే నందనవనంగా విహరిస్తున్నారు. ఎక్కడున్నారు పోలీసులు?...ఏ చెట్టుక్రింద చూచినా డబ్బుపెట్టి పేకాడుతున్నారు జూదగాళ్ళు. ఆడవాళ్ళు కూడా కుతూహలం చూపేటంత బహిరంగ ప్రచారానికి నోచుకుంది బ్రాకెట్ ఆట! ఎక్కడున్నారు పోలీసులు?... రెండు వర్గాలవాళ్ళు ఒకరిమీద ఒకరుపడి తన్నుకు చావడం సర్వసామాన్యమైపోయింది. ఎక్కడున్నారు పోలీసులు?...ఇటీవల ఒకటి రెండు వ్యభిచార గృహాలు కూడా అవతరించాయి ఊళ్ళో! ఎక్కడున్నారు పోలీసులు?'

'దేవుడి ఉనికిని గురించి ఎంత సులభంగా చెప్పాడు పోతన్న! ఇందుగలడందులేడని సందేహము వలదు, ఎందెందు వెదకి చూచిన అందందే గలడు—అనేశాడు. పోలీసు ఎక్కడున్నాడని అడిగితే పోతన్న ఏమంటాడు? దేవుడికి, పోలీసుకువున్న భేదం తమాషాగా లేదూ?... దేవుడు కనిపించడు. అయినా వున్నాడు! పోలీసు కనిపిస్తాడు. అయినా, లేడు!'

'కంచే చేను మేస్తూవుంది. అవినీతిని నిరోధించటానికి నియమింపబడిన ప్రభుత్వోద్యోగులే—ఆ ఉద్యోగం అనే కల్పతరువులో అవినీతిని ఫలాలుగా పండించి, తమ కామితార్థాలను నెరవేర్చుకుంటున్నారు. అవినీతి పెరుగుతున్నట్లే వారి సిరిసంపదలూ పెరుగుతున్నాయి. దొంగలు, దొరలు లాలూచీ పడుతున్నారు. డబ్బు, బలమున్న త్రాగుబోతులు, జూదగాళ్ళు, వ్యభిచారులు, జగడాలమార్లు, దొంగలు పెదమనుషులుగా చెలామణీ ఔతూ, పంచాయితీ వెలగబెడుతూ, 'తప్పుచేశావేంటోయ్? అపరాధం చెల్లించూ!' అంటున్నారు. మనసా, వాచా, కర్మణా మార్గదర్శకులైన సాధువులు, సాత్వికులు, మేధావులు చేతులు గట్టుకుని, తలవాల్చి వాళ్ళముందు నిలబడుతున్నారు...'

'నీతిని రక్షించడంకోసం మేము (ప్రజలేనా రాజులు!) నియమించిన పోలీసూ! అవినీతిని రక్షించడంకోసం నియమింపబడ్డానను కుంటున్న పోలీసూ! నేను నీకు రిపోర్టివ్వను! అన్ని సమస్యలూ లాటరీ తీర్చివేస్తుందని అనుకుంటున్న రోజులివి! వివాదాన్ని పరిష్కరించటానికి నువ్వు లాటరీ వేయవు అనే నమ్మకం ఏముంది? న్యాయం, అన్యాయం అని రెండు చీటీలు వ్రాసి డబ్బాలో పడేసి, నన్ను ఒక చీటీ తీసుకోమంటావు. నా ఖర్మకాలి అన్యాయం అనే చీటీ నాకు, న్యాయం అనే చీటీ నాగరాజుకు వస్తాయనుకో! ఎందుకొచ్చిన తంటా! సరే, అదృష్టం కొద్దీ న్యాయం అనే చీటీయే నా కొస్తుందనుకో! అలాంటి న్యాయం నా కెందుకూ? అదృష్టం నిర్ణయించి యిచ్చే న్యాయం నాకొద్దు. ధర్మం నిర్ణయించి యిచ్చే న్యాయమే నాకు కావాలి!...నీకెందుకు పాపం, లేనిపోని శ్రమ! ఉపసంహరించుకుంటున్నాను. నీకు రిపోర్టిచ్చి మాటిమాటికీ నీ దగ్గరికి తిరగడంకంటే, నా శత్రువును క్షమించి వదిలిపెట్టేయడమే ఆరోగ్యకరం!...'

సుందరానికి ఎంతో ఆనందం కలిగింది.

'పరలోకమందున్న మా తండ్రీ నీ నామము పరిశుద్ధపరచబడుగాక—నీ రాజ్యము వచ్చుగాక—నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరునుగాక—మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము—మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము—మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము—ఆమేన్!'

శత్రువును క్షమించడం వలన కలిగే అనుభూతి ఎంత మధురమైనది!

సుందరానికి తానొక ఏసుక్రీస్తులాగా అనిపించింది. నారి మూలంగా నాగరాజు తనకు శత్రువయ్యాడు. తనను పిలువ పేశాడు. తనను హింసించిన నాగరాజు కొరకు తాను ప్రార్థన చేస్తున్నాడు.

ఒక సమస్య తీరిపోయింది. నాగరాజు తనపైన ప్రతీకారం తీర్చుకునేశాడు. అతడు కొడతాడన్న దిగులు యిక వుండదు. నాగరాజుకు భయపడవలసిన అవసరమే యికలేదు

సుందరానికి ఆ రాత్రి హాయిగా నిద్రపట్టింది.

[సశేషము]

రంగుల కెరటాల్లో వెంగళూరు

శ్రీ సోమసుందర్

ఎలా సముపార్జించుకున్నాడీ సూర్యుడు
ఇంత మృదు మంజుల సుహాస రోచిస్సుల్ని !
ఈ దినకరుణ్ణి అనుగమించే నీరదాలు
పురుషుణ్ణి అనుసరించి సంచరించే
ఆధునిక స్వాధీనపతికలు;
అహరహ పరిశ్రమాస్విన్నుడైన ఆదిత్యుడు
ఆరున్నరకే శృంగాటకాలకు దిగివచ్చి
ఫ్యాక్టరీ బస్సుకై నిరీక్షిస్తాడు;
మేఘారణ్యాల లతాగుల్మాల ఏకాంతవాసం నుంచి
అప్పుడే వెలువడిన తెల్లగా బలిసిన చంద్రుడు
తూరుపుకొండ కొప్పుమీదికి ఆయాసపడుతూ ఎక్కి
అకస్మాత్తుగా నియోన్‌లైట్ల ధగద్ధగలను చూస్తూ
ముఖం చాటు చేసుకుంటాడు సిగ్గుపడి....
శీర్ధాగ్ర భాగాల డింపలీశయనాగారాల్లో
తలదాచుకుంటాడు చంద్రుడు కర్తవ్యం మరచి;
ఈ నగర మస్తకంపై వెండిగొడుగులా
విప్పుకొన్న ఆకాశం — ఆహ్లాద సంకాశం !
ఈ విహాయస వాటికలు —
కాంతాతుందిల రహః పేటికలు,
మాధ్వీక రసాయన స్ఫటికాలు,
ఇంద్రనీల మణిఖచిత కంఠహారాలు,
ఇంద్రియ వ్యాపారాలకు బలవర్ధకాలు.
ఇక్కడి శోభాకృతులైన దిక్పతులు
ఇంద్ర ధనుర్వసనాలు ధరించి
సప్తవర్ణదీధితుల్ని కీలించి

సుప్త కామనలను జాగృతం చేస్తారు;
ఈ నగరంలోని ఆగ్నేయం
ఏనాడో శైతల్యానికి సమర్పించింది మనశ్శరీరాల్ని...
ఇక్కడ విహరించే జలదాంగనలు
ప్రేమించి పెళ్ళిచేసుకున్న జవరాళ్ళు
ఇవేమిటీ నగరంలోని మబ్బులు ?
చకత్ చకిత విలాపా లొలికే కబ్బాలు !
చిటికెలో పకాలున నవ్వగలవు
ఇంతలో కుందనపు గుబ్బెతవై
సిగ్గుతో ముడుచుకు పోగలవు
ఉత్తర క్షణంలో జాళువా జలతారు మేజారుల్ని
నిస్సాటంగా విదరేసుకుంటూ
హైహీల్సుపై నడచి పోగలవు హుందాగా !
ఉద్వాంత కాంతల్లా నిలచిన సౌధాలకు
ఈ రంగు రంగుల కెరటాల్లో తేలే మబ్బులు
ముఖమల్ మేలి ముసుగులు;

సురదీర్ఘికల్లో తేలే అపరంజి పళ్ళాలు
ఉన్నట్టుండి వానచినుకులు
మిలమిల లాడుతూ దిగివచ్చి
నేల చెక్కిళ్ళను ముద్దులాడుతూంటే
యుగయుగాల ప్రేయసీ ప్రియుల
కన్నీటి జడుల వడపు వెలుగుల్లో తడిసి
కాలంలో పేరుకొన్న మౌన సంభాషణలు
వినిపిస్తాయి ఏకాంత హృదయాలకు.

ఇక్కడ బ్రతకలేని కాకులూ ఈగలూ
దోమలూ వగైరా నికృష్ట జీవులన్నీ
ఉత్తర సరిహద్దుల కావలకు
వలసవెళ్ళిపోయ్యా అభిజ్ఞవర్గాల భోగట్టా !
వర్ణచిత్రాలవంటి రకరకాల విహంగాలు మాత్రం
హరిత పత్రాలపై జీవన కావ్యాలను
హాస్యలిపిలో లిఖిస్తూ ఉంటాయి.
అత్యల్పజీవులైన ఊరపిచ్చుకలు సైతం
విద్యుత్తంత్రులను మీటేస్తూ
చేస్తూ ఉంటాయి సంగీత సాధనం
నిత్య నైమిత్తిక జీవనంలో సంగీతం

పరమ బాధ్యతాయుత భాగస్వామిని !
అనవరత వసంత శోభానిలాలలో
హాయిగా పరవశించే ఈ పచ్చని చెట్లు
మరకత మాణిక్య కోటీరాల ధరించి
ఠీవిగా నిలిచిన భూజానులు ...
ఇంటింటా జాజిపూల పొదరిళ్లు
గడపగడపకీ సంపెంగల పసిడి తోరణాలు
ప్రతిగోడ వెనుకనుంచీ చిరునవ్వే మందారలు
నిటారుగా సాగే ప్రతి వీథీ ఒక మధురోక్తి
ప్రతి గృహాంగణమూ చేతులెత్తి ఆహ్వానించే దివ్యానుభూతి
ప్రతి ఇంటి ముంగిటా అవనతవదనంలో
నిలిచిన పారిజాత వధూటి —
చిగురాకు దొన్నెలనిండా పీయూషబిందువు లందిస్తుంది !
అతిథులను సేద తేరుస్తుంది.
ఇక్కడ కేంద్రీకృత మహదనంత సౌందర్యం నుంచి
ఏ రసవత్తర జీవన కావ్యం ఆవిర్భవిస్తుందో ?
ఈ మనోజ్ఞ నగరం బెంగుళూరులో
రసపిపాసువులకు గుండెలనిండా బెంగలూరు !
భారత మహేతిహాసంలోని సమస్త విజ్ఞానమూ
భావయుక్తినించి కార్యయుక్తికి పరివర్తించుకొన్నట్లు
సర్వంకష చైతన్య కర్మణ్యత్వాల సమాహారం
పుంజీభవించగా రూపొందిందీ మహానగరం!
నగరానికి మణిమయ మేఖలవలె
అనుస్యూతంగా మెరిసే పరిశ్రమల గొలుసుకట్టు
యావత్ భారత సౌందర్యాలనూ
సమస్త ప్రపంచ నైపుణ్యాలనూ కలిపికట్టు !
మేళవించిన విపంచిలా స్వాధీనం చేసుకున్న సౌజన్యమిది !
ఈ మహానగర పథాల వకముఖాలా
ప్రసరించే మంద పవన వీచికల
నరాలనుంచి ఏ సజీవ వారసత్వం
తనలో నింపుకోగలదు వర్తమాన జీవవాహిని ?
ఏ దరస్మిత చందన సురభిళాల ప్రసరించగలదు !

[విజయవాటిక ఆకాశవాణి సౌజన్యంతో]

మహా సంప్రదాయం

ఒక దశ అంతం అవుతోందా?

వెర్నర్ హెయిసెన్‌బెర్గ్

(గత సంచిక తరువాయి)

మన కాలంలో భౌతికశాస్త్రాన్ని సమర్థించే పరమార్థ విద్యావిషయిక మయిన ఆధారానికి చాలా దూరంగా ఉన్నాము. కాని, ఇంకా ఈ పద్ధతినే అనుసరిస్తున్నాము ఎందుచేతనంటే, ఇది మంచి ఫలితాలని ఇచ్చింది కాబట్టి. ఇంత ఫలితాలని ఇవ్వటానికి కారణం ఏమిటంటే, ప్రయోగాలని మళ్ళీమళ్ళీ చెయ్యగలగటమే అనాలి. ఒకేరకం పరిస్థితులలో చేసిన ప్రయోగాలు ఒకేరకం ఫలితాలు ఇస్తాయని తెలుసుకున్నాము; ఇందువలన ఫలితాలు సరయినవే అని మనం అంగీకరిస్తున్నాము. ఇది అంత స్పష్టమయిన విషయం కాదు. సంఘటనలనేవి కారణాలు – వాటి ఫలితాలు అన్న పరంపరలో జరిగినప్పుడే ఇది నిజమవుతుంది. కాని, కొన్ని సంవత్సరాలుగా ఈ రకం కారణాలు–ఫలితాల పరంపరయొక్క విజయాలు వీలయ్యాయి కనుకనే కారణత్వం విజ్ఞాన శాస్త్రానికి ఒక మూలసిద్ధాంతంగా స్వీకరింపబడింది.

తత్వవేత్త కాంట్ ఈరకం కారణతత్వం ప్రత్యక్షానుభవం మీద ఆధారపడే సూత్రం కాజాలదని వొక్కి చెప్పాడు. అయినా మన విజ్ఞాన శాస్త్రానికి చెందినదే ఇది. 16వ శతాబ్దంలో ప్రారంభమయిన విజ్ఞాన శాస్త్రపు దినుసు దీనివలననే సాధ్యం అయింది, దానిని అనుసరించే వివరింపబడుతూ వచ్చింది.

ఈ ధోరణి పర్యవసానంగా ప్రకృతిని "ఉన్నది ఉన్నట్టు" అనుశీలించటం వీలవుతుందని మనం నమ్ముతున్నాము. ఆకాశంలో: కాలంలో ఒక విశ్వం ఉందనుకుంటాము; దీనిని అవలోకించే కర్త ఉనికితో ఈ విశ్వానికి సంబంధం లేదనుకుంటాము. మన ప్రయోగ సామగ్రితో కొన్ని దృగ్విషయాలు సంభవించేట్లు చేస్తాము. ఇవి కొత్తవి కావన్నీ మన ప్రమేయం లేకుండానే అవి ప్రకృతిలో సంభవిస్తూ ఉంటాయనీ, మన సామగ్రితో వాటిని వేరుచేసి, పరిశీలించగలుగుతున్నామనీ మనకి గట్టిగా అనిపిస్తుంది. ఈ అంశాలన్నీ కోపర్నికస్, గెలీలియోల సంప్రదాయానికి చెందినవే, వాటిని మనం విశ్వాసంతో అనుసరిస్తున్నాము.

ఈ విధంగా చెయ్యటానికి మనకి హక్కు నిజంగా ఉందా? పరిమాణ సిద్ధాంతంలో జ్ఞానవిషయికమయిన కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని సయి పద్ధతిని గురించి ఆలోచించాలి. మనం పరమాణువులకి సంబంధించిన యంత్రాలని (ఏక్సిలరేటర్‌లని) తయారుచేస్తాము. వీటిలో పరమాణువులు అతివేగంగా కదిలినప్పుడు ఏమవుతుందో తెలుసుకొనటానికి ప్రయత్నిస్తాము. మనం ఇటువంటి ప్రయోగాలు చెయ్యకపోయినా పరమాణువులు, కణాలు వాతావరణంలో, విశ్వకిరణ ప్రసారాల ఫలితంగా యంత్రాలలో కనిపించే దృగ్విషయాలనే తెలుపుతాయని మనం ఊహిస్తాము కాని, అసలు బయటనుంచి తరంగాలు లేక కణాలు వస్తాయా? వచ్చినా అవి వాటి మార్గ చిహ్నాలని వదులుతాయా? ఈ మార్గ చిహ్నాలు పరవ్యాపార ప్రవేశాన్ని సూచించేవే అయితే అవి మనకి కనిపిస్తాయా? మనం వాటిని పరిశీలించకుండా ఉంటే అసలు ఏమి జరుగుతుంది? ఈ సందర్భంలో "అసలు" అన్న మాటకి అర్థం ఏమిటి? ఇవి గడ్డు ప్రశ్నలు, సంప్రదాయం ఎటువంటి కష్టాలకి దారితీస్తుందో వీటినిపట్టి గ్రహించవచ్చు.

మన విజ్ఞానశాస్త్రం ప్రత్యక్షానుభవం మీద ఆధారపడినదని మనం అనుకుంటాము. మనం పరీక్షచేసి తెలుసుకున్న వివరాలనిపట్టి మన భావాలనీ, గణితశాస్త్రానికి సంబంధించిన నిర్మాణాలనీ తయారు చేసుకుంటామని నమ్ముతాము. ఇదే కనుక పూర్తి నిజమయితే మనం ఒక కొత్త రంగంలోకి ప్రవేశించేప్పుడు మనం సందర్శించ

గణిగిన పరిమాణాలని మాత్రమే ప్రవేశ పెట్టాలి. ఈ పరిమాణాల సహాయంతో మాత్రమే ప్రకృతి సూత్రాలని తయారు చెయ్యాలి.

ఆల్బర్ట్ ఐన్‌స్టెయిన్ తన సాపేక్ష సిద్ధాంతాలలో ఈ తత్వాన్నే అనుసరించాడని వాచిన్నప్పుడు నమ్మేవాడిని. అందుచేతనే, నేను పరిమాణ సిద్ధాంతంలో "మ్యాట్రిక్స్" లని వాడి అటువంటి మార్గాన్నే అనుసరిద్దామనుకున్నాను. కాని, నేను దాని గురించి ఐన్‌స్టెయిన్‌ని అడిగినప్పుడు అతను ఈ విధంగా సమాధానం ఇచ్చాడు "అదేనా తత్వం అయిఉండవచ్చు. అయినా అదంతా వట్టి చెత్త. ఒక సిద్ధాంతంలోకి మనకి తెలిసిన పరిమాణాలని మాత్రమే ప్రవేశ పెట్టలేము. సిద్ధాంతమే వేటిని పరీక్షించాలో చెప్తుంది." దీని అర్థం ఏమిటి? మనం దేనినో చూస్తాము—అది ఒక ఫొటోప్లేటు మీద గీత కావచ్చు, ఒక లెక్కపెట్టే యంత్రం కణం ఏదో విద్యుచ్ఛక్తి సంపర్కం చెందుతోందని తెలిసే సంకేతం కావచ్చు. దీనినుంచి మనం మనకి ఆసక్తి ఉన్న దృగ్విషయానికి పోతాము. ఈ పనులన్నీ చెయ్యటానికి మనకి సిద్ధాంతం, సిద్ధాంతంద్వారవచ్చే భావాలు వాడాలి. మనం అనుభవంద్వారా చేసే పరిశీలనాక్రమాన్ని గణిత శాస్త్ర నిర్మాణాలనుంచి కాని, దాని భావాలనుంచికాని వేరుచెయ్యలేము. ఐన్‌స్టెయిన్ చేసిన ఈ ప్రతిపాదనకి అనంతరం సందిగ్ధ సిద్ధాంతంలోని సంబంధాలద్వారా ప్రదర్శన ఏర్పడింది.

కాని, పరిమాణ సిద్ధాంతంలో సంభవించిన ఈ పరిస్థితి విజ్ఞానశాస్త్రంలో సంప్రదాయిక పద్ధతులని సవాలుచేసి తీరదు; కేవలం అనుభవం ద్వారా భావాలు, గణితశాస్త్ర నిర్మాణాలు తీసుకొనవచ్చునన్న గ్రహణాన్ని మాత్రమే సవాలు చేస్తుంది. పరిమాణ వాదంలో కారణత్వం మీద మాత్రం ఆధారపడవచ్చునన్నది నిజం. కాని, ఒక ప్రయోగాన్ని ఎన్నో సార్లు అదేవిధంగా చెయ్యవచ్చు. ఈ ప్రయోగాలవలన మనం కొన్ని విషయాలు చూడవచ్చు. వీటినుండి గణాంక విభజనలు కొన్ని వీలవుతాయి. ఈ ప్రయోగాలనే ఇంకా చేసి ఈ విభజనల గురించి కొన్ని వస్తునిష్ఠ కలిగిన ఉపపాదనలు చెయ్యవచ్చు. ఇది కణభౌతిక శాస్త్రంలో ప్రమాణమయిన పద్ధతి, సంప్రదాయక పద్ధతికి ఒక సహజమయిన విస్తరణ.

గెలిలియో కాలంలో మొదలయిన విజ్ఞానశాస్త్ర సంప్రదాయాన్నే ఇంకా మనం జాగ్రత్తగా అనుసరిస్తున్నామనిపిస్తుంది. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, పరమాణుశాస్త్రం పరమాణుకేంద్రశాస్త్రం—ఈ రంగాలన్నీ అభివృద్ధి అయ్యాయి కాని మూలపద్ధతి ఒకటిగానే ఉండిపోయింది. ఈ కాలం అంతటా శాస్త్రజ్ఞులు ఒక నమ్మకంతో వ్యవహరించారనిపించకుండా ఉండదు; పయిన చెప్పిన పద్ధతిద్వారానే వస్తునిష్ఠ కలిగిన (అంటే సరయిన) ఉపపాదనలు చెయ్యవచ్చునన్న నమ్మకమే అది.

పూర్తిగా భిన్నమయిన మార్గాన్ని ఒకదాని అనుసరించటానికి ఒకే ఒక ప్రయత్నం జరిగింది. దానిని నేను ఇక్కడ పేర్కొనాలి.

జర్మనీకవి గోథే వర్ణనాత్మకమయిన విజ్ఞాన శాస్త్రానికి శ్రీకారం చుట్టాలని అన్నాడు. ఇటువంటి విజ్ఞానశాస్త్రం ప్రత్యక్షమయిన ప్రకృతి సహజమయిన దృగ్విషయాలని గురించి మాత్రమే పట్టించుకొనాలని అతని అభిప్రాయం. కృత్రిమమయిన కొత్త ఫలితాలనిచ్చే కొత్త ప్రయోగాలలో విజ్ఞాన శాస్త్రానికి నిమిత్తం లేదని అతని అభిప్రాయం. దృగ్విషయాలని కర్త, కర్మ లన్ని వాటికి సంబంధించిన రెండు భాగలుగా విభజించటానికి అతను అంగీకరించలేదు. సాంకేతిక శాస్త్రాభివృద్ధితో ప్రకృతి వినాశనం పెరుగుతుందని అతను భయపడ్డాడు. మన కాలంలో గాలి, నీరు కలుషిత మవటం గమనిస్తున్నాము; నేల కృత్రిమ మయిన ఎరువులవలన విషపూరిత మవటం చూస్తున్నాము; అణ్వస్త్రాలని తయారుచేసుకున్నాము. గోథే భయం అతని సమకాలికులకన్నా మనకి బాగా అర్థం అవుతోంది కాని, గోథే ప్రయత్నం విజ్ఞానశాస్త్రంయొక్క అభివృద్ధి క్రమంమీద ప్రభావాన్ని చూపించలేకపోయింది. సంప్రదాయిక పద్ధతి విజయం అంత అప్రతిహతమయినది.

సమస్యల విస్తృతిలో, శాస్త్రీయ పద్ధతిలో సంప్రదాయం ప్రభావం ఇలాగ ఉండగా, దృగ్విషయాలని పట్టుకొనటానికి మనం వాడే భావాలని మలచటంలో, వాటిని అందించటంలో అత్యధికంగా సంప్రదాయం ప్రభావానికి లోనవుతాము. విజ్ఞానశాస్త్రం చరిత్ర కేవలం సమాపాదనాల, అవలోకనాల చరిత్రకాదు. భావాల చరిత్ర కూడా. అందుచేత నేను కోపర్నికస్, గెలిలియోల తదనంతరపు కాలంలో భావాల చరిత్రని క్లుప్తంగా చర్చించటానికి ప్రయత్నిస్తాను.

కొత్త విజ్ఞానశాస్త్రం ఖగోళశాస్త్రంలో ప్రారంభించింది. దీనివలన వస్తువుల స్థితులు, వేగాలు దృగ్విషయాలని వర్ణించే

పోగటి భావాలయ్యాయి. న్యూటన్ తన "ప్రకృతి తత్వశాస్త్రపు గణిత సూత్రాలు' అనే పుస్తకంలో పదార్థం, శక్తి-అన్న భావాలని ప్రవేశపెట్టాడు. కదలికకి పరిమాణం చేకూర్చి మనం ఇప్పుడు ఊపు (మోమెంటమ్) అని పిలిచే భావానికి వాదకం కల్పించాడు. ఆ తరువాత చలనశక్తి, ఉపపనాశక్తి అన్న భావాలు వాడుకలోకి వచ్చి యంత్రశాస్త్రానికి ఆధారాలు ఏర్పడాయి. ఒక శతాబ్దంకన్నా ఎక్కువ కాలం ఈ ఆధారాలే సూక్ష్మమయిన విజ్ఞాన శాస్త్రానికి ఆధారాలుగా ఉండిపోయాయి. ఈ కొత్త ఆధారాలు చాలా చక్కగా ఉపయోగపడాయి. అందుచేతనే శాస్త్రజ్ఞులు దృగ్విషయాలు కొత్త భావాలని సూచించినప్పటికీ వాటిని పాతవాటికి తగినట్లుగా మార్చుకొనటానికి ప్రయత్నించేవారు. ద్రవపదార్థాల కదలికలు ఆ ద్రవ పదార్థాలలోని అతి సూక్ష్మమయిన కణాల కదలికలలో సమానమయిన పుంభావం స్వీకరించబడింది. వాటి చలన ప్రవర్తన న్యూటన్ సూత్రాల దృష్ట్యా వ్యాఖ్యానింపబడింది. ఈ వ్యాఖ్యానాలు విజయవంతంగా కొనసాగాయి. 18వ శతాబ్దం రెండవ సగంలో శాస్త్రజ్ఞులు విద్యుచ్ఛక్తి, అయస్కాంతశక్తిని అనుశీలించటం మొదలుపెట్టారు. అప్పుడు వారు దృగ్విషయాలని పరిశీలించటానికి "శక్తి" అనే భావాన్ని వాడుకున్నారు. ఈ దృష్టితో ఆలోచించినట్లయితే "శక్తి" అన్నది వస్తువుల స్థితి వేగం—వీటిమీద ఆధారపడే యంత్రశాస్త్రపు భావం. పదార్థాలు ద్రవరూపంలో, వాయురూపంలో, ఘనరూపంలో ఉండవచ్చు; ఈ రూపాల ప్రవర్తనలని అర్థం చేసుకొనటానికి, పదార్థాల రసాయనిక ప్రవర్తనని అర్థం చేసుకొనటానికి గాస్సెండీ పరమాణు నిర్మాణ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాడు. అతని అనుచరులు పరమాణువుల కదలికలనీ, ఈ కదలికల ఫలితంగా పదార్థాలకి వచ్చే గుణాలనీ పరిశీలించటానికి న్యూటన్ తయారుచేసిన యంత్రశాస్త్రాన్ని వాడారు. ఒక కాంతికిరణం కణాల కూడిక వలన కాని, తరంగాలవలనకాని ఏర్పడిందని అనుకోవచ్చు కాని, తరంగాలు కూడా ఏదో ఒక పదార్థంలోని తరంగాలయితే ఈ పదార్థంయొక్క కణాలని ఎప్పటికయినా న్యూటన్-యంత్రశాస్త్రపు సూత్రాల సహాయంతో పరిశీలించవచ్చునని కొందరు ఆశించారు.

ఈ విధమయిన సూక్ష్మీకరణం విలువకుందని అందరూ అనుకున్నారు. శాస్త్రీయ పద్ధతి విషయంలో వారికి అటువంటి నమ్మకం

అమృతాంజన్ లిమిటెడ్‌వారి గ్రైప్ మిక్చర్ జీర్ణశక్తిని సరిచేస్తుంది. దానికి తోడ్పడుతుంది. బిడ్డని ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచుతుంది. అమృతాంజన్ లిమిటెడ్ వారి గ్రైప్ మిక్చర్ సులినొప్పి, వాయువు, అజీర్ణం, పళ్లుపచ్చే కాలంలో ఇబ్బందులు వాటికి మంచి గుణం ఇస్తుంది.

అమృతాంజన్ లిమిటెడ్

బిడ్డ సంతోషంగా ఉంటె

అమృతాంజన్ గ్రైప్ మిక్చర్ వాడినట్లె

OBM 2642 TG

ఉండనే ఉంది. కాని, చరిత్ర మరొక విధంగా తీర్మానించింది. 19వ శతాబ్దంలో విద్యుత్–అయస్కాంత దృగ్విషయాల స్వభావమే వేరు, అని క్రమంగా తెలిసిపోయింది ఫారడ్ విద్యుత్-అయస్కాంత క్షేత్రం ఉంటుదన్న భావాన్ని ప్రతిపాదించాడు. మాక్స్వెల్ దానికి సిద్ధాంతరూపంలో ఉనికి కల్పించాడు. పోను పోను ఈ భావానికి యదార్థ స్వరూపం వచ్చేసింది. ఒక పదార్థం యొక్క స్థితి, వేగం ఎంత నిజమయినవో ఆకాశంలో, కాలంలో ఉన్న ఒక శక్తి క్షేత్రం కూడా అంత నిజమయినదేనని భౌతిక శాస్త్రజ్ఞులు అర్థం చేసుకొనటం మొదలుపెట్టారు. అదృశ్యమయిన ఏదో ఒక పదార్థం (ఈథర్) ఉందనీ, దీని గుణమే శక్తి క్షేత్రం అనుకొనవలసిన అవసరం లేదనీ కూడా వారు గ్రహించటం ప్రారంభించారు. ఇక్కడ సంప్రదాయం అవగాహనకి సాయపడకపోగా అడ్డు పడింది. సాపేక్ష సిద్ధాంతం వెలువడిన తరువాతనే "ఈథర్" వాదం తొలగిపోయింది విద్యుత్–అయస్కాంతశాస్త్రం యంత్రశాస్త్రంలో ఇమిడిపోయే అవకాశం దీనితో పోయింది.

ఉష్ణానికి సంబంధించిన సిద్ధాంతాల పరిణామం కూడా ఇదే విధంగా జరిగింది. కాని, యాంత్రిక భావాలు ఎంతో సూక్ష్మంగా కాని తొలగిపోలేదు. మొదట్లో అంతా తేలికగానే కనిపించింది. ఒక పదార్థ ఖండంలో ఎన్నో పరమాణువులు లేక పరమాణు సమూహాలు ఉంటాయి. వేడి, రసాయనికపు మార్పులలో వీటి యాంత్రిక చలనాలు గణాంకశాస్త్రంద్వారా వరిగణింపబడటానికి వీలు ఉండాలి. ఉష్ణోగత, "ఎంట్రాపీ" అన్న రెండు భావాల సహాయంతో గణాంక ప్రవర్తనని స్వాధీనం చేసుకొనవచ్చునని అనిపించింది ఈ భావాల వలన భౌతిక శాస్త్రంలో ఎటువంటి అగాధం ప్రత్యక్షమయిందో అర్థం చేసుకున్న వారిలో మొదటివాడు గిబ్స్ అనుకుంటాను. అతను "చర్చిలో భజన గీతాలు పాడే బృందం" మాటలతో ఈ విషయాన్ని వర్ణించాడు. ఉష్ణోగత అనేది పరమాణువుల యాంత్రిక ప్రవర్తన గురించి మన జ్ఞానం ఎంతవరకో సూచిస్తుంది కాని వాటి యదార్థమయిన యాంత్రిక ప్రవర్తన ఎటువంటిదో తెలుపదని ఈ పదజాలం నిరూపిస్తుంది. ఈ పదజాలం ఒకరకమయిన అవలోకనానికి సంబంధించినది. ఒక వ్యవస్థని శాస్త్రదృష్టితో పరిశీలించటం జరుగుతోంది. దాని వేడిని లెక్క కట్టాలంటే ధర్మామీటరు వాడతాము; అప్పుడు వ్యవస్థ, ధర్మామీటరుల మధ్య వేడి మారుతుంది; ఉష్ణచలనంలో తీవ్రత ఏర్పడుతుంది అంటే ఒక వ్యవస్థ ఉష్ణోగత తెలుసుకుంటే దాని చలనశక్తి ఎంతో సరిగ్గా, సూక్ష్మంగా తెలుసుకొననలేనన్న మాట (వ్యవస్థలో స్వాతంత్ర్యానికి ఉన్న వాటిని పట్టి అయాథార్థ్యం మారుతుంది.)

సంప్రదాయం ఈ రకం వ్యాఖ్యకి వ్యతిరేకంగా పనిచేసిందని వేరే చెప్పనక్కరలేదు. మా వివాదం సందర్భంలో, పరిమాణ సిద్ధాంతం సంపూర్ణంగా నిర్వచించటానికి ముందు, భౌతిక శాస్త్రజ్ఞులలో చ్చాలమంది దీనిని స్వీకరించలేదు. కాని, నేనొక మాట చెప్తాను–నేను 1924 లో నీల్స్‌బోర్ 'ఇన్‌స్టిట్యూట్' లో చేరినప్పుడు అతను నాతో మొదట అన్నమాటంటే నేను గిబ్స్ ఉష్ణచలన శాస్త్రం మీద రాసిన పుస్తకాన్ని చదవాలని గిబ్స్ తప్ప ఇంకో భౌతిక శాస్త్రజ్ఞుడూ గణాంక ఉష్ణచలన శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకొనలేదని ఆయన అన్నాడు.

ఇతర రంగాల సంగతి ఇంకా హీనంగా ఉండేది. సాపేక్ష, పరిమాణ సిద్ధాంతాల విషయంలో ఎంతో సాంప్రదాయిక భావాలు కొన్ని పని చెయ్యవని మేము తెలుసుకోవలసివచ్చింది, వీటికంటే మంచి భావాలని తీసుకురావలసివచ్చింది. ఆకాశం, కాలం, న్యూటన్ నమ్మినదంతా వేరు కావనీ వాటిని "లోరెంట్స్ పరిణామం' అనేది కలుపుతుందనీ మేము తెలుసుకోవలసి వచ్చింది. ఒక వ్యవస్థ యొక్క పరిస్థితిని పరిమాణ సిద్ధాంతం దృష్టితో వర్ణించవచ్చు. ఈ సిద్ధాంతం ద్వారా ఒక రకం యంత్రశాస్త్రం సృష్టింపబడింది. దీని సహాయంతో ఒక వ్యవస్థ పరిస్థితిని గణితశాస్త్రం పద్ధతిలో గుర్తించవచ్చు. ఆకాశానికి (లేక అంతరిక్షానికి) ఎన్నో పరిమాణాలు ఉంటే దిక్కుని సూచించే అంశం ఒకటి (వెక్టార్) పయిన చెప్పిన వ్యవస్థయొక్క పరిస్థితిని ఈ అంశం గుర్తించటానికి సహాయపడుతుంది. ఈ వ్యవస్థని కొన్ని పరిస్థితులలో పరిశీలించటం జరుగుతుందనుకొనవచ్చు; అప్పుడు గణాంకశాస్త్రందృష్టితో దాని ప్రవర్తనని వర్ణించటానికి వీలవుతుంది. ఈ వీలు పయిన చెప్పిన అంశం (వెక్టార్) సూచిస్తుంది. సంప్రదాయపు అర్థం ఇచ్చే వర్ణనని వస్తునిష్ఠతో చెయ్యటం అసాధ్యం. ఇంతకన్నా వివరాలలోకి నేను వెళను. మూలభావాల విషయంలో ఈ మార్పులని స్వీకరించటానికి భౌతికశాస్త్రజ్ఞులు ఇబ్బందిపడుతున్నారు.

కాని, నేను ఎంచుకున్న వస్తువు "విజ్ఞాన శాస్త్రంలో సంప్రదాయం వహించే పాత్ర." నేను అడగవలసిన ప్రశ్న–అభివృద్ధికి

సంప్రదాయం అంత పట్టించుకోని శాస్త్రజ్ఞుల మనస్సులలో కొన్ని అవిచార భావాలు (అవి బోలెడంత అభివృద్ధికి అత్యవసరమయిన షరతు) కలిగేటట్టు చేసిందా 'వక్రీభావాలు' అన్న మాటలవలన ఒక సమస్య ఉత్పన్నమవుతుంది.

మన పరిశోధనలని గురించి, మనం అనుసరించే దృగ్విషయాలని గురించి మాట్లాడేటప్పుడు మనకి ఒక భాష అవసరం. మనకి మాటలు అవసరం. భావాలు మాటల ద్వారానే కదా బయటపడగలవు? మన అన్వేషణ లేక పరిశోధన ప్రారంభంలో మాటలు పాతభావాలతో ముడిపడి ఉండటాన్ని మనం తప్పించలేము. కొత్త మాటలు ఇంకా పుట్టవు. అందుచేతనే, వక్రీభావాలు మన భాషలో అవసరమయిన ఒక భాగం - వాటిని మనం తొలగించలేము. మనం భాషని సంప్రదాయం ద్వారా నేర్చుకుంటాము. సాంప్రదాయిక భావాలు మనం ఆలోచించే విధాన్ని నిర్ణయిస్తాయి, మన ప్రశ్నలు ఏవి అయివుండాలో కూడా నిర్ణయిస్తాయి. లార్డ్ రూథర్ ఫోర్డ్ ప్రయోగాలనిబట్టి పరమాణువులో చుట్టూ ఎలక్ట్రానులు తిరిగే కేంద్రం ఉందన్న సూచన చెయ్యటానికి వీలుకలిగింది. ఈ సూచన ఒక ప్రశ్నని ఉదయింపచేస్తుంది: ఒక పరమాణువు బయటి భాగాలలో ఎలక్ట్రానులకంటే వాటి కదలికలు ఎలాగ ఉంటాయి? వాటి స్థానాలు ఎక్కడ ఉంటాయి? అసలు ఎలక్ట్రానుల కక్ష్యలు ఏమిటి అని దూరంలో ఉండే నక్షత్రాలలోని సంఘటనలని మనం పరిశీలించినప్పుడు, "ఈ రెండు సంఘటనలూ ఏకకాలంలో జరిగాయా?" అన్న ప్రశ్న అడగటం సమంజసం అనిపిస్తుంది.

ఈ ప్రశ్నలకి అర్థంలేదని గ్రహించటం తేలికకాదు. అది కష్టంతో, బాధతో కూడిన పని. వక్రీభావాలన్న మాటతో దానిని తక్కువ చెయ్యకూడదు. విజ్ఞానశాస్త్రంలో మూలభావాలుకొన్ని మార్చవలసివచ్చినప్పుడు సంప్రదాయం ప్రగతికి తోడ్పడడమేకాక అడ్డుగా కూడా ఉంటుంది. కొత్త భావాలు స్వీకరింపబడటానికి చాలాకాలం పడుతుంది.

చివరగా నేను ఈఆలోచనలని నేటి భౌతిక శాస్త్రం పరిస్థితికి వర్తింపచేయ్యటానికి ప్రయత్నిస్తాను.

మన కాలంలో పదార్థంయొక్క మూల నిర్మాణం అనేది ముఖ్యమయిన సమస్యలలో ఒకటి. "మూలకణాలు" ఉన్నయన్న భావం డెమాక్రిటస్ కాలంనుంచి ఈ సమస్యమీద అధిక ప్రభావం చూపిస్తూవచ్చింది. మన చిత్రాలలో, ప్రశ్నలలో ఇది స్పష్టంగా బయటపడుతుంది. పదార్థఖండం ఏది తీసుకున్నా అందులో పరమాణు సమూహాలు ఉంటాయి. పరమాణు సమూహంలో పరమాణువులు ఉంటాయి. పరమాణువులో కేంద్రం, ఎలక్ట్రానులు ఉంటాయి. కేంద్రంలో ప్రోటానులు, ఎలక్ట్రానులు ఉంటాయి.

ప్రోటానుసంగతి ఏమిటి? అదే మూలకణమా? దానిని విభజించటానికి వీలులేనప్పుడే అది మూలకణం కాగలదు. అది పదార్థం, విద్యుచ్ఛక్తికల బిందువు అయి ఉండాలని మనం కోరుకోవచ్చు. కాని ప్రోటాను నిర్దిష్టమయిన పరిమాణాలు కలది, దానిని విభజించవచ్చు. రెండు శక్తివంతమయిన ప్రోటానులు ఢీకొన్నప్పుడు. చిన్న ముక్కలు ఏర్పడుతాయి. కాని ఇవి ప్రోటానుకంటే చిన్నవికావు. అవి కూడా ప్రోటానులవంటి కణాలే—అంటే, చిన్న కణాల పరంపరలో కొన్ని వస్తువులు, ప్రోటానుకన్నా ఎక్కువ (అది సున్నాకాకపోతే) విద్యుచ్ఛక్తిని వహించే కణాలు. రెండు ప్రోటానులు ఢీకొన్నప్పుడు కలిగే ఫలితం విభజన అని ఎట్లా అనగలము? పాత ప్రోటానుల చలనశక్తి కొత్త కణాలుగా మారుతుంది. ఇది సాపేక్ష సిద్ధాంతపు ప్రోటాను అన్నమాట.

ప్రోటాను 'మూల'కణం కాకపోతే మరి దానిస్వభావం ఏమిటి? అది పదార్థంతో నిర్మించబడినదే—కాని పదార్థం కణాలతో నిర్మించబడిందికదా? దానినిబట్టి ప్రోటానులు ఎన్ని కావలిస్తే అన్ని ఎన్ని రకాలు కావలిస్తే అన్ని రకాలతో నిర్మించబడి ఉంటాయని మనం ఊహించవచ్చునన్నమాట.

2600 సంవత్సరాల క్రింద, డెమాక్రిటస్ కాలంనుంచి, సంప్రదాయం ప్రకారం అడుగుతూన్న మన ప్రశ్నకి చక్కటి సమాధానం దొరకటంలేదని మనం చూడగలుగుతున్నాము. కాని మనం ఈ ప్రశ్నలని అడగకుండా ఉండలేము. మనభాష ఈ సంప్రదాయంతో ముడిపడి ఉంది. "విభజన" "స్వభావం" "కణాల సంఖ్య" మొదలయిన మాటలని వాడాలి—మనఅవలోకనాలు మాత్రం ఈ మాటలని పరిమితంగానే వినియోగించవచ్చునని తెలుపుతాయి.

మన సంప్రదాయానికి దూరంగా వెళటం ఎంతో కష్టమని మళ్ళీ చెప్పాలి. మూలకణాలని గురించి ఇటీవలే ఒక వ్యాసం చదివాను.

అందులో ఇలాగ ఉంది: "బ్యోర్కెన్ సాధించిన ఫలితాలనిబట్టి మనం ప్రోటాను విద్యుచ్ఛక్తికి సంబంధించిన గుణాల విషయంలో మాత్రం గరుకుపాడి నిర్మాణం కలిగి ఉంటుందని తీర్మానించుకోవచ్చు..." రచయిత "గరుకుపాడి నిర్మాణం" అన్న మాటలు బ్యోర్కెన్ చెప్పిన ఒక సూత్రానికి మాత్రమే వర్తించవచ్చునన్న సంగతిని మరిచిపోయి ఉంటాడు. ఇంతకన్నా ఎక్కువ సమాచారాన్ని ఆ మాటలు ఇవ్వవని అతనికి తట్టి ఉండకపోవచ్చు. ఇంకొక ఉదాహరణ ఇస్తాను. ఈ రోజుల్లో ఎందరో భౌతిక శాస్త్రజ్ఞులు తమ ప్రయోగాలతో "క్వార్క్" అనబడే కణాలకోసం వెదుకుతూ ఉంటారు. వీటికి ప్రోటానుకి ఉండే విద్యుచ్ఛక్తితో మూడవవంతు, లేకపోతే మూడవ వంతుకి రెండురెట్లు విద్యుచ్ఛక్తి ఉంటుంది. ఈ క్వార్క్లకోసం ఇంత తీవ్రమయిన అన్వేషణ ఎందుకు జరుగుతున్నట్టు? పదార్థం యొక్క 'పరమమూలకణం' దొరుకుతుందనే ఆశవలననే జరుగుతోందని నా నమ్మకం—పదార్థంలో ఇంతకన్నా చిన్న కణాలు ఉండవని ఆశ. క్వార్క్లు దొరికినా అవి తిరిగి రెండు రకాలవిగా విభజింపబడటానికి అవకాశం లేకపోలేదు. వాటిని రెండు క్వార్క్లు, ఒక "ప్రతిక్వార్క్" (యాంటీక్వార్క్)గా విభజించటానికి వీలుకావచ్చు. ఇవి ప్రోటానుకన్నా మూలకణాలుకావు. పాతసంప్రదాయాన్ని తప్పించుకోవటం ఎంతకష్టమో మీకు తెలుస్తోందికదా!

భావాలలో మౌలికమయిన మార్పులు రావాలి. డెమాక్రిటస్ సిద్ధాంతాలని మనం వదులుకోవాలి. మూలకణాలు ఉంటాయన్న భావాన్ని విసర్జించాలి దీనిబదులు ప్లేటో తత్వసిద్ధాంతాలనుంచి ఉద్భవించిన మౌలిక సమప్రమాణ భావాన్ని స్వీకరించాలి.

కోపర్నికస్, గెలీలియోలు — అరిస్టాటిల్ యొక్క వర్ణనాత్మక పద్ధతిని వదులుకుని ప్లేటోయొక్క నిర్మాణాత్మక పద్ధతి వయిపుకి మొగ్గారు. అదేవిధంగా మనం బహుశ డిమాక్రిటస్ యొక్క పరమాణు పదార్థ సిద్ధాంతాలని ప్లేటో వాదాలలో కనిపించే సమప్రమాణభావాల వయిపు మొగ్గు చూపిస్తూ ఉండవచ్చు. మనం మళ్ళీ పాత సంప్రదాయానికి తిరగవచ్చు. కాని, నేను ఇంతకిముందే అన్నట్టు ఇటువంటి మార్పులు తేలికగా రావు. మార్పుతోబాటు ప్రయోగానికీ సిద్ధాంతానికీ కూడా సంబంధించిన వివరాలని ఎన్నిటినో [illegible]. ఈ మార్పులో ప్రయోగాత్మక కణభౌతిక శాస్త్రంలో రావాలి. విజ్ఞానశాస్త్రం చరిత్రలో కొత్తదశ మొదలవుతుందని మాత్రం నేను అనుకోను.

అంటే—సంప్రదాయం మూడు విధాలుగా విజ్ఞానశాస్త్రం మీద తన ప్రభావాన్ని చూపిస్తుంది: సమస్యల ఎన్నికలో, పద్ధతిలో, భావాలలో. తుది మాటలుగా విజ్ఞానశాస్త్రం అభివృద్ధి యొక్క భవిష్యత్తుని గురించి నేను కొన్ని మాటలు చెప్పాలేమో. భవిష్యత్తు శాస్త్రంమీద నాకు ఆసక్తి లేదని గట్టిగానే చెప్పాలి. కాని, మనకి చరిత్ర క్రమంవలన ఎదురయ్యే సమస్యలమీదనే కృషి చెయ్యగలము. ఈ క్రమం ఆసక్తికరమయిన కొత్త ప్రశ్నలకి దారితీసిందా, అని అడగాలి. భౌతికశాస్త్రంలో భగోళ భౌతికశాస్త్రాన్ని పేర్కొనాలి. "పల్సార్"లు, "క్వాసార్"లు వింతగుణాలని ప్రదర్శిస్తున్నాయి. భూమ్యాకర్షణ తరంగాలు కూడా అనుగమించతగినవే. ఈ అనుశీలన ఒకరకమయిన సవాలు అనుకోవచ్చు. ఇదంతాకాక "పరమాణు సమూహ జీవశాస్త్రం" వలన ఏర్పడిన విశాలరంగం ఉంది. ఈ రంగంలో భిన్నంగా జన్మించిన భావాలు భౌతిక, రసాయన, జీవశాస్త్ర భావాలు—కలిసి ఎన్నో ఆసక్తిని కలిగించే కొత్త సమస్యలని సృష్టిస్తాయి. ఇక వినియోగాన్ని గురించి ఆలోచించినట్లయితే, మన వాతావరణంయొక్క వినాశానికి సంబంధించిన సమస్యలు పరిష్కారం కోసం మిగులుతునాయని తెలుసుకొనగలుగుతాము.

ఈ విషయాలన్నిటిని గురించి నేను ఎందుకు చెప్పాను? భవిష్యత్తుని గురించి ముందుగానే చెప్పగలననటానికికాదు, శాస్త్ర సంప్రదాయం (అంటే చరిత్రక్రమం) మనకింకా ఎన్నో సమస్యలని పరిష్కరించమని చెప్పగలదు, మన ప్రయత్నాలని ప్రోత్సహించగలదు. విజ్ఞానశాస్త్రం యొక్క పరిస్థితి ఆరోగ్యంగానే ఉండటానికి ఇదే చాలు.

(అయిపోయింది)

మీ ఆశీర్వాదమే చాలు మహాప్రభూ!

హిందీ మూలం :

శ్రీ కృష్ణా

అనువాదం :

శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

ఇంతవరకు కొన్నివేలమంది అమ్మాయిలు ఈ కాలేజీలో చదివి జీవిత రంగంలో ప్రవేశించి వుంటారు. వాళ్ళ రూపు కాని, ఊరూ పేరూ కాని ఒక్కటీ నాకు జ్ఞాపకముండదు వాళ్ళలో చాలామంది అమ్మలేమిటి, అమ్మమ్మల,నాయనమ్మల జాబితాలోనికి చేరిపోయారు. తరుచుగా మార్కెట్టువద్దనో, రోడ్డు చివర్లోనో కనపడినప్పుడు, సిగ్గుతో నాకు 'నమస్తే' చేయించేటప్పుడు వాళ్ళ ముఖాల్లోంచి తొంగిచూసే అపారమైన అనుభవాన్ని చూసినప్పుడల్లా వయస్సులో పెద్ద వాడి నయినా జీవితపు విలువలను అర్థంచేసికొనడంలో ఇంకా నేను విద్యార్థిగానే ఉండిపోయానని అనుకొంటాను.

అందువల్లే అంజనా కాలేజిలో అడ్మిట్ అయి నా దగ్గరకు వచ్చినపుడు ఆమె ఆకారమూ, వ్యక్తిత్వమూ నాకు 'బోగస్'గా 'మోస్ట్ ఆన్ ఇంప్రెసివ్'గా తోచాయి. అంజనా అతిగా సంకోచపడేది, సిగ్గుపడేది. అంత సంకోచమూ, సిగ్గూ ఎబ్బెట్టు అనిపించేవి నాకు. ఎప్పుడూ నేలనుచూసే ఆమె చూపులు, క్లాసులో మాత్రం లెక్చరరువైపు మళ్ళేవి. ఆమె చూపులు లెక్చరరను హిప్నొటైజ్ చేసేలాగుండేవి. ఇంతగా సిగ్గుపడే అమ్మాయి క్లాసులో కూర్చొని జాన్ స్టూవర్ట్‌మిల్, స్పెన్సర్, వర్డ్స్‌వర్త్, షెల్లి, కీట్స్, మొదలగు వారిగురించి ధైర్యంగా చర్చిస్తుంటే నాకు అంతుపట్టేదికాదు. ఎందుకంటారా, క్లాసునుంచీ బయటికిరాగానే, ఎప్పుడైనా గ్యాలరీలో ఎదురైతే 'నర్వస్' గా ఫీలయి పుస్తకాలు జారవిడుచుకొనేది.

పరీక్షలు ముగిశాయి. ఇంకా ఫలితాలు ప్రకటింపబడలేదు. ఆమె తప్పకుండా ప్యాసవుతుందనే నమ్మకము నాకుంది. అంజనా మేనమామగారింటినించి అమ్మదగ్గరకు వెళ్ళేరోజు నాకు కనపడింది చామనఛాయగావున్నా కళకళలాడే ఆమె ముఖం ఎందుకోవిచారంతో నిండివున్నట్లు కనిపించింది. నా భార్య అంజనా తలనిమిరి ఆశీర్వదించేటప్పుడు, తల్లిని ఎడబాసిపొయ్యే కూతురిలా ఆమె ఏడ్చింది. ఆ దృశ్యం చూసి నా కళ్ళల్లో నీరు తిరిగాయి.

తరుచుగా నేనూ, నా భార్య అంజనా గురించి మాట్లాడుకునే వాళ్ళం. "నువ్వు ఎన్నైనాచెప్పు అమ్మాయి మాత్రం జీనియస్. భావాలను ఎంత చక్కగా వ్యక్తం చేస్తుందనుకున్నావ్. టాగోర్, సరోజినినాయుడు, వర్డ్స్‌వర్త్, కాలరిడ్జ్, షెల్లీ, కీట్స్ ఏ కవి భావాలనైనా హృదయంగమం చేసికొని చక్కగా ఆన్సర్ వ్రాస్తుంది. ఇటీజ్ ఎ ప్రివిలేజ్ టు రీడ్ హర్ ఆన్సర్ బుక్. హిందీలోకూడా అమ్మాయి బాగా కృషిచేసింది."

నాభార్య నాతో ఏకీభవించేది. "కాని దేవుడు అమ్మాయి తెలివితేటలను చల్లగా కాపాడుకొచ్చినప్పటి మాట..." శ్రీమతి పసగేది.

చాలారోజుల తర్వాత ముచ్చటైన పెండ్లి పిలుపు అందుకోగా కుమారి అంజనా త్వరలో శ్రీమతి కాబోతున్నదనే సమాచారం తెలిసింది. పెండ్లిపత్రిక చివర్లో "మీ ఆశీర్వాదం కోరుతూ అంజనా" అనే ముద్దులు మూటగట్టే అక్షరాలు కనపడ్డాయి.

పెండ్లయిన తర్వాత అంజనా ముఖంలో సిగ్గూ బిడియాలు మాయమయి ధైర్యసాహసాలు కొట్టవచ్చినట్టు కనపడ్డాయి. శ్రీమతితో ఈ విషయం ప్రస్తావించినప్పుడు మరి కొన్ని విషయాలు తెలిశాయి. అంజనా అత్తగారింటివారు అదోరకపు మనుషులట. ఇచ్చిపుచ్చుకోవడాల్లోను, అమ్మాయి ప్రవర్తనలోను వారికేదో లోటు కనబడినట్లుగానూ, అమ్మాయిపట్ల అసంతృప్తికరంగాను ఉన్నట్లు

తోస్తున్నారట. అంతేకాదు, అంజనా భర్త రెండో పెళ్ళి చేసుకొనడానికి వ్రాతమూలకంగా అనుమతిని ఇమ్మని ఆమెను తొందర పెడుతున్నాడట. ఈ మాటలు వినగానే నాకు ఎక్కడలేని కోపం వచ్చింది.

"ఆవెధవకు వ్రాతమూలకంగా ఏమీ ఇవ్వొద్దు" అని అంజాకు చెప్పదామనిపించింది. ఇంతలోనే అంజా అనుకొన్నంతపనీ చేసి అమ్మ దగ్గరకు వెళ్ళిపోయిందనే సంగతి తెలిసింది. ఆరోజు వాళ్ళమ్మ తప్పకుండా తల గోడకు బాదుకొని వుంటుంది. చిన్నాన్న, పెదనాన్నల దయాధర్మాలపై ఆధారపడి బ్రతికే తల్లి దగ్గరకు వెళ్ళిన అంజా స్థితి ఎంత హీనంగా, దీనంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. వయస్సులో వున్న పిల్లకు యావజ్జీవ కారాగార శిక్ష ఆ బతుకు.

కాని మొన్న కలిసినప్పుడు అంజనా మునుపటికంటే ఆనందంగా, ఉల్లాసంగా కనపడింది. గాంధీ, నెహ్రూ, మార్క్స్, లెనిన్, టాగోర్, బంకిం, శరత్, ప్రేమ్‌చంద్, యశ్‌పాల్ .. తన విషయం తప్ప ప్రపంచంలోని అన్ని విషయాల గురించి మాట్లాడటానికి సిద్ధంగా అగుపడింది మనస్సులోని చెప్పాలంటే...... ఆమెతో కలిసి మాట్లాడిన తర్వాత నా హృదయంలో ఎక్కడో కలుక్కుమన్నట్లయింది.

రెండు నెలకో మూడు నెలకో ఓమారు తప్పకుండా సెమినార్ వుంటుంది. అంజనా ఆహ్వానం ఎప్పుడూ ఉండనే వుంటుందాయె ఆమె ఊరికి పోయిన తర్వాత ఆమెను చూడకుండా తిరిగి రావటం సాధ్యమయ్యే పనేనా? ఓమారు నేను, శ్రీమతి కలిసి సెమినారుకు వెళ్ళాం.

"అంజా, ఆవెధవ నీకు ఏమైనా భరణము ఇస్తున్నాడా లేదా......" శ్రీమతి తన మాటలు ఇంకా ముగించక ముందే, అంజా శ్రీమతి కాళ్ళకు మొక్కి, పాదధూళి తలపై పెట్టుకొని "కష్టాలను ఎదిరించి నిలిచేశక్తి నాకు కలగాలని ఆశీర్వదించండి. నాకదే పదివేలు" అంది నేను దిగ్భ్రాంతి చెందాను.

తల్లి బిడ్డలను ఇద్దరినీ ఇంట్లో రాచి రంపాన పెడుతున్నారనీ, అంజా సంపాదించే చాలీచాలని జీతంతో ఇద్దరూ కలిసి వుండి బ్రతకడం కష్టమని అంజా కథంతా శ్రీమతి నాతో చెప్పింది. అంజా అమ్మ రోజూ ఏడుస్తూ వుంటుందట. అంజా అప్పుడప్పుడు శ్రీమతికి ఉత్తరాలు రాస్తూ వుంటుంది. అంజా నూటపాతిక రూపాయల జీతానికి ఒక ప్రైవేట్ స్కూల్లో టీచరుగా చేరిందని ఆ ఉత్తరాల ద్వారానే మాకు తెలిసింది.

ఏదో సెమినార్ సందర్భంగా నేను ఆవూరెళ్ళాను. పనిలో పని, అంజనాను చూస్తే సరిపోతుంది కదా అనుకొన్నాను. అంజా ఇంటికెళ్ళి చూడ వెన్నబుడ్డిపొయ్యాను తలుపు తెరువగానే ఉన్నపాటున అంజా నన్ను హత్తుకొని బిగ్గరగా ఏడ్వడం మొదలెట్టింది. జీవితంలో ప్రేమాభిమానాలు పంచిపెట్టే ఒక్కగానొక్క దిక్కైన ఆమె తల్లి మరణించిందని తెలుసుకొనటానికి నాకెంతో కాలం పట్టలేదు. పక్కనే కూర్చున్న అంజా స్నేహితురాలు అంజా లోపలికి వెళ్ళిన తర్వాత ఇలా చెప్పింది. 'అమ్మ చనిపోయిన తర్వాత సూతకం ముగియక ముందే రాత్రికి రాత్రి చిన్నాన్న పెదనాన్నలు అంజాను బయటికి గెంటి తలుపులు వేసుకొన్నారట. అంజా కాళ్ళావేళ్ళా పడితే 13 రోజుల వరకూ ఇంట్లో ఉండటానికి ఒప్పుకొన్నారట. మిమ్ముల సతిగాజా అనుకొంటూ వుంటుంది. మూడురోజుల నుంచి ద్రౌపది కృష్ణుణ్ణి అనుకొన్నట్లు మిమ్ములను తలుస్తూ వుంది మీరిలా అకస్మాత్తుగా రావటం ఆశ్చర్యంగావుంది ఇంట్యూషన్ అంటే ఇదే కాబోలు."

అంజనా లోపలినుంచి వచ్చి చినిగిన పాతబట్టలో చుట్టిన పూలపొట్లం ఇచ్చింది "మాస్టారూ! మీరెటూ కాశికి వెళ్తారు కదా! ఈ పూలను గంగా ప్రవాహంలో విడవండి. బతికినంతకాలం అమ్మను కష్టపెట్టాను. ఈ విధంగానైనా నా అమ్మ ఆత్మకు సుఖం చేకూర్చానే తృప్తి నాకుంటుంది దయచేసి మీరీపని చేసి పెట్టండి," అంజా ప్రార్థన నా మనసును కరిగించి వేసింది.

"నువ్విక్కడుండి ఏం చేస్తావ్? నావెంబడి వచ్చేయ్. అక్కడయితే అక్కయ్యా, పిల్లలుంటారు. నీకుగాను ఉద్యోగ ప్రయత్నాలూ చెయ్యొచ్చు పద' అన్నాను నేను.

"లేదు మాస్టారూ! మీరు అక్కయ్యగారు నా పట్ల చూపిస్తున్న ప్రేమాదరాలు సుఖాన్నయితే అందరూ ఆడుతూపాడుతూ పంచుకొంటారు కాని 'దిన దినగండం నూరేళ్ళాయుష్షు' లాగుంది నా జీవితం. ఒక రోజులో ముగిసేదికాదీ పోరాటం. నేనొక్కర్తే

ఎదుర్కోవాలి. మీరిద్దరూ నన్నాశీర్వదించండి. నాకంతే చాలు." నేను మారు మాట్లాడక వచ్చేశాను.

* * *

బహుశా 'బోర్డ్ ఆఫ్ స్టడీస్' మీటింగు ఉండిందను కొంటాను. ఆపూట వెళ్ళాను. బస్‌స్టాండులో నించొని అంజనా ఇంటికి వెళ్దామని ఆలోచిస్తున్నాను. ఇంతలో బ్యాగ్ భుజానికి వేసుకొని, మలమలమాడ్చే ఎండలో టపటపమని చెప్పులు శబ్దం చేస్తూ అంజనా పోతూ కన్పించింది. నేను బిగ్గరగా 'అంజనా' అని పిలిచాను. ఆమె నిలిచి, రోడ్డు దాటిరావడానికి ప్రయత్నిస్తున్నది. కొంచెం కుంటుతూ నడుస్తున్నది. 'ఎందుకు కుంటుతున్నా'వని అడిగాను. "స్కూలుకు పోయే తొందరలో బస్సు ఎక్కుతూ క్రింద పడ్డాను" అని సమాధాన మిచ్చింది.

నేను ఆమెతోపాటు నడుస్తూ, ఆమె హాస్టలు వరకూ వచ్చాను. త్రోవలో ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలన్నీ సమీక్షించాం. సొంతవిషయం కదిపేసరికి ఆమె టాపిక్ మార్చేసేది. చివరికి నేను మొహం మీద అడిగేశాను. "ఇలా ఒంటరిగా జీవితంతో పోరాడే దానికంటే నీవు పెళ్ళెందుకు చేసుకోరాదు?"

"మాష్టారూ! జీవితం సినిమాలా వుండదు. జీవితాన్ని సుఖమయం చేసుకోవడానికి అవసరమైన సామగ్రిని చేకూర్చుకోటానికయ్యే ఖర్చు భరించటం నాచేతకాని పని. అమ్మ తెచ్చిన అప్పుడబ్బుల్ని పందెంకట్టి జీవిత చదరంగంలో మేము చిత్తుగా ఓడిపోయాం." నవ్వుతూ మరలా అంది. "అప్పుడైతే రెండుకాళ్ళూ బలంగా వుండేవి. ఈ స్థితిలో ఎటువంటి బాధ్యత వహించాలన్నా ధైర్యం చాలకున్నది."

హాస్టల్‌లో వున్నవి గదులా? పావురాల గూళ్ళు. గదిలో ఓ మూల చెక్కమంచం. వెంటిలేటరులాంటి చిన్న కిటికీలో ఓ చిన్న

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల రు. 15-00

బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టలతో, కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల : రు. 7-50

భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానములో బైండు చేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల : రు. 7-50

ఆంధ్రపత్రిక ఏజెంటద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

.... ప్రతులకు ....

మేనేజరు

ఆంధ్రపత్రిక, గాంధీనగర్. విజయవాడ-3.

పవ్, రెండుగాజు గాజులున్నాయి. ఆమె స్టౌవ్ తీసి గబగబా వెలిగించి టీకై నీళ్ళు పెట్టింది.

ఆమె తలవంచుకునే చెప్పసాగింది. "మాస్టారూ! నేనంటే మీకెందుకంతదయ? నాతోపాటు ఉద్యోగంచేసే అమ్మాయిలను చూస్తున్నాను. దుఃఖం, దారిద్ర్యం, అసమర్థత, పిరికితనంతో కూడుకొని జీవితమనే బండిని ఈడ్వలేక యీడుస్తున్నారు. నేను పడుతున్న కష్టం అంతా నేను కోరుకున్నదే, అనుకున్నదే." ఒక్కక్షణం తలెత్తి నావైపు చూసి ఫక్కున నవ్వేసింది. "మాస్టారూ! జీవితసమరంలో చచ్చి సాధించేదేమీలేదు, బ్రతికి నవ్వుతూ ఎదుర్కొంటేనే గెలుపు దక్కేది."

* * *

స్త్రీల సమావేశమేదో ఉండింది కాబోలు. శ్రీమతికూడా డెలిగేటు. ఏదో మీటింగు కారణంగా నేనూ బయలుదేరాను. ఇంకేం ఇద్దరూ బయలుదేరాం. సొంత పనులతోపాటు అంజూను చూడటం కూడా జరుగుతుందనే ఉత్సాహం. సంతోషంమనసులో పురకలు వేయసాగాయి. మీటింగులు ముగియగానే అంజనా హాస్టలువైపు వెళ్ళాం. అంజనా హాస్టలు బయటనే కనపడింది—కుంటుతూ, కాలు ఈడుస్తూ. అంజూ శ్రీమతి ఎదకు బల్లిలా అతుక్కు పోయింది. శ్రీమతి దుఃఖం ఆపుకోలేక బిగ్గరగా ఏడ్చింది. నేను ఏడ్వలేక గంభీరంగా ఉండిపొయ్యాను.

"అంజూ! ఇన్ని కష్టాల్లో నీవు నవ్వుతూ ఎలా వుండగలుగుతున్నావు?" టీ త్రాగుతూ శ్రీమతి ప్రశ్నించింది.

"భలేప్రశ్న అడిగారు అక్కయ్యా మీరు? ఒక పెద్ద సరళరేఖ. మరో చిన్న సరళరేఖ గీశామనుకోండి చిన్న సరళరేఖనుచూసి పెద్దసరళరేఖ తాను గొప్ప అని మిడిసిపడుతుంది. ఇంకా విశదంగా చెప్పాలంటే రెండుకాళ్ళూలేని అవిటివారికంటే, ఒక్కకాలుకలవారు అదృష్టవంతులే కదా? బ్రతకాలంటే నిజాలు—వాస్తవికత—ఇవి మాత్రమే చాలవు. భ్రమలు వలయాలుకూడా అవసరం అక్కయ్యా!" అంజూ పైకప్పు అదిరేలా నవ్వింది. బ్రతుకులేని, బ్రతకలేనివాళ్ళను ఆవరించుకొనివున్న పాత గోడలు కుప్పున కూలిపోతాయనే భ్రమ కల్గింది నాకు.

రోడ్డు పైకి రాగానే శ్రీమతి గద్గద కంఠంతో "ఏమోనండీ, చూస్తూంటే అంజూ నార్మల్‌గా వున్నట్టులేదు. ఎటువంటి జీనియస్‌కు ఏగాంటి....." ముందు మాట్లాడలేక చేతిగుడ్డతో ముఖం కప్పుకుంది.

నిరాశ—నిస్పృహలతో నిండిన నా మనస్సు కుంగిపోయింది. సామానుసర్ది, అన్యమనస్కంగా ఎలాగో స్టేషన్ చేరాం.

రైలు కదిలింది విచారంగావున్న భార్యను "ఏమిటాలోచిస్తున్నావు?" అనడిగను.

"ఏమని చెప్పేది? అంజనా విషయమే ఆలోచిస్తున్నాను. ఈ నాలు గోడలమధ్య నివెలా బ్రతుకుతున్నావని అడిగితే ఏమందో తెలుసా?" "ఈగది నేను చెమటోడ్చి సంపాదించిన డబ్బుతో నిర్మించుకొన్న అద్దాలమేడ. నాపాలిట ఆనంద భవనం రాజభవనం అక్కయ్యా!" మరుక్షణమే విచారంగా అంది. "జీవితాంతమూ కష్టాలలో నలిగినలిగి మరణించిన అమ్మను ఇక్కడికే పిల్చుకొని వచ్చివుంటే ఎంతో బాగుండేది కదా? అని అనుకొంటాను. అప్పుడప్పుడు అర్ధరాత్రి మెలకువ అయితే రాత్రంతా నిద్రపట్టదు. అమ్మ ఎక్కడ లేస్తుందో అనే భయంతో ప్రక్కకు కూడా ఒత్తిగిల్లకుండా పండుకొంటాను. ఇదంతా గమనిస్తున్న అమ్మ ఏమీ తెలియనట్టుగా తాను లేస్తే మంచం ఎక్కడ కిర్రుమంటుందో, నాకు నిద్రాభంగమవుతుందనే భీతిలో అలానే పడుకొని వుంటుంది. కనీసం ఈ గదయినా నా సొంతమయివుంటే ఎంత బాగుండేది.....అక్కయ్యా! అమ్మకు అంత మాత్రం కూడా సుఖాన్నివ్వలేకపోయాను... దౌర్భాగ్యురాల్ని..." పూర్ గర్ల్! శ్రీమతి [illegible]లోతాను విని వినపడక అని వూరుకుండిపోయింది రైలు కుదుపులకు కళ్ళు మూతలు పడుతున్నాయి.

చాలా కాలంపాటు సెమినారు జరగలేదు. ఇటీవల అటువైపు వెళినపుడు అంజనాను చూశాను. ఈసారి నాకెందుకో రోగిష్టియైన ఆమె తల్లి (పాపం చాలారోజులైనా) జ్ఞాపకం వచ్చింది. ఆమె ముఖంపై అప్పుడే ముసలితనపు ముడతలు కనపడుతున్నాయి. డాక్టరు ఆస్టియో ఆర్థరాయిటిస్ అని చెప్పాడట. స్కూలువని ముగిసిన తర్వాత ఆమె టైప్‌రైటింగ్ క్లాసుకు వెళ్ళేది. "ఎందుకింత శ్రమపడుతున్నావ్?" అని అడిగాను. అందుకిలా బదులు చెప్పింది. "పెదనాన్నగారివద్ద తీసుకున్న అప్పు 200 రూపాయలు అలానే వుండిపోయింది. టైప్‌రైటింగ్‌వల్ల వచ్చే సంపాదనతో ఆ బాకీ తీర్చేస్తాను ఈ మధ్య ప్రైవేట్ ట్యూషన్లు చెప్పకూడదని స్కూల్లో క్రొత్తగా రూలు విధించారు." "నీకెంత డబ్బు కావాలో

చెనీ, నేనిస్తాను. నీవు తీరికగా తీర్చవచ్చు. నీవు తిరిగి యివ్వక పోయినా నేనేమి అనుకోను. నేనేమి కానివాడను కాను. నీమీద నా కంతమాత్రం హక్కు లేదంటావా?" నేను ఆమెకు నచ్చచెప్ప ప్రయత్నించాను.

"నన్నింతగా ప్రేమించేవారు ఈ ప్రపంచంలో మీరుతప్ప ఇంకెవరున్నారు. మాస్టారూ! దినదినగండాలతో నిండివున్నది నా జీవితం. రెక్కాడితేకాని డొక్కాడని స్థితి నాది. మీరు నాకెంత సహాయపడతారు? ఎన్ని రోజులని సాయంచేస్తారు?" అంజనా కాస్సేపాగి సిగ్గుపడుతూ ఇలా చెప్పింది. "ఓ చిన్నమాట మాస్టారూ! చిన్నాన్న తత్త్వశాస్త్రంపై కొన్ని విమర్శనా గ్రంథాలు వ్రాసి, అవి వెలుతురు ముఖం చూడకముందే కన్నుమూశారు. నా దగ్గర డబ్బుంటే నేనే ప్రింటు చేయించేదాన్ని, అవి అమ్ముడు పోక పోయినా పర్వాలేదని. ఆవిధంగానైనా చిన్నాన్న ఋణం తీర్చుకొన్నదాన్నయ్యేదాన్ని కాని నేను సంపాదించే నాలుగురాళ్ళు నాపొట్ట నింపుకోడానికే చాలవు. మరి చిన్నాన్న ఋణమెలా తీర్చుకోగలను?" చెప్తూ చెప్తూ గట్టిగా నవ్వింది-అలా కొంతసేపు నవ్వుతూ వుండిపోయింది. ఈ సారి అంజను ఆశీర్వదించేటప్పుడు నా గుండె ఎందుకో బరువుగా తోచింది.

మార్చినెల. పరీక్షల కాలం. ఊపిరి పీల్చుకోటానికే తీరిక లేనంతపని. స్నానంచేసి హాల్లోకి రాగానే "అంజాకు బ్రెయిన్ కేన్సర్ అనీ, పరిస్థితి ఆందోళనకరంగా వుందని, ఆస్పత్రిలో చేర్పించారనీ, అంజా ప్రిన్సిపాలునుంచి మీకు ట్రంక్‌కాలు వచ్చింది..." శ్రీమతి చెప్తున్న మాటలు పూర్తిగా నా చెవికెక్కటంలేదు. బ్రెయిన్ కేన్సర్ అంజాకుకాదు, నాకే వచ్చినట్లు ఫీలయ్యాను.

"ఇక్కడి పనుల గురించి మీరేమీ బెంగపెట్టుకోవద్దండి. నేనన్నీ చూసుకుంటాను. మీరు వెంటనే బయల్దేరండి. పిచ్చిపిల్ల! మనం తప్పితే దానికి వేరే ఎవరున్నారు? ఎంత కష్టపడుతున్నదో ఏమో పాపం!" దుఃఖంతో శ్రీమతి గొంతు పూడుకుపోయింది. బయల్దేరేటప్పుడు ఎందుకైనా మంచిదని నోట్లకట్ట నా చేతిలో వుంచింది. కాని ఆ డబ్బు ఏమాత్రం ఖర్చుకాక అలాగే తిరిగి వస్తుందని నాకనిపించింది. నేను వెళ్ళేటప్పటికి అంజా శాశ్వతంగా నిద్రించి వుండొచ్చు చనిపోయేటప్పుడు ఆమె ఏమేమి ఆలోచిస్తూ వుండిందో! నా మనస్సు రైలుకంటే వేయిరెట్లు వేగంగా పరిగెడుతూ వుంది.

అంజనా ఆదర్శాలు-విలువలు చెక్కుచెదరలేదు కాని నా ఆదర్శాలు—విలువలు శవాకారంలో నాముందు గంతులేయసాగాయి.

ప్రిన్సిపాలుతో అడ్రసు తీసుకొని ఆసుపత్రి కెళ్ళాను. నాకోసమే అంజా కొనవూపిరితో ఎదురు చూస్తున్నది. డాక్టరు అంజా అనారోగ్యస్థితి వివరిస్తూ అన్నాడు: "విల్‌పవర్ అంటే ఇదే కాబోలు. లేకపోతే ఈమె మరణించి ఇప్పటికే 24 గంటలు గడిచి వుండాల్సింది." నేను బెడ్ దగ్గరకు వెళ్ళి ఎప్పటిలాగానే ఆమె తల నిమరడానికై వంగాను. గాజుకళ్ళలాంటి కాంతిహీనమైన ఆమె కళ్ళలో నాకు దుఃఖసముద్రపు తరంగాలు ఉవ్వెత్తున లేస్తూ కనపడాయి హృదయం ముక్కలవుతున్నా. దిటవు చేసుకొని ఆమె తల నిమిరాను. కాని ఆమెవైపు చూడలేకపోయాను. విశ్వసాహిత్యంలోని మహారచయితలకు, ద్రష్టలకు నిలయమైన ఆమె కళ్ళు మూతపడ్డం చూడటం నాబోటి మామూలు వ్యక్తికి సాధ్యమా? ఇంతలో నా చేతిని ఏదో వస్తువు స్పృశించినట్లయితే చూశాను. బ్యాంక్‌పాస్‌బుక్, అథారిటీ లెటర్, మరింకేదో ఉత్తరంలాంటిది కనపడ్డాయి. అంజనా నా కివ్వబోతున్న ఆస్తిని తీసుకొనబోయేముందు నా కళ్ళు వర్షించి షర్టు తడిసిపోయింది. దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. అసలా ప్రయత్నమే చేయలేదు. ఏడుస్తూనే రెండు చెంచాలనీరు అంజా గొంతులోకి పోశాను. ఆమె చేతిని గట్టిగా నా ఎదకు అదుముకోబోయేసరికి డాక్టరు "సారీ, షి ఈజ్ కొలాప్స్‌డ్" అని పెదవి విరిచాడు.

ఆస్పత్రి బయట ప్రిన్సిపాలు, సహోద్యోగినులు, విద్యార్థినులు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. శవాన్ని పూలమాలలతో, పూలతో కప్పేశారు. కూతురులాంటి అంజను ఎప్పుడూ తిరిగి రానిచోటికి పంపివేశాననే బాధ హృదయాన్ని తొలుస్తూ వున్నది. ఇక అంజా కన్నులకే కానరాదా?

కొన్ని పూలను తీసికొని కళ్ళకద్దుకొన్నాను. మరికొన్ని పూలను కర్చీఫులో కట్టుకొని జీవిత సమరంలో ఓడిపోయిన సైనికుడిలా యింటికి వచ్చాను.

జీవితంలోని కష్టాలన్నింటిని ఎదుర్కొంటూ ఎప్పుడూ చిరునవ్వు చిందించే పిచ్చిపిల్ల—అంజా శవంపైని పూలను నేనూ శ్రీమతి పవిత్ర గంగానదిలో ప్రవహింపచేసినప్పుడు మా హృదయాల్లో ఎక్కడో కలుక్కుమని బాధ కలిగింది. బనారస్‌లో హరిశ్చంద్రఘాట్‌కు కొంతదూరంలో విషాదసంగీత చక్రవర్తి సైగల్ పాట హృదయాలను ఛేదిస్తూ వినిపించింది. "అంగనా తో పరబత్ భయా, దెహరీ భయా బిదేస..."

నవ్యకవితా సామగ్రి

శ్రీ మన్నవ భాస్కరనాయుడు

కవి సృజనశక్తికీ పాఠకుని గ్రహణశక్తికీ మధ్య సేతువుగా వుపకరించగల సామగ్రి కవిత్వానికి అనివార్యమవుతున్నది. కవి తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రమే చెప్పలేదు. ఆ విషయాన్ని పుష్టి చేయడానికి అవసరమనిపించే యితర పదార్థాన్ని కూడ స్వీకరించి కవితలో బంధిస్తాడు. ప్రస్తుత వస్తు వివరణానికి అప్రస్తుత వస్తుసహాయం తప్పనిసరి అవుతున్నది. కవిత్వంలో కవితాసృష్టి జరిగిన నాటినుండి నేటివరకు ఇది అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే వుంది. స్వభావమో, స్వరూపమో సాదృశ్యంగల అన్యపదార్థ సంచయం వర్ణ్య వస్తు సాక్షాత్కారణానికి ఆలంబనంగా వుండక తప్పటం లేదు. వైషయికంగా అప్రస్తుతమైనప్పటికి కవిత్వానికి అవసరమవుతున్న ఈ 'సామగ్రి'ని పరిశీలించవలసివుంది. కాలంతోబాటు మారుచున్న అభిరుచుల కనుగుణంగా నవ్యకవిత్వంలో దర్శనమిస్తున్న 'కవితా సామగ్రి'ని స్థాలీపులాకన్యాయంగా పరిశీలించడమే ప్రస్తుత వ్యాసము!

నవ్యకవితా సామగ్రిని బేరం చేయడానికి ముందు ప్రాచీనకవితా సామగ్రిని గూర్చిన పరిచయజ్ఞానం అనవసరంకాదు. పూర్వకవుల కవితా వస్తువులు చాలవరకు ప్రసిద్ధాలు! కాని కల్పితేతివృత్తాలు కూడ అటనట లేకపోలేదు. వస్తువేదైనప్పటికి వారు స్వీకరించిన తత్సహాయ సామగ్రి చాలవరకు ఒక దుకాణంలో ఉపలభ్యమయ్యేదే! ఒకటీ, అర వినూతన సామగ్రి కనిపించినప్పటికి అది సముద్రంలో ఇంగువ కలిపినట్లే! సర్వసామాన్యంగా వర్ణ్యవిషయాన్ని ప్రతిబింబించడానికి ప్రాచీన కవిత్వంలో కెంపులు, ముత్యాలు గుంపులు గుంపులై దొర్లిస్తాయి. కస్తూరి కపురంపు బలుకులు నిస్తులంగా గుబాళిస్తాయి! జలతారు, జాళువాపసిడి తళుక్కుమంటాయి. మంచు, క్రొమ్మించు సమంచితంగా సంచరిస్తాయి. మరాళాలు, మయూరాలు ఒయ్యారాలు ఒలకబోస్తాయి; మలయమారుతాలు, కలువలు చలువలు వెదజల్లుతాయి: "చలువగల వెన్నెల..." అన్న సూరన్న పద్యం తత్కాలోపలబ్ధ కవితా సామగ్రికి దర్పణం!

"అక్షరానందసిద్ధి లక్ష్యముగనెంచు నవ్యుల"లో రాయప్రోలు "వాణి వాయింప మోగిన వీణమీద పాతగీత గీతములు పలికించి తెనుగుతోటలో క్రొత్తపూవుల్ని పూయించినారు. "కాలధర్మానుగతమె జగత్ప్రవృత్తి మారునపుడు వాఙ్మయమును మారు"నని "రమ్యాలోకము"లో క్రొత్త రుచులకు నాలుక చాపిన సుబ్బారావుగారు "సరస చైతన్య రంజిత జగతియందు కవి గ్రహింపగరాని వస్తువులు గలవె?" అంటూ నవకవి స్వేచ్ఛకు పూసరిపోస్తాడు. ఇక్కడ 'వస్తువు'లంటే కవితా వస్తువులని మాత్రమేగాక తత్సాధన సామగ్రి అని కూడ గ్రహించవలసి వుంటుంది. 'దేశకాల పాత్రానువర్తితములై", ప్రియములై, సహృదయ సేవ్యమానములైన వెల స్వీకరించి వాఙ్మయాంబరమలంకరించి" ప్రజాహృదయాలను అలంకరించటం కవిధర్మమని ఈయన నమ్మకం!

నవీనుల్లో నవీనుడైన శ్రీశ్రీ చైతన్య జగతిలోని సమస్త వస్తుజాలాన్ని, సామగ్రిగా తన కవితా వ్యాపారంలో వినియోగించుకున్న యుగకర్త! ఉత్తరాత తరమునకు ఉపకరించాలనో యేమో నవ్యకవితా సామగ్రిని కొంతవరకు పట్టిక తయారుచేసి భద్రపరిచాడు. "సిందూరం, రక్తచందనం, బందూకం, సంధ్యారాగం, పులిచంపిన లేడినెత్తురు, ఎగరేసిన ఎర్రజెండా, రుద్రాలిక నయనజ్వాలిక, కలకత్తా కాళిక నాలుక" నవకవనానికి కావలసిన సామగ్రి అంటాడు. 'ఘాటెక్కిన గంధకధూమం' మొదలుకొని 'ఝంఝానిల షడ్జధ్వానం' వరకు కవిత్వంలో ఆఘ్రాణింపచేసి ధ్వనింపించమంటాడు. కవితా సామగ్రిలోని పరిణామం దీనినిబట్టి కొంతవరకు విశదమవుతున్నది. నవ్యకవితా విపణి వీధిలోని కావ్యమంజూషలలో కనిపిస్తున్న కవితా సామగ్రియొక్క వివిధ భంగిమల్ని చూదాం!

కవి తాను చెప్పదలచుకొన్న విషయాన్ని సమగ్రంగా, స్పష్టంగా చెప్పడానికి సాధనాలుగా 'సామగ్రి'ని స్వీకరించడంలో కొన్ని విచిత్ర పద్ధతులు కనిపిస్తున్నాయి!

వస్తువు సాధారణమైనప్పటికి అసాధారణ సామగ్రి సహకారంతో అద్భుతంగా చిత్రించడం :

"బొగ్గు కంబములవలె పొడకట్టుచుండె తత్ప్రాంతమున నున్న తాళవృక్షములు"—పూహాగ్రాత సందర్శితాలైన బొగ్గు కంబములను సామగ్రిగా తీసికొని తాళ వృక్షసమూహమును మాత్రమే గాక వాటి వెనుకనున్న అవ్యక్త భావ భారాన్ని దువ్వూరి గుండెకు పట్టియున్నాడు. అలాటే "ఏడుపింకిపోయిన ఎడారి రొమ్ములు"—అన్న తిలక్ వాక్యం! ఎండిపోయిన రొమ్ములలోని "ఎడారి" అంత విశాలమైన విషాదం మనముందు సాక్షాత్కరిను౦ది పై మాటలో! సామాన్యమైన విషయంలోని అసామాన్య భావాన్ని ఇటువంటి సామగ్రి సహాయంతో చెప్పడం జరిగింది.

పై పద్ధతికి భిన్నంగా, అసాధారణ వస్తు వర్ణనకై అతి సాధారణ సామగ్రిని గ్రహించడంకూడ వుంది.

"భారతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్ల వారను గడుసరి గొల్లవారు
పిదుకుచున్నారు మూతులు బిగియగట్టి"—

అను చిలకమర్తి పద్యం బుద్దెరిగిన ప్రతి లేగ దూడకు పరిచయమే. ఆ సేతు శీతాచల పరివ్యాప్తమైన భారతదేశాన్ని, పరాధీన భారతీయ ప్రజాజీవితాన్ని ఆవు, దూడలనే సామగ్రిచేసికొని వ్యక్తీకరించిన కళానికి సమకాలీన జనం నీరాజనం పట్టింది.

"తాను పడిన శ్రమకు ధరణి తగిన ఫలితమివ్వదన్న ఒకనాటికి సమ్మెచేయని కూలీడు సూర్యుడు"—అన్న వాక్యాలలో సి.నా.రె యంత్రంచ కాస్త లిప్తే కూలీడు ప్రకృతి చక్రాన్ని నిర్విరామంగా త్రిప్పుచున్న (భగోళశాస్త్రం ప్రకారంకాదు) సూర్యుణ్ని చూపిస్తున్నాడు. సహస్రాంశని ప్రకాశాన్ని పొందుచూ అందులో సహస్రాంశమైనా భావ కాంతులను స్వభావకాంతులను ప్రసరింపలేని ధరణిని కూర్చిన కవి ఆవేదన పారిశ్రామిక యుగాని కనువైన సామగ్రివల్ల స్పష్టమవుతూంది.

కవితా సామగ్రిని గ్రహించడంలో మరొక చిత్రంకూడవుంది. మూర్తిమంతములైన వస్తు చిత్రణకు మూర్తిరహిత సామగ్రిని ఉపకరించుకోవడం; నిరాకారవస్తు వర్ణనకై సాకార సామగ్రిని సాధనంగా చేసికోవడం.

పూర్ణమ్మ నడకను వర్ణిస్తూ "పళ్ళను మీరిన తీపుల నడలను" అంటాడు గురజాడ. కంటికి కనిపించే నడకలో చెడగుర్ని చూపడానికి కనిపించని 'తీపి' ని సామగ్రిగా చేసికొన్నాడు కవి! పళ్ళను మీరిన తీపిని రుచిచూపి పూర్ణమ్మగమన మాధుర్యాన్ని పాఠకుల హృదయాలకు రుచి చూపిస్తున్నాడు.

"సంజ ఎరుపు సెలయేటి మీద చలిస తొలిసిగులాపుంది"

"పాపాలవంటి సహజ స్వచ్ఛమైన దీపాలు".

"క్షితిజ రేఖలా వంగిన నీ భుజాల వొంపు"—మున్నగు తిలక్ వాక్యాలు ఈ పద్ధతికి నిదర్శనాలు :

"ప్రణయ పయోరాశి మథించినాను ఆశకవ్వపు గిరి మనస్సు అహిపతిగను,"—(విశ్వనాధ) "చింతాపుష్పము తీరుచు", (రాయప్రోలు) 'స్వప్నం పిచికుక్కలా పరుగులెత్తింది"—(తిలక్) మొదలైన మాటలో నిరాకార (భావాల) వస్తువుల సాక్షాత్కరింప చేయడానికి అంజనంవలె వుపకరించిన సామగ్రిని మనం గుర్తించవచ్చు :

అనూచానంగా కవిత్వంలో 'వస్తువు' సరసనే కొలువు దీరుచున్న సామగ్రి కవి సమయాలుగా, వుపమానాలుగా ప్రతీకలుగా వుంటూ వున్నది.

"ఓనుపులకు వేచు చాతక శ్రీకుమారి
మెరయు మెరపుల లెంగు నేమెరుగగలదు ?
వాన కాడుకు మరిగిన వనమయూరి
కార్తిక జ్యోత్స్నకు నెట్లు కాంక్షసేయు ?"—అన్న రాయప్రోలు పద్యంలో దశరథ చితము ననుసరించడం అసాధ్యమన్న విషయం చెప్పడానికి సాధనమైన కవి సమయాలను మనం గుర్తించగలం :

"మోదుగులు పూశాయి పెదవులు" (విశ్వనాథ); "చెక్కుల లవంగపు మొగలు బోల చెమ్మటల్ మొలిచె" (రాయప్రోలు); "చిన్ని బంగారు పూలంచెండ వంటి జోస్నకందులు" (రాయప్రోలు); "సిందూరం కన్న ఎరుపైన నా హృదయాన్ని వీళ్ళు నడువలేరు" (తిలక్) - పై వాక్యాలలోని ఉపమానాల బలం సువిదితమే! కావ్య

వేలపుటాల పుటలలో 'ఉత్కృష్ట సామగ్రి' నిరుపహనమైన ప్రయోజనాన్ని సాధిస్తున్న సత్యాన్ని కాదనలేము!

శ్రీశ్రీ 'అగ్నికిరీటం' 'ఎర్రబావుటా' లు విప్లవ భావానికి ప్రతీకలు: "విపుగా పెరిగిన చెట్టుమీద ఎర్రని పువ్వొకటి విరిసి విండలా మెరుస్తూ ఇదేనిజం ఇదే నిజం అని నవ్వుతూ అంతలోనే రాలిపోయింది"—(తిలక్) అన్న వాక్యంలోని సంకేతాలు చైతన్య భావ వ్యాప్తికి దర్పణాలు: అరుద్రగారి "త్వమేవాహం" "సినీవాలి" కావ్యాలు ఆద్యంతము సంకేతాత్మకంగానే నిర్వహించడం వచనకవిత్వ పాఠకులకు పరిచయమైన విషయమే!

ఈ విధమైన సామగ్రిని వచనకవులు వాడుకొన్న తీరును పరిశీలిస్తే కింది విషయాలు మనకవగతమవుతాయి:

ప్రాచీన సామగ్రితో ప్రాచీన భావాలనే చెప్పడం;
ప్రాచీన సామగ్రితో నవీన భావాలను చిత్రించడం;
నవీన సామగ్రితో ప్రాచీన భావాలను వ్యక్తం చేయడం;
నవీన సామగ్రితో నవీన భావాలను వుల్లేఖించడం!

గురజాడవారు కేతువును "వేల్పులలనా కేళి వెలితోగ"గానే చూచారు. నారి "లలితేశ్వరి...కొమ్మెరుగు చాయున" తలుపువాటున మాయమవుతుంది రాయప్రోలు 'తెనుగుతోటలో' ప్రియురాలికి "నీలాలవంటి పెన్నెరులు దిద్ది" తీర్చినరిస్తారు. విశ్వనాథ ప్రణయినీ శిరజాభముల కనుల కాటుకయు బోలెగగనమ్ము క్రమ్మిమున్న... వవాషాత సమములు వర్ణింపజేస్తారు బాలగంగాధరతిలక్ 'అమృతం కురిసిన రాత్రిలో' "అశాఅం దశాలు" నిర్మిస్తారు: ఇవన్నీ పాత విషయాలే. ఇటికై వాడుకొన్న సామగ్రికూడా పాతదే

భావకవితా వనసీమలో వికసించిన నవ్యభావకుసుమాలకు శిరభాలను సంతరించిన సామగ్రి ముప్పాతిక మువ్వీసం ప్రాచీనమైనదే:

"దస్సికగొని చేరిన మిళింద తనయులకును
పూలపాలిచ్చి చీకట్ల పోవకుండ
కడుపులో దాచుకొనద పంకజము"

అన్న పద్యంలో రాయప్రోలు ప్రాచీన సామగ్రినే వినియోగించుకొని అతి నవ్యభావాన్ని విలసింపజేసినారు. పంకజ మిళిందములకు అనాదిగా నున్న ప్రేయసీ ప్రియ సంబంధాన్ని మిగాటి తల్లీబిడ్డల సంబంధాన్ని కల్పించారు. అలాగే గురజాడవారు...

'కన్నుల కాంతులు కలువల చేరెను
మేలిమి చేరెను మేని పసల్
హంసల చేరెను నడకల బెడగులు"

అంటూ పూర్వకవిసమయాలనే సామగ్రిగా గ్రహించి వ్యంగ్య మధురంగా నవ్యభావాన్ని వ్యక్తీకరించారు! అభ్యుదయ కవిత్వంలో కూడ సాంప్రదాయిక సామగ్రి పరిత్యజింపబడలేదు. అయితే అట్టి పాతబడిన సామగ్రితోనే సరిక్రొత్త భావాలను స్ఫురింపజేయడం వీరి విశిష్టత!

నవీన సామగ్రి స్వీకరించి ప్రాచీన భావాలను కూడా నాజూకుగా చిత్రించిన నవ్యకవులు లేకపోలేదు!

"దానిమ్మపూవంటి తరుణి కెమ్మోవి"; "తమలపాకుల వంటి సుందరి కపోలములు" (రాయప్రోలు) "గులాబీల కెంపులౌ కపోలములు" (దువ్వూరి) "ఊగులాడే పడగ తరగలు నాగుబాముల కోడెలతే" (విశ్వనాథ) మున్నగు వాక్యాలలోని గడుసుదనం గమనించదగింది.

"ఆకాశపు ఎడారిలో కాళ్ళుతెగిన ఒంటరి ఒంటెలాగుంది జాబిలి" అన్న శ్రీశ్రీ వాక్యంలోని 'ఒంటె' 'జాబిలి'కి సామగ్రి అయింది: ఒక మహాభయంకరమైన వెన్నెల రాత్రిలో కవిహృదయంలో గూడుకట్టుకునివున్న నిస్పృహకు నిదర్శనంగా నిలిచిన 'జాబిల్లి' వెన్నెల వేదికలోని మల్లెపూల బంతిగా కాక 'కాళ్ళు తెగిన ఒంటరి ఒంటె'లా నిలిచిపోయింది. "ఒకనాడు జ్వాలాముఖి భువి మ్రింగించిన రవిచందులు పదివిచ్చ్యుతులైన మంతివాడ్లట్టులైరి" నేడు అనే (సి. నా. రె) మాటలలోని సామగ్రి సమకాలీన సామాజిక వ్యూహాను జాగృతం చేస్తున్నది. మరొక్క (పేరు గురుతు…ని) కవి కుమారునికి ఒకానొక "వనిత కురులు ముఖమల్ గుడ్డలా" విగసిగలు విలకరించాయి

ఇక మిగిలింది నవీన సామగ్రితో అతి నవీన భావవ్యక్తీకరణ చేయడం! ఈ విధానాన్ని వుదాహరించి చూపడం లోకాన్ని దోసిటలో తేవడానికి ప్రయత్నించడమే అవుతుంది భావాభివ్యక్తికై అపురూపమైన సామగ్రి నూతనమే గాకుండా, అడుగడుగున జనజీవితంలో తారసిల్లే ప్రతివస్తువు సామగ్రిగా నవ్యకవికి వుపకరించింది. సుకుమార సుందరాలు. మధుర మనోహరాలు అయిన సామగ్రిని చాటుమాటుకు అవతలికినెట్టి, తీక్ష్ణ పరుషాలు, వికృత భయానకాలైన సామగ్రిని నవ్యకవులలో చాలమంది స్వీకరించారు. మార్క్సిజం

సారాని సిరాగా కలంలో నింపుకుని శ్రామికవర్గ చైతన్యమే కవితా వస్తువుగా స్వీకరించిన అభ్యుదయ కవులకు ఇటువంటి సామగ్రి వరణీయం అయింది "నా మనః కార్మికశాల కక్కేది చండాగ్ని సెగలు" అన్న శ్రీశ్రీ మాటలో కవి మనసులోని భావాగ్నిజ్వాలల తీక్ష్ణతను 'కార్మికశాల' వెల్లడిస్తున్నది. "దీపం-చీకటిబోనులో సింహంలా విల్సున్న"దన కవి ప్రజ్ఞ నవ్యభావస్ఫూర్తికి నిదర్శనం.

"నీడలి కొండ చిలువలు వెలుతురు కుందేళ్ళనుమింగి సంఘపు మర్రిచెట్లను చుట్టుకొని వత్తుగా నిద్రపోయే సమయాన మానవారణ్యంలోని పెద్దపులులు" విచ్చలవిడిగా సంచరిస్తుంటే పాఠక లోకానికి చూపిస్తాడు తిలక్.

"ఓ భోగంవానా, నీవు సంఘానికి వేస్టు పేపరు బాస్కెట్టువా"? అంటూ పఠాభి సంఘపు బల్లక్రింద మగ్గిపోతున్న వేశ్య జీవనస్థితిని వెలుపలికి లాగుతాడు.

'కొండవాగులోని ఎర్రని నీళ్ళు ఇరానీ హోటల్లోని టీ రంగులో వున్నాయి" అంటూ మరొక నవ్యకవి (పేరుగుర్తులేదు) నవీన సామగ్రిని వడపోసిన టీ కప్పు మన చేతికందిస్తాడు.

"క్రయినాలాంశి జీవితం" "సంగీతం సెంటు"గా, నవనీతం పాత్ర"గా. "దేవతః దరస్మితం"గా విభిన్నరూపాలలో తిలక్‌కు దర్శనమిస్తుంది.

ఆరుద్రగారికి "జీవితం రేడియోసెట్టు" వివిధ స్వరాలు వినిపిస్తుంది!

ఇంతేగాకుండా, నవకవుల నవ్యభావ వ్యంజకాలుగా చీపుళ్ళు, మంటలు నవీన కవిత్వంలో మనకు కనిపిస్తాయి. తెగిన తంత్రుల ఘోషలు, గంటలు వినిపిస్తాయి. ప్రాచీనకవులనుండి ఈనాటి కవుల వరకు ఈ సామగ్రి బహుధా స్వీకారయోగ్యమైంది. ఇంకను పాశ్చాత్య కవిత్వ ప్రభావం ఆలంబనమైతే, వర్తమాన సాంఘిక పరిస్థితి వుద్దీపనమైంది.

'కామధేనువు'నో 'కల్పవృక్షము'నో కావ్యవస్తువుగా ఎన్నుకున్న ప్రాచీనులు స్వీకరించిన కవితాసామగ్రికీ, 'కుక్కపిల్ల'ను, అగ్గిపుల్ల'ను, కూడా కవితా వస్తువులు చేసిన నవ్యులు గ్రహించిన సామగ్రికీ అంతరం ఎంతగానో వుంది. ప్రాచీన కవిత్వ సౌధాంతర్భాగాలలో అబ్బురంగా నిబ్బరంగా దర్శనమిచ్చే జాగిలాలు దర్పానికి దర్పణాలు. నవకవితా వీధిలో వికృతంగా కనిపించే గజ్జికుక్కలు ఆకలికి ఆర్తికి ప్రతిమూర్తులు. నాటికి నేటికి వస్తువులో సంభవించిన 'మార్పు' సామగ్రిలో మరిన్ని రెట్లుగా విస్తృతి చెందింది. వ్యాలోని రాయినీ, చెవిలోని జోరీగను కూడ కవితా సామగ్రిగా వినియోగించుకున్నా వేమన తర్వాత విశాలనము విపులము అయిన సామగ్రిని కవిత్వంలో వుపయోగించుకున్నవారు నవ్యులే. వస్తువుతోబాటు సామగ్రిని ఎన్నుకోవడంలోను వీరు మహా విప్లవాన్ని లేవదీశారని చెప్పవచ్చు. కవిభావనా గ్రంథిని కదిలించి, ఉద్వేల రసోద్వేగాన్ని రేకెత్తించి కావ్యవస్తువు పాఠకుని హృదయనాడిని స్పందింపజేసి, రసామృతధారలు చిందించడానికి అనువైన అంశాలన్నీ నవ్యులకు కవితా సామగ్రిగా పనికి వచ్చాయి. అయితే, నవ్యులుపయోగించుకొన్న కవితా సామగ్రి ప్రముఖంగా మేధస్సుకు గిలిగింతలు పెట్టుతున్నది. హృదయంలోనికి సూటిగా దూసుకొని పోవడానికి కొంత కాలవ్యవధి కావలసి వస్తున్నది. మళ్ళీ మళ్ళీ చదివి మళ్ళీ మళ్ళీ ఆలోచించవలసిన అవసరం ఏర్పడుతున్నది. నవ్యుల కవితా సామగ్రి పాఠకుని భావోన్మీలనంలో కవి వ్యక్తీకరణ వైచిత్రికే బహుముఖంగా సహాయపడుతున్నది. అపరిమితము, అనుదిన పరిణామశీలము అయిన 'నవ్యకవితా సామగ్రి'ని గూర్చి కూలంకషంగా పరిశీలించవలసిన అవసరం విమర్శకులకెంతయినా వుంది

కలగూరగంప

సంస్కృతములో మత్తేభ విక్రీడిత వృత్తములు

1975 ఏప్రిల్ నెల భారతిలో కలగూరగంపలో "సంస్కృతములో చంపకమాలా మత్తేభవృత్తములు" అను నా వ్యాసమునందు చంపకమాలను గూర్చిన చర్చను చదివి తమ ఆమోదముతోటి అట్లే మత్తేభ విక్రీడిత వృత్తమునున్ను భారతిమూలమునఁ దెలుపుడని సహృదయులు తెలిపినందున నీ భాగమునున్ను వ్రాయుచున్నాను.

ఇకను మత్తేభ విక్రీడితమును గూర్చి వ్రాసెదను. సంస్కృతములో రెండు విధములయిన మత్తేభవిక్రీడిత వృత్తములు కలవు. అవి. 1 పాదమునకు ఇరువది వంతున అక్షరములుకల ఇరువదియవదియైన కృతిచ్ఛందమునందొకటి తెనుఁగులోని మత్తేభము వంటిది. ఇదియే ప్రకృతము చర్చకు గురియైనది. ఏలనన ?

[1] ఉస్మానియా విశ్వవిద్యాలయము తెలుగుశాఖ పక్షాన ప్రచురితమైన "ఆంధ్రమహాభారతము–సంశోధిత ముద్రణము ఆనుశాసనిక పర్వమున ప్రచురితమైన శ్రీ కోవెల సంపత్కుమారాచార్య గారి 'కవిత్రయ భారతము–ఛందః[8] ప్రయోగము', అను వ్యాసమునందు "...శార్దూల విక్రీడిత, స్రగ్ధరా, మహాస్రగ్ధరలకు సంస్కృతమున విరివిగా ప్రయోగమున్నది. మత్తేభ విక్రీడితమునకు చాల తక్కువ..." అని సంస్కృతభాషలో దాని స్థితి ప్రకారమును దెలుపఁగా దానిమీఁద–1974 ఏప్రిల్ నెల భారతిలోఁ బ్రచురింపఁబడిన కళాప్రపూర్ణ శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు "సంశోధిత మహాభారతము – ఆనుశాసనిక పర్వము" అను వ్యాసమునందు "అసలు సంస్కృతమున మత్తేభ విక్రీడితమునకు ప్రయోగమున్నదా? లేదు. అది చంపకోత్పలమువలె...సంస్కృతీయముకాదు" అని వ్రాసినవారు ఇటు వ్రాసియు మరల క్రీ. శ. 634 నాటి ఆరవ పులకేశి ఐహోలు శాసనములోని సంస్కృతభాషలో నున్న "వరదా తుంగ" ఇత్యాది మత్తేభ విక్రీడితమును వారే ఉదాహరించినారు ముందు లేదని వెనుక కలదని చెప్పుట చోద్యము ఇది యొక్కటియే కాదు. శ్రీ సంపత్కుమార గారన్నట్లు "సంస్కృతములో దీని ప్రయోగము చాల తక్కువ" మాత్రమే. కనుక సంస్కృతములో మత్తేభ విక్రీడిత వృత్తము లేదనుకొనువారి భ్రాంతి నివారణార్థము ఏతద్వృత్త లక్షణము ప్రయోగములుగ నొకటి రెండు ప్రాచీన ఛందోగ్రంథ–కావ్యగ్రంథములను దెలిపి వాటియందలి దీనికిఁ జెందిన పంక్తులను దెలుపుచున్నాను.

దీని లక్షణము 1913వ సంవత్సరములో బొంబాయి నిర్ణయ సాగర ముద్రణాలయములో ముద్రితమైన కేదారభట్ట విరచిత వృత్తరత్నాకరమునందు 3 వ అధ్యాయములో (66 వ పుట) నిట్లున్నది.

"20 అక్షరాః 1048576" [2] సభరానమ్యౌగ్లౌత్రయోదశ యతిర్మత్తేభ విక్రీడిత. 1." అని.

---

1 *..* ఈ రెండు పువ్వుల గుర్తులోపల వ్రాసిన 5–6 పంక్తుల విషయము భారతీ, పత్రికలోఁ జదివి వ్రాసినది.

2 సభరా న్మౌ యలగా స్త్రయోదశ యతిర్మత్తేభ విక్రీడితమ్. ఇది పుస్తకాంతర పాఠః.

ఈ లక్షణ శ్లోకముగాని, ఈ పాఠాంతర శ్లోకముగాని 1898 సం॥రములో చెన్నపట్నములో వావిళ్ల వారు ప్రచురించిన నాలుగు వ్యాఖ్యానములు – వృత్తరత్నావళి – శ్రుతబోధములతోఁగూడిన వృత్తరత్నాకర గ్రంథములో కానరావు.

| బొంబాయి గ్రంథములో కేదారభట్ట అని, చెన్నపట్టణ గ్రంథములో కేదారాంతర్యామి అని కవినామ మించుక భిన్నరూపముగనున్నది కాని రెండు గ్రంథములు నొక్కటియే.

దీ॥ శ్రీ రామచంద్ర దీక్షిత భారతీ విరచితమైన వృత్త రత్నాకర పంచిక అను వ్యాఖ్యాన మందు ఇట్లు.—

'కృతా ఫదాహరతి. సశ్చ భశ్చ రశ్చ సభరాః. న శ్చ మ్ చ య్ చ లశ్చ గశ్చ న మ య్ ల గ్. సమాహారే నపుంసకమ్. సగణ భగణ రగణ నగణ మగణ యగణాః లఘు గురూచ చేత్. తదా ఇహ ఛందసి తే భ వి క్రీడితం నామ స్యాత్. అస్య వృత్తస్య త్రయోదశ యతిః. తయోః ఛి ర్యతిర్భవతి. త ద్య థా —

సగణః	భగణః	రగణః	నగణః	మగణః	యగణః
సుమద	స్వన్మై	కేళిదా	పాంచమ్య	తం కేవి	తుత్తారిం
				లఘుః	గురుః
				గ	నె

రసా జీవా మధగేష కేళి కతిని చుం దే సిధా వా పరే
సుమతే భ్రామితతే వర్ణాకమ భుజ త్యక్త్వా కటాక్షే కృపా
భరితే సం పతి తిష తీతి సుధియాం బంధో వయం బ్రూమహే॥
ఇట్లు లక్షణము వ్యాఖ్యానములో నుదాహరణ శ్లోకమును గలవు.

తారానాథ తర్కవాచస్పతియు తన వాచస్పత్య బృహదభి దానము నందు 4721 పుటలో) మత్తేభ విక్రీడిత శబ్దములో — నీ క్రిందం గను పరచిన వున్తకాంతర పాఠమును గ్రహించి ఏతద్వృత్త లక్షణమును జెప యున్నాడు. ఆయన మాట లివి—

"మత్తేభ వి క్రీడిత. న స భ రా న్మౌ య ల గా త్రయో దశ యతిర్మత్తేభ విక్రీడితం.' వృ ర. టీ ఉక్తే ఏక వింశత్యక్షర పాదకే ఛందోభేదే..." అని. (ఇచ్చట ఏక వింశత్యక్షర పాదకే అనుట విచార్యము).

ప్రతి పాదమునందు వరుసగా సగణము భగణము రగణము నగణము మగణము యగణము ఒక్క లఘు వు గురువు నుండవలెను. 13 వ యక్షరము యతి.

ఇకను నొక రిద్దరు మహాకవుల కావ్యములనుండి ఈ వృత్తము యొక్క ప్రయోగముల నెత్తి చూపెదను.

1. శ్రీకృష్ణదేవరాయల గురువైన తాతాచార్యులగారి మేనల్లుడు, ఉత్తర చంపూ, విశ్వ గుణాదర్శ, వరద భ్యుదయ, రాఘవ యాదవీయ (అనులోమ విలోమ కావ్య), వద్యాభ్యాస, శివణానంద, ప్రద్యుమ్నానంద, సుభాషిత కౌస్తుభ, అలంకార కౌస్తుభ, మీమాంసాకౌస్తుభ, వేదాంత కౌస్తుభ వఛ్ఛత్య వేత సాహిత్య శాస్త్రగ్రంధకర్త శ్లేషయమక చక్రవర్తి ఆర్వేమ వేంకటా ధ్వరి విరచిత లక్ష్మి సహస్ర 15 నక్షత్ర మాలాస్తబకే—

"క్షిపతు క్షీవ మనల్ప మ పతిహత స్తావ తయం మామకం
భుందావాగ్ని భయా వహా స్తవ కృపా వీక్షా సుధా నిర్భరః॥
వ్యధయా న్యాధు కదంబ మాబ విహిత ప్రౌఢా మ వ్యాహతి
శ్శశిన స్సోదరి హే నిదాఘ విభవ శ్శాంతిం యతో విందతి॥ 13

మయి సర్వా పకాతిశ నేకపి కలయ స్వాశీవ శీతాం యాం
హరికాంతే భువనోపకారి నిరతే ష్వప్యేషు ధనేష్వివ॥
పనసా మాది వహీరుహేషు దదతీ భూరీణి వారిణి సా
విషవృక్షేఽపి ముహు స్వ వరతి వ కిం విశ్వాంబ రాదం దిని॥"15

2 [3] శ్రీకృష్ణకవి సార్వభౌమ విరచిత శ్రీనివాస విలాస చంపూ కావ్యమునందు ఈ మత్తేభ విక్రీడిత వృత్తములు కొంచెము విరివి నున వి. అందొ నొకటి—

శ్రీనివాసవిలాసే (3 తృతీయ ఉల్లాసే—
లలితా మీలిత లోచనం సుమధురం మత్తేభవి క్రీడితం
తురగాణాం చతురాం గతించ బహుశో దృష్ట్వా ప్రహృష్టా నరాః॥
గగనోన్నమ శిరోధరంచ కరభ వీక్ష్య చక్రె రాహసన్
భువి సౌందర్యవతాం పురోఽతి విక్రుతో హాస్యాస్పదం స్యాన్నకిమ్.
34॥

అను శ్లోకములో ముద్రాలంకారము తో "మత్తేభ వి క్రీడితం" అని వృత్త నామముకూడా నిబద్ధమై యున్నది. మరి కొందఱు మహా కవుల గ్రంథములయందును నీ మత్తేభ వి క్రీడితములు కాంచ దగి

3 నృసింహ విలాస మదన గోపాల మాహాత్మ్య రాజవంశరత్నాకర అలంకారమణిహార (బహదలంకార శాస్త్ర) ఆద్య (70) సంస్కృత గ్రంధకర్త లైన వీరు (నెల్లూరుజిల్లా) కరుమూర్తి వేంకటేశ్వర విషయకముగ రచియించిన మృదుమధురమైన యీ గ్రంథము నేటికి (1975) వరిగా 109 సంవత్సరముల నాడు చెన్నపురిలో సరస్వతినిలయ ముద్రణాలయమునందు ముద్రితమైనది.

యున్నవి. ఇటు ఈ వృత్తమునకు నాదిశంఢి మహాకవుల ప్రయోగములు పలుతావులం గలవు. కాన నీ మత్తేభ విక్రీడిత వృత్తము సంస్కృతీయము కాదనరాదు. సంస్కృతీయమే.

ఇకను రెండవ రకము మత్తేభ విక్రీడిత వృత్తము ప్రకృతము చర్చకు చెందనిదియైనను వామపాద్యమునుబట్టి పాఠకుల ప్రమోదార్థము తద్విషయమును సంగ్రహముగ వ్రాసి వివరించెదను. ఈ రెండవరకము మత్తేభవిక్రీడిత వృత్తము 22 వదియైన ఆకృతి ఛందస్సులో చేరినది. కనుక పాదమునకు ఇరువది రెండు వంతున అక్షరములు గలది. లక్షణము వృత్తరత్నాకరే తృతీయాధ్యాయే- "తౌ భో య జౌ సర వ గాః పంక్తి సూర్య యతి మత్తేభ వృత కథితమ్" అని ప్రతిపాదమునందు త—భ—య—జ—స—ర—న గణములు నొక్క గురువు నుండవలెను పదవ యక్షరము పదిరెండవ యక్షరమును యతి. (అనగా పాదమధ్యములోని యతియైన పదవ యక్షరమును వదలి పదునొకొండవ యక్షరము మొదలుకొని పాదము కడన నుండు పదిరెండవ అక్షరము అనగా పాదాంతమే రెండవయతి సంస్కృతభాషలో పాదాంతమునున్ను యతిగా జెప్పుదురు. యతులను గురించి వేరొక వ్యాసములో వ్రాసెదను. ఈ మత్తేభ విక్రీడిత వృత్తమునకు నారాయణ పురోహిత విరచిత మణినిధి సమాఖ్య వృత్త రత్నాకర వ్యాఖ్యానమందలి ఉదాహరణ శ్లోకము—

వందే శశాంక శత సంకాశ దివ్యతను మాక రసింహ మతులం
స్తంభం బిభేద సము ఖిం దారి బృంద భృత దంభంచ యో
నరహరిః॥
ప్రహ్లాద భక్తవర దుర్వార దుఃఖ మపి వక్తో హిరణ్యాశిపో
ర్భక్తిమసనాథ మరి మత్తేభకుంభతట తీక్ష్ణాంకుశాయిత నఖమ్"

ఉదాహరణముగ మటి రెండు శ్లోకములును కలవు. పండితరాయలు జగన్నాథాదులచే గ్రంథ మంతయు నీ వృత్తముతోనే రచియింపబడిన అశ్వధాటీ కావ్యము మున్నగునవి కలవు.

ఇట్లు అమూల్యములైన విద్వాంసుల వ్యాసములను ప్రచురించుచు లోకమునకు విజ్ఞానమును ప్రసాదించుచున్న శ్రీ "భారతీ" సంపాదకులవారికి కృతజ్ఞతా వందనములు.

—శ్రీ విక్రాల శేషాచార్యులు.

ప్రేమలో అద్వైతం

ఆదికవి వాల్మీకి మొదలు నేటి తెలుగు కవి వతంసులవరకు ప్రేమతత్వ నిరూపణలో అందరూ ద్వైతులే. వీరి ప్రేమ వ్యక్తీకరణ కూడా ద్వైతమే.

వీరి దృష్టిలో నాయిక వేరు. నాయకుడు వేరు. కలయిక పేరు వీరుపడే వేదన ప్రేమ అని వీరి భావన. ఈ ప్రేమను జీవాత్మ, పరమాత్మతో ఐక్యాను సంధానంకోసంపడే వేదనకు ప్రతీకగా భావించి మధురభక్తి అని కొందరు ముద్దు ముద్దుగా పేరు పెట్టుకున్నారు. వీరి దృష్టిలో పరమాత్మ వేరు, జీవాత్మ వేరు. అంతే పరమాత్మ విశ్వమంతటా వ్యాపించి ప్రతిప్రాణిలోను సూక్ష్మరూపంలో ప్రకాశిస్తూ 'జీవాత్మ' అనే పేరుతో వ్యవహరితమవుతున్నాడు. ఎవరైనా నమస్కరించినపుడు "కృష్ణార్పణమస్తు" అనడంలో అంతరార్థం ఇదే.

జీవాత్మ, పరమాత్మ ఒకటే పరమాత్మ సూక్ష్మరూపమే జీవాత్మ. జీవాత్మ, పరమాత్మల ఐక్యతా సంధానకృషే నాయికా, నాయకుల విరహ వేదన. జీవాత్మ, పరమాత్మల అభేద భావమే నాయికా, నాయకుల అభేదభావం-ఇదే ప్రేమలో అద్వైత భావన.

ఓం ప్రథమంగా ప్రేమలో అద్వైతభావం చిత్రించిన మహాకవి క్షేత్రయ్య ఈయన కొన్నివేల పదాలు రచించాడని జనశ్రుతి అయితే ఇప్పుడు కొన్నివందలు మాత్రమే లభ్యమవుతున్నాయి. లభ్యమవుతున్న వాటిలో బహుశః ఒకే ఒక పదంలో ఈ అద్వైత భావం దోబూచులాడుతోంది. క్షేత్రయ్య ఈ అద్వైతభావ అంచులలో తారాడాడే కాని అందులోని చొరబడలేదు. ఈ పదంలో అద్వైతభావం చూచాయగా పొడకడుతుందేగాని పరిపూర్ణంగా వికసించలేదు. ద్వైతమే తరుముకు వస్తుంది గాని అద్వైతసిద్ధి కన్పించదు.

ఆ పదం ఎత్తుగడలోనే అంటే పల్లవిలోనే ద్వైతభావం తళుక్కుమంటుంది.

"నా మనసు వంటిది నీ మనసైతే నా
మోము షణమీదేదురా అదిగాక
నేమారు దొలకున బందుపండినట్లు
వేడుక వినుమడిం చేరా ఒరి వరదా"

"చెరకున పండు పండినట్టు, వేడు లిసుమడింపేరా ఓరి వరదా' లో ఎంత రమణీయత గూడుకట్టుకున్నా "నా మనసు, నీ మనసు" అనే రెండు ప్రయోగాలలో ద్వైతభావం ప్రస్ఫుట మవుతూనే ఉంది.

ఆ పై చరణాలలో అద్వైత భావం మెరుపులా మెరుస్తూ ధ్వనిస్తోందే గాని ప్రస్ఫుట మవదు. "ఊరకుండగలేక గోరనేమి వ్రాసిన నీ రూపుగా దోచురా" అనడంలో నాలుక హృదయంమీద, నాయకుని రూపము చెఱగని ముద్రవేసి "అంతా రామమయం' లాగానే గోటనేమి వ్రాసినా నాయకుని రూపమే అందులో ప్రతిఫలి స్తోంది. ఇంకా ఆపైన "మేల్కాంచినంతనే నీవు నా చేరువ నున్న ట్టుండరా", "పాడినంతనే నీవు నాతోడ బాడనట్టుండురా" అనే పదాలలో కూడా అద్వైతభావపు పొలిమేరలో తిరుగాడుతున్నట్లుందే గాని అద్వైత స్థితి పొందినటు ండదు.

పై పదంలోని భావమే ఇంకో రంగులో, ఇంకో దుస్తులో యెంకి పాటలలో కూడా మనకు తారసిల్లుతుంది. యెంకి పాటలలోని ప్రేమకూడా ద్వైతమే. యెంకి నాయిక. నాయుడు బావ నాయ కుడు. వీరిద్దరు భావనలో కూడా వేరు వేరు వ్యక్తులు. యెంకికి "నీలు తేబోతుంటే నీలోడె ఓలమ్మి నా యెంట ఎవరోను నడిసి నట్టుంటుంది" "అద్దంలో సూత్తుంటె అది ఏటొ సిగ్గిమ్మి! నా యెనక ఎవరోను నవ్వినటు ంటాదె". ఇదీ అద్వైతపుటంచుల్లో తార్లాటే. నండూరి సుబ్బారావు ఇంకో అడుగు ముందుకువేసి "పరాగాలు" అనే పాటలో

"నీవు నేనైతె! నీనులోనె కందు
నేను నేనుగనుంటె నీలోను యుందు"

అంటూ అద్వైత పరిధిలో అడుగుపెటాడు. అయినా ఈ పాటలో కూడా "నీవు—నేను" లకే ప్రాధాన్యం ఎక్కువ.

కవిస మ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అద్వైతులలో అద్వైతి. ప్రేమ చక్ర కేంద్రానికి చేరుకోవడమే కాక వృత్తాన్నంత టిని ఆక్రమించుకున్నాడు. ప్రేమ నిజస్వరూపాన్ని "అనార్కలి" నృత్యగీతంలో సాక్షాత్కరింపజేశాడు.

"అనార్కలి" నాటకంలోని "నీ వెవరు నాథ! నే నెవరు నాథ" అనే గేయంలో ప్రేమ చిత్రణ పరాకాష్ఠకు తీసుకువెళ్ళాడు.

ఈ గేయానికి ఛాయ "రాధిక" అనే ఖండకావ్యంలో గోచరిస్తుంది

ఐక్యాను సంధానానికి "ఈపాడు దేహం అడ్డువచిందట" "పార్వతీ శంకరులె కొంతవరకు ధన్యులా మహాత్ములకును దేహ మందునైన, గలిగి నైక్యమ్ము భేదమ్ము తొలగకున్న" పార్వతీ పర మేశ్వరులు ఆదర్శ వ్యక్తులుకాగా "నిజముగా భేదము లేకయుండ, గలిసిపోగము ప్రేమకు గడ్డవోలె." అని కాంక్షిస్తుంది రాధిక. ఆ కాంక్ష ప్రాతిపదికగా రాధిక కృష్ణుణి లా వేడుకుంటుంది.

"పాలునీరమ్ము కలబోకవోలె పలుచ
దనము మానము దాక యింతకు గడింది
ప్రేమము నిరంతరము ఘనీభవించునట్టు
కలిసి పోయెడుగతి నను గహము చూప్రు"

ఈ రాధికే అనార్కలిరూపంలో అద్వైత సిద్ధిపొందింది. అందుకనే అక్బరు సార్వభౌముని నిండు దర్బారులో—

"నేనెవ్వరను నాథ నీ వెవ్వరవు నాథ
నేనె నీవును మఱినీవె నేనును నాథ
ఈ దేహములు రెండు నింత భేదము చేయు
లేమ భేదము మహా లీనికును నాకును"

అని ప్రవచించింది దీనికి ప్రమాణం అనార్కలీ మాటలలో చెప్పు కుందాం—

"కాలిలోపల నీరు కదలి యావిరిరీతి
పడి వానయై నదీ వైఖరి కలయును
నీ నాదు భేదమ్ము నిర్ణయించగలేరు
హే నాథ! దివ్య విద్యా నాథ లుకు గూడ"

తెలిసి సుజ్ఞాన దీధితులు గాంచు నొకండు
తెలిసియు నజ్ఞాన తిమిర మొందు నొకండు
ఒక కొమ్మన పూవు లుద్భవించును రెండు
ఒక గాలి చలించి యొక్కలోట లయించు,

నీ వెవ్వరవు నాథ నేనెవ్వరను నాథ
నీవె నేనును మఱి నేనె నీవును నాథ

ఈ దేహములు రెండు నింత భేదము చేయు
లేదు భేదము కృపాళిల! నీకును నాకు"

ఆహా! ఎంత గొప్పభావన! ఎంత గొప్పగేయం.

విశ్వనాథ సాహిత్యమంతా ఒక ఎత్తు. ఈగేయం ఒక్కటి ఒక ఎత్తు అనిపిస్తుంది. పేము నిర్వచనంలో దీనికిదేసాటి. ఈలాంటి గేయం తెలుగు సాహిత్యంలోనే కాదు, విశ్వ సాహిత్యంలోనే లేదు. ఈ ఒక్క గేయమే, విశ్వనాథకు 'కవిసమ్రాట్" పట్టం సార్థక పరిచింది సుస్థిరం చేయగలదు.

— శ్రీ శ్రీనివాస చక్రవర్తి.

దాశరథిగారి "కర్తవ్యము"

పంతుల వారి కువ్యాఖ్యానము

ఏప్రిల్ 'భారతి'లో ప్రచురితమైన 'కర్తవ్యము' అనే శీర్షికగల కవితను గూర్చి పంతుల జోగారావుగారు ఆగస్టు భారతిలో అర్థరహితమైన విషయాలు వ్రాశారు.

"పాత వాసనలుగల వ్రాతలు పోవడం ఆరోగ్యకరం కాదా!" అన్నారు. వారికి పాతగా అనిపిస్తే నేను చేయగలిగిందేమి లేదు. వారు ఉదహరించిన పంక్తులవంటివి వేనకువేలు అనేక రచయితల రచనలలో ఉంటున్నది. అయినా పంతులవారికి పాత వాసన గిట్టనంత మాత్రాన మేము వ్రాయడం మానుకోవాలా? ఇకపోతే అర్ధోజ్ఝపిక ఏ శబ్దమునకు ఇవ్వవలెనో ఏ శబ్దమునకు ఇవ్వకూడదో కవి ఇష్టమే గాని అందుకు పంతులవారి అనుమతి తీసుకోవలసిన అక్కర లేదు. అర్ధోజ్ఝపికను ప్రయోగించుటకు సంపాదకులకు అభ్యంతరం లేనప్పుడు జోగారావుగారి కెందుకు బాధ?

శైలి హఠాత్తుగా మారిపోయిందని వ్రాశారు శైలి మారలేదు. ఛందస్సు మారింది. జోగారావుగారికి శైలివేరు ఛందస్సు వేరు అని తెలియనట్టున్నది.

అన్నిటికంటె ఆశ్చర్యకరమైన విషయం యేమనగా నా 'కర్తవ్యము' అనే కవితను గురించి వ్రాస్తూ జోగారావుగారు శ్రీ శ్రీని విశ్వనాథను తీసుకురావడం; అరసం విరసం గొడవలు తీసుకురావడం. ఇది చాలా అసంగతమైన విషయం. నా కవితకూ శ్రీ శ్రీ, విశ్వనాథలకు, అరసం, విరసం మున్నగు సంస్థలకు ఏమి సంబంధం? అవాకులు చవాకులు వ్రాసేయడమే విమర్శగా పంతుల వారు భావించడం తగదు.

"దమ్ముంటే తోటలు నాటు
ఈటెలు నాటుట మానుమురా!"

ఈ పంక్తులు నేను విరసం వారిని ఉద్దేశించి వ్రాసినవని పంతుల వారు భ్రమపడడం 'బుజాలు తడుముకోవడం' వంటిది. ప్రపంచంలో హింసా ప్రవృత్తిగలవారి నుద్దేశించి వ్రాశానేగాని 'కర్తవ్యము' వ్రాసినప్పుడు నాదృష్టిలో విరసం లేదని చిత్తశుద్ధితో మనవి చేస్తున్నాను. విచ్ఛిన్నమైన విరసంయెడ నాకు సానుభూతియేగాని ద్వేషం లేదు. శ్రీ శ్రీకి నాకు మధ్య జరిగిన వివాదమును మేమిద్దరము మరచిపోయినను, పంతులవారు మరల జ్ఞాపకం చేయుటకు ప్రయత్నించుట సమంజసము కాదు. "శ్రీ శ్రీ విశ్వనాథ గారల 'ఫార్స్'" అంటూ జోగారావుగారు అప్రస్తుతంగా వ్రాయటం చేయడం నాకు చాలా ఖేదం కలిగించింది.

నాకు పంతులవారితో గాని మరెవరితోగాని వివాదమునకు దిగు సంకల్పం లేదు. అయితే పంతులవారి అభాండాలను గురించి పాఠక మహాశయులకు తెలియజేయుట నా కర్తవ్యము. కనుక ఇది వ్రాస్తున్నాను. ఆరుద్రగారి 'రాక్షస విజయం' నేను చదువ లేదు. అది పదునైన కవిత అన్నారు పంతులవారు. కావచ్చును. పంతుల వారికి నచ్చే రీతిని వ్రాయవలసిన కర్మ నాకు పట్టలేదు. ఇట్టి కువ్యాఖ్యలు పంతులవారు చేయవద్దని మనవి చేస్తున్నాను. నాకు పంతుల వారు కర్తవ్యబోధ చేయనక్కరలేదు. ఈ వివాదమునకు ఇంతటితో స్వస్తి.

—శ్రీ దాశరథి.

* *

లేఖ

భారతి మార్చి 75 మరుపూరు కోదండరామరెడ్డి గ్రంథ విమర్శలు ఎల్లోరా 'రేపటి వసంతం'లోని కొబ్బరిచెట్టు టెంకాయ

చెట్టు అన్న పదాలపై శ్రీ మరుపూరు కోదండ రామిరెడ్డి విమర్శపై శ్రీ బండి నాగరాజుగారి అభిప్రాయం చదివాను. నాగరాజుగారి సమాధానం సమంజసంగా నున్నది. ఈ అంశంపై నా అభిప్రాయం ఒకటి రెండు మాటలలో వ్రాయుచున్నాను. ప్రచురింప ప్రార్థితుడను.

ఈ మధ్య వస్తున్న నవీన కవితలపై రెడ్డిగార్కి నదభిప్రాయం లేదని వారిచ్చిన గ్రంథవిమర్శలనుబట్టి అర్థంచేసుకోవచ్చు. 'రేపటి వసంతం' మరియు 'మానవతావేదికలో' (రచయిత మునిసుందరం) కవితా సంపుటములపై రెడ్డి గారి గ్రంథ విమర్శ విడ్డూరంగాను అసహజంగాను ఉందనక తప్పదు. రెడ్డి గారు ప్రాచీన సాహిత్యంలో నిష్ణాతులే కావచ్చు. కాదనడంలేదు. కాలంతోబాటు సాహిత్యంలోనూ మార్పులు వస్తున్నాయి. గురజాడ, గిడుగు రామమూర్తి పంతులుగార కృషిఫలితంగా వ్యవహారిక భాషకు సాహిత్యంలో చోటు లభించింది. రానురాను ఛందో బంధాలను త్రెంచుకొని అభ్యుదయ (నవ) కవిత్వం ఆవిర్భవించింది. శ్రీశ్రీ మహాప్రస్థానం నుంచి నేటి యువ కవుల కవితా సంపుటాల్ని ప్రజలు ఆదరిస్తున్నారు. అలాగని ప్రాచీన కవిత్వాన్ని ప్రజలు నిరాదరిస్తారని నేను చెప్పటంలేదు. మనం ఏ శాఖకు (అభ్యుదయానికో, ప్రాచీనానికో) చెందిన వారమైనా ఒక శాఖను ఈసడించుకోవడంకాని మరొక శాఖను శ్లాఘించడంకాని వ్యక్తిస్వారాన్ని తెలుపుతుంది. రెండింటిపై సమ సదృష్టి అవసరం ఇది యోగ్యుల లక్షణం.

ఛందస్సు, వ్యాకరణసూత్రాలు కవిత్వం కాదని భావఛందంలోనే ఉత్తమ కవితాగానం చేస్తానని, 'రేపటి వసంతం' రచయిత ప్రతిజ్ఞ. కేవలం వీటిని కవిత్వమన్న వారెవరు'–అని రెడ్డి గారన్నారు. అంటే ఛందోబద్ధం కానిది కవిత్వం కాదని రెడ్డిగారు భావిస్తున్నారా? మరి ఈ కవిత్వాన్ని రాసే కవులనంతా కవులనే ప్రజలంటున్నారే? అంతెందుకు ఈ కవిత్వానికి ఒరవడుదిద్దే వచన కవిత్వంలోనే మునుగుతున్న శ్రీ శ్రీని మహాకవి అని కవిసామ్రాట్టులే అంటున్నారే? కాలంతోబాటు కవిత్వంలో క్రొత్త పుంతలు తొక్కుతున్న దాశరథి, డా॥ సి. నా. రె. ఆరుద్ర, బోయి భీమన్నగార్ల కవిత్వాన్ని కవిత్వం కాదని, వారిని కవులు కారని రెడ్డి గారు అనగలరా? ఇకనన్నా, రెడ్డిగారు సారచనలోని రసాన్ని గ్రహించి, ప్రాచీన కవిత్వం పైనున్న అభిమానంతో అభ్యుదయ కవిత్వాన్ని దూషించకుండా సద్విమర్శ చేయగలరని విశ్వసిస్తూ, నా ఈ అభిప్రాయాన్ని రెడ్డిగారు సహృదయతతో స్వీకరించమని ప్రార్థిస్తున్నాను.

— శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం



గ్రంథ విమర్శలు

విశిష్ట భారతి

[రచన: సాహిత్య సమ్రాట్ డాక్టర్ త్రిపురనేని వెంకటేశ్వర రావు, ఎం. బి. బి. ఎస్. క్రౌను 8+73 పేజీలు. వెల తెలియదు ప్రకాశకులు-కవిరాజ సాహిత్య విహారము, గుడివాడ.]

ఆంధ్ర సాహిత్యంపై ఆదరమూ, అభినివేశమూగల రచయిత సాహిత్య సామ్రాడ్బిరుద ధారి. సాహిత్య-అకాడమీ కార్యవర్గ సభ్యులు. ఎన్నో కావ్యాలూ, నాటకాలూ, వైద్యశాస్త్ర గ్రంథాలూ రచించిన వారు. ఆయన నూతన దృక్పథంతో మన ప్రాచీన సంస్కృతిని అధ్యయనం చేసి, యావద్భారత దేశాన్నీ పర్యటించి, వివిధ దృశ్యాలచే ప్రభావితులయి, ఈ 'విశిష్ట భారతి' ని రచించి ప్రకటించారు.

ఇందులో పేజీకి ఒకటి చొప్పున 73 శీర్షికలలో వివిధ విషయాలపై పద్యాలు కూర్చబడినవి. సీసపద్యాలే ఎక్కువ. కొద్దిగా వృత్తాలూ, గీతాలూ ఉన్నవి. 'భారతమాత' మకుటంతో చాలా సీసాలు, 'ఆంధ్ర యువతీ యువకులార! అన్నలార!' అనే శీర్షికతో కొన్ని సీసాలూ రచియించబడినవి. ఆంగ్లేయుల పాలన, జాతీయోద్యమం, స్వాతంత్ర్యం, సంఘ సంస్కర్తలు, కవులు, నాయకులు, దేశహీనస్థితి, కర్తవ్యం మున్నగు వివిధ విషయాలు అతి సంగ్రహంగా వ్యక్తం చెయ్యబడినవి. ఇవి కవి హృదయాన్ని స్పష్టం చేస్తున్నవి. రచయిత దీని పీఠికలో 'మన సంస్కృతి' ని గురించి విపులంగా చర్చించి, తాము భావించినట్లు 'సంస్కృతి' ని నిర్వచించారు. మన ప్రాచీన సంస్కృతి విజాతీయ సంస్కృతులతో సమ్మిళితమయి, క్రొత్త సంస్కృతిని నిర్మించవలెనను వీరి ఆశయం ఆమోదించదగినది.

అందరి రచనకు విషయ ప్రతిపాదనమే ప్రధానం కావడంవల్ల, పద్యాలు రసవంతంగా ఉన్నవా? లేదా? అనే చర్చకే అవకాశం లేదు. చాలాచోట్ల కవి ఉద్రిక్త హృదయం స్పష్టమవుతున్నది. ఆ ఉద్రేకంలో నియమాలను అతి క్రమించిన విషయం వారు గమనించనట్లు తోస్తున్నది. 'విద్యాసాగరు' నకు 'కళాసాగరు' అని వాడబడింది (పు. 26) తెలుగుదేశపు ఎల్లలను వివరిస్తూ, 'కంధ్యుత్కళ నిజాము కర్ణాటప్రాంతంబులు' (పు. 27) అనడం సరికాదు. (నిజాము' ఎప్పుడో కరిగిపోయింది. తమిళనాడు విడవబడింది.) 'వాక్యానసుని' (నన్నయ) కంటె నన్నెచోడుడు ప్రాచీనుడనుట (పు. 30) సరియేనా? 'ఇన్ని తార్కాణము లేల? ఝాన్సీ భవాని'- ఛందోయతులు తప్పిపోయాయి (పు. 33) 'చాలునా నీ నిష్ఠ శక్తిం బ్రదర్శింప' (పు. 59)—ఛందస్సు లోపించింది. ఇట్టివి మరికొన్ని దొర్లాయి. అచ్చు తప్పులున్నూ కానవస్తున్నవి. 'కర్మచే మకినట్టి' (పు. 73) 'కర్మచే మనకిట్టి' కి బదులుగా పడింది. ఇలాటి తప్పులు ఉంటే పాఠకులు తికమకలు పడవలసి ఉంటుంది.

"అంగీరస"

మూడు లఘు కృతులు

1. ఆంధ్రనాయక శతకము

[కాసుల-పురుషోత్తమ కవి కృతము. సంపాదకులు—శ్రీ యార్లగడ్డ బాలగంగాధరరావు, క్రౌను 55 పేజీలు. వెల 2 రూ. ప్రకాశకులు—నిర్మలా పబ్లికేషన్స్, విశాఖపట్నం-3.]

కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో ఉన్న ఆంధ్ర విష్ణు దేవుని గురించిన ఈ శతకం 'హత విమతజీవ శ్రీకాకుళాంధ్రదేవ' అనే మకుటంతోడి సీసపద్యాల శతకం. కర్త 18 వ శతాబ్ది చివరి భాగంలో ఉండిన కాసుల-పురుషోత్తము కవి. ఈ కవి రచించిన నాలుగు శతకాలలో రెండు మాత్రం లభ్యములు. అందులో ఇది సుప్రసిద్ధం. ఇదివరలో ముద్రితంకూడా. ప్రస్తుత ముద్రణ చాలా చక్కగా ఉన్నది. 18 వ శతాబ్దంలోనే పురుషోత్తమ కవికి చాలా ముందు ఉండిన గోగులపాటి-కూర్మనాథకవి రచించిన 'సింహాద్రి నారసింహ శతక' పద్ధతిలోనే యిది దేవుని నిందాస్తుతులతో కూడి ఉన్నది. రెండున్నూ తురుష్కుల దాడి సమయంలో రచించబడినవే! శతక వాఙ్మయంలో రెండూ అగ్రస్థానాన్ని వహించినవే!

దీని 'భూమిక'లో సంపాదకులు దీని ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తూ. "వ్యాజస్తుతికే కాక భక్తి ప్రపత్తికి, పరాకోటికెక్కిన ఈ శతకంలో భాగవతంలోని కథలన్నీ బంగారంలో రత్నాలా పొదగబడాయి. భక్తి ప్రధానాలూ, నిందాస్తుతి పరాలూ అయిన రచనలు ఎన్నయినా ఉండవచ్చుగాని, ఇలాంటి శతకం చాలా అరుదనే చెప్పాలి' అని వ్రాయడం ఎంతో సమంజసంగా ఉన్నది.

2. ఆంధ్ర విష్ణువు

[(పద్యకృతి) కర్త: శ్రీ వేముగంటి-నరసింహాచార్యులు. క్రౌను సైజు 15+47 పేజీలు. వెల రూ. 2-50 సిద్దిపేట సాహితీ వికాసమండలి ప్రచురణ. ప్రతులకు—ఆంధ్రసారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, హైదరాబాదు—1. లేక శ్రీనివాస బుక్ డిపో, మెయిన్ రోడ్, సిదిపేట-మెదక్ జిల్లా.]

కృష్ణా జిల్లా శ్రీకాకుళంలోని ఆంధ్ర విష్ణు దేవుని చరిత్ర ఇందులో ఉన్నది. ప్రజా పాలన తత్పరుడైన రాజే క్రమంగా దేవుడుగా మారినట్లిందు చెప్పబడినది. 'నా విష్ణుః పృథివీపతిః' అనే ఆర్యోక్తి ఉండనే యున్నది.

తాను వృద్ధుడైనందున సుచంద్ర మహారాజు, కుమారుడైన ఆంధ్రవిష్ణువునకు రాజ్యాధికారం ఇచ్చివేశాడు. ఆంధ్రవిష్ణువు జనరంజకంగా రాజ్యపాలన చేస్తూ ఉండగా—ఈర్ష్యాపరుడైన నాగరాజ్యాధిపతి నిశుంభుడు అతనిపైకి దాడివెడలినాడు. సామంవల్ల ప్రయోజనం లేకపోయింది. యుద్ధంలో ఆంధ్రవిష్ణువు నిశుంభుని సంహరించాడు. ప్రజలానందించారు. ఆ ఆంధ్ర విష్ణువే పిదప దేవతామూర్తిని వహించి పూజల నందుచుండెను. ఆయనకు శ్రీకాకుళంలో దేవాలయం ఏర్పడింది. ఇదీ ఇందలి కథ ఈ కథను రచయిత రసవంతమైన కవితలో చక్కగా మలిచారు. ఒక పద్యం—

'క్రొవ్వి కొండతోఁ దగరు ఢీకొన్న యట్లు
చియ్యఁకొని లేడి సింగమున్ జెనకినట్లు
శౌర్యవారాశి యగు నాంధ్ర సార్వభౌముఁ
దాకఁబూనుట దుర్మదాంధ్యమ్ముగదె! [పుట. 26]

దీనికి డాక్టర్ దివాకర వేంకటావధానిగారి చక్కని పీఠిక ఉన్నది. ఇది విద్వత్కవిపతంసులు కేశవపంతుల నరసింహశాస్త్రిగారి అభినందనముల నందుకొన్నది.

3. శిథిలాలయము

[రచన: శ్రీ భైరవరసు. క్రౌను 69 పేజీలు. వెల 2 రూ. ప్రాప్తిస్థానం—శ్రీ భైరవరసు—త్రివిక్రమరావు, 7—నటరాజ గ్రామణి గార్డెన్స్ ఫస్ట్ స్ట్రీట్. తిరువత్తూరు, మద్రాసు—19]

మాధవుడనే సామాన్యవ్యక్తి శిల్పకళాభిమాని. అతడు ఒక శిథిల శివాలయానికి పోయి, శిల్పసంపదను చూచి, ప్రస్తుత హీన స్థితికి విచారిస్తూ, క్రుంగియున్న పార్వతి విగ్రహాన్ని సరిచెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఒక రంధ్రంనుంచి ఒక పాము బయటికి రాగా, భయపడి ఒక రాళ్ళ గుట్టపై పడిపోతాడు. వెంటనే నిద్ర వస్తుంది. నిద్రలో కల కలలో ఒకడు కనబడి, అక్కడి శివలింగం కింద ఉన్న ఘటంలో ఒక రత్నమున్నదనీ, అది ఎవరిదగ్గరుంటే వారు సమస్తైశ్వర్యాలతో తులతూగుతూఉంటారనీ చెప్తాడు. మాధవుడా రత్నాన్ని తీసుకుంటాడు. దాని ప్రభావంవల్ల అతడు శ్రీమంతుడై, కళాపోషకుడై, దానధర్మాలు చేస్తాడు. కళాకారులనూ, కవి పండితులను సత్కరిస్తాడు. అతడు ఇందిర అను వేశ్య సౌందర్యానికీ, నాట్యానికీ ముగ్ధుడై, ఆమెను ప్రేమించి భోగాలనుభవిస్తాడు. ఆమెకు లొంగి, ఆమె దుర్బోధవల్ల కళాపోషణ మానివేస్తాడు. ఒకనాడామె ఇతనిని మోసగించి, ఆ రత్నాన్ని తీసుకుని వెళిపోతుంది. అతడు తన వనితావ్యామోహాన్ని నిందించుకొని దుఃఖిస్తాడు. ఇలా స్వప్నం వచ్చాక అతనికి మెలకువ వస్తుంది. మాధవుడు శివలింగం క్రింద త్రవ్వి చూడగా శూన్యమే! అతడు నలు దిక్కులూ చూచి శూన్యహృదయంతో అక్కడినుండి వెళ్ళిపోతాడు.

ఉపయోగకరమైన
సరికొత్త గ్రంథములు
వ్యవసాయము-ఫిషరీ-కోళ్ళ పెంపకం-అడవులు-తోటపని
ఇంజినీరింగ్-వైద్యము-వివిధ సాంకేతిక విషయములపై
గ్రంథములుగలవు. కేటలాగుకుఉచితం. ఇంగ్లీషులో వ్రాయండి
N. K. PAUL & SONS.
P. B. No. 12202, Calcutta—5.

ఇందలి కథలో చమత్కృతి కానరాదు కవిత ధారాళంగా సాగింది కాని 'జాత్యాభిమానము, జనవిహితుడు (జన హితుడను టకు) మున్నగు ప్రయోగాలు కానవస్తున్నాయి. ఈ కవికి ఆంధ్రాభిమానం ఎక్కువ. అది కొన్నిచోట్ల అవధులు దాటిపోతుంది. 'అత్తినాడే' హత్తినాడయి, హస్తినాపురంగా మారిపోయిందట! కాశీరామేశ్వర శ్రీశైలం బకాల లింగాలకు— త్రిలింగాలకు మధ్యనున్న దేశమే త్రిలింగ దేశమట! (పుట. 55) ఈ ఊహలు వింతో అసహజంగానూ, అసందర్భంగానూ కానవస్తాయి.

ఈ 'శిథిలాలయ' గ్రంథాన్ని సమీక్షిస్తూ, దీని విశిష్టతను విద్వాన్ రామిరెడ్డి — నారాయణరెడ్డి (బి ఏ) గారు వివరించారు. కట్టమూడి-లక్ష్మీప్రసాద్‌గారు దీని 'కవితా ప్రసూన సౌర' భాన్ని విస్తరింపజేశారు.

సరళమైన కవితలో శిల్ప ప్రశస్తి, ఆంధ్రప్రశస్తి ఇందు చక్కగా చిత్రించబడినవి.

—శ్రీ బులుసు వేంకట రమణయ్య.

మార్పు నా తీర్పు :

[డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు. కవితా సంపుటి. 1/4 హూలు) క్రౌన్ 60 పేజీలు. వెల రు: 5/ ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్స్ సికిందరాబాదు : మదరాసు.]

1974లో రెడ్డిగారు పత్రికలో ప్రచురించిన గీతావళి గుచ్ఛంగా ఉన్నది—యీ సంపుటి. ఋతుధర్మమో అన్నట్లు ఇదీ వచన కవిత్వమే! అచ్చుతీరు మొదలుకొని కవితా పక్కవరకు కొత్త దారి తొక్కిన రచనలు ఇందు మెండు. విషయసూచికను "ఇదీవరస" అన్నారు. పేరుపెట్టి పేరపెట్టి ప్రచురించే దానికంటె, ఏపేటా ఇట్లా ప్రచురించడం చదువరికి సులువేమో. పెద్ద పుస్తకాలు చదువను మనసుకు బరువనిపించే దినాలుగదా యివి.

ఈ సంపుటంలో జాను తెనుగునుడికారం పండువెన్నెలమాదిరి పరచుకొనిపోయి మీ మనసుకు హాయిని గొలుపుతున్నవి. రెడ్డిగారికి ఉగ్గుతో అబ్బినమాట-మాటమీద పసితనం-విరుపులు సొగసు ఉన్నవి కొన్నిచోట మర్మభోగాలలో పడినా చాలా కిరికలు హృదయాన్ని విప్పి, భావాన్నిచెప్పి ముందుకు సాగిపోతున్నవి. 'శిశిరం నుండి వసంతానికి, చీకటినుడి ప్రభాతానికి, నిరాశనుండి ఆశా శిఖరానికి, అశ్రుజలధినుండి ఆనందతీరానికి నడిపించే మార్పు నేనిచ్చే తీర్పు" అని, ఉపనిషత్తులలోనికి దూరి చెప్పుతున్నాడు. నీటిపాటలో, ప్రసవ వేదనలో, రక్తరక్తిమలో, సూచికలలో మదికెక్కే కొంగ్రొత్త నిర్వచనాలు చాలా కల్పించినాడు—కవి

ఎక్కడ నీపక్షులు అన్న గీతంలో—"ఎగిసిపోయిన పువ్వులా, దిగివచ్చిన చుక్కలా-ఉన్నవంటూ, "కూటికి గూటికి నోచుకోక ఆకాశంలోకి వలసపోతున్న అమాయకపు ప్రజలు" అన్న భావన హృద్యంగా ఉన్నది. విప్లవకారుని జితేంద్రియుడు అని అనడంలో నిష్ఠుర సత్యమున్నది.

పూలతోనా ఉగాది వచ్చెడి—యందు జాతీయ సమైక్యతను చక్కగా పద్యంలో పొదివినాడు. తెనుగు ఉగాదే మహారాష్ట్రులదిగూడా. దేశం ముందుకు నడవాల-అన్నదానిలో గూడ జాతీయత పిక్కటిల్లినది.

నేను చాపను—అన్నది వేదాంత వాసనేమో? అఖిలభారత తోడేళ్ళ మహాసభ—మంచి వితిపాడుపు వ్రాత. ఇట్టినే పూర్వం కాళ్ళకూరి నారాయణరావు అపూర్వ సంఘసంస్కరణం—అని లోకమెరిగిన చక్కని కత వ్రాసి ఉండినాడు.

పల్లెలనుడికారపు సొంపు దిగ్రావినవాడు కాబట్టే యీకని— "ఎగదన్నిన నిట్టూర్పు" (పడగెత్తిన దిక్కేతనం) ఆకాశాన్ని గోకే మేడలు (అంబరచుంబిత కుమారు—నగరం పడిపోతున్నది) "మరుగుతున్న అంబలి" "జాతిని నంజుక తినే సైతాన్లు" మొదలైన పసిడి తునకలను వ్రాయగలిగినాడు.

కాని, "వసిపోయిన మొక్కలు" అన్నాడు. వట్టిపోయ్యేది పశువులు తోట ఓటుపోయినది—అంటాం మా తట్టున "కొరకొర చూస్తున్నది వాసలు" దీనిని Tranfered Epithet అనుకోమన్నారా?

అగ్నిగర్భ—కవితాసంహిత

[సంపాదకుడు— సుప్రసన్న. డెమ్మీ 160 పొరటలు; వెల : ... ప్రాప్తిస్థానం : జాతీయ సాహిత్య పరిషత్ (ప్రచురణ ...) 2-1-272, నల్లకుంట, హైదరాబాదు 44.]

ఇది, అధునాతన కవికుమారులు 51 మంది వెలువరించిన ...పరిమళ పేటిక. 1950 నుండి తెనుగు ... శిగ ఎగ గట్టి కవిత్వం వ్రాసి, పాఠక లోకానికి తెలిసి మెప్పించిన చాలమంది —ఒక ప్రత్యేకపు కోవకు చెందినవారు ఇందు చేరి ఉన్నారు. ...నంలో కోవెల సుప్రసన్నాచార్యుల వారు అన్నట్లు : స్వతంత్ర ...లో ఆంధ్రకవులు అనుభవించిన ఆర్తి ఇందు చదివిన వారికి ...స్తున్నది. సుప్రసన్న గారు ముందుడిగా—ఆంధ్రకవితా పరి...వాసాలను శాస్త్రీయ దృష్టితో చక్కగా అభివర్ణించినారు. ...ం కాలమునుండి యీనాటి వరకు ఆంధ్రభారతి పొందిన ...లను అందాలను వివరించి, లెక్కబడిన కవులను విమర్శకులను ...ని ఉన్నారు. అందుచేత యీ కవితా సంకలన సంపుటిని అప... చదువాలనే ఆత్రం రేకెత్తుతున్నది. ప్రవేశం రెండో ...లో యీ సంహితకు "అగ్నిగర్భ" అనే నామకరణం చేసేదానికి ...న భావచర్య ప్రాధాన్యంగా శ్రుతివాక్య నిర్దేశకంగా వ్రాయబడి...

...ఏర్పరచుకోబడిన ఖండికలు వారి వారి కవిత్వపు మీగడలు కాక ...నా, ఆణిముత్యాలనదగి యున్నవి. ఇట్టి సంకలనాలు, మధు... ...ండి వంటివి. (మెమూకార్డు) పాఠకులు ఇవి చవిచూచి. ...ల కవితా సంపద విందువిందును ఆరగించి ఆదరించ గలరు ...స్తకం వర్ణ శబలతలో శోభాయమానమైన ఆమని తోట ...ది.

చివరన ...కవి పరిచయ వాక్యాలను జతచేయుడం చాలా ... పని.

...గ్ని చిగుళ్లు

[కవితా సంకలనం ...కౌను 68 పొరటలు. ముతక కాగితం అచ్చు; వెల రు. 2/-; దొరికేచోటు : హైదరాబాదు అభ్యుదయ రచయితల సంఘం. ముఖ్య కార్యా... ; హైదరాబాదు— 500029]

35 మంది అభ్యుదయ కాంక్షకులైన యువక కవుల వచన కవితా సంపుటి ఇది. ఇందు ఇద్దరు కవయిత్రులు గూడ కవిత్వపు ముగ్గులు దీర్చి ఉన్నారు. అగ్ని చిగుళ్ళ—భోజ విరోధాభ వాక్య నిర్మాణంలో ఒక సొంపు ఉంటుంది లేండి. "నేటి సమాజంలోని లోతు కుళ్లు మా తమేగాక సాగవలసిన పోరాటాన్ని గురించిగూడ" యీ సంపాదకులు ఆదర్శంగా పెట్టుకొని ఉండడం నిర్మాణాత్మక కృషి అనాలి. ఈ కవితలో గేయాలు పాట బాణీలు ఎక్కువగా ఉన్నవి. ఈ వ్రాతలలో కొద్దెప్రాయపు నెత్తురు తెరుతున్నది; ఇది చల్లారి ద్వేషంలేకుండా కార్యం సాధించి తీరుకొంటే అందరికి శ్రేయస్కరము.

భాష తెలంగాణా మాండలికము. మంచి తెనుగు నుడికారంతో పండబారి ఉన్నది. అందరూ ఆనందింపదగినది. గ్రామ్యంలోగూడ ఒక జాతీయత ఉన్నది.

"కటిక దోపిడి కట కొచ్చిన తెల టోపీ మలు ధోతి గుండె, గుండెను వజ్రరిలే ఉజ్వలాగ్నుల మాడిపోవా ?' (వేణుగోపాల్) "పలకవేమి ఉలకవేమి బండరాయిగ మారిన సామి" (...వాభ అని వేమన బాణిలో బడికట్టునైన నిజాన్ని చెప్తున్నారు శ్రీరంగ నీతులు బలికే రాజకీయ వాదుల వీపులు వగులగొట్టు తున్నాడు ఏటుకూరి ప్రసాద్ పరిమళా సోమేశ్వర్ 'ఫుట్‌పాత్ మీద పాణా చారాలు పడుతుంటే, మరోవంక ప్రజాప్రతినిధులు ... పాలరాతి మేడలో నివసిస్తుంటారు" అని అసమభాగ్యతకు వాపోశారు. ఇంకా దేశం బాగుపడలేదని మూఢవిశ్వాసాలమీద దండెత్తుతాడు—సుధాకర్ గౌడ్. పిలిపెట్టి వెంకటేశ్వరరావు గీతాలలో నుడికారం బాగున్నది ఉ సీ భాగ్యగుణం ఎచ్చుతక్కువగా యీ పాతగాండు అందరిలో చూ ఉన్నది. ఆర్వీ రా - రావు (ఈనామ సంకేతాలు నేటి ఫాషన్) ఇప్పటి ప్రభుత్వ విధానాలనే బాగా ఎతి పొడిచినాడు. జగదీశ్వర స్వామి "పలు కోరికలు హృదిలో పుడుడు పోసుకొనేవేళ"ను ఊహించి "పేడి నిటూర్పులనుండి వెలుగును పుట్టించాల అంటాడు మలి కార్జున్ "వేశ్యాగతం" + యీ "కటి పేసిన కోడి పెట్ట" మను గడను భావయుక్తి అర్థ పుష్టిలో వర్ణించినాడు.

ఆనందబాబు "నిర్వచనం" ఛందస్సుమీద విరగబడే మామూలు నపుంసక క్రోధంతో నిండి ఉన్నది; అయినా చెప్పిన తీరు యింపుగా ఉన్నది. అనాదిగా తెనుగు పల్లెలవారు గూడ అను ప్రాసలు ఛందము తమంత తామే చోటు చేసుకొన్న వాక్యాలతోనే మాట్లాడి పాడి పరవశించి పోతుంటారు; యీ అను ప్రాసలను గమకాలను యీసడించుకొనేవారుగూడ ఉండనే ఉంటారు (ప్రాస కేసితినే కూసు ముండా అంటూ) ఈ వచన కవిత్వపు వెల పదింపు రానున్న తరమే నిర్ణయించుకో గలదు.

"మరో జగతి నిర్మిద్దాం" లో సత్యనారాయణ సమత కావా లంటాడు. సర్వులకు సమానావకాశావేగాని నమత అనే కరుపులోటోపి సృష్టించడం అసాధ్యం అసహజం అని కమ్యూనిజం తన 50 ఏండ్ల స్వానుభవంతో చెప్పడంలేదా? అయినా యిది నేటి అభ్యుదయ కాంక్షకుల ధోరణి.

కాచినేని రామారావు "పిట్టకావిలి" గ్రామ్య భాషా స్థాయిలో జానపదం (యాలపదం) మాదిరి ఉన్నది. శ్రీనివాస చక్రవర్తి "మనిషి కుక్క కొట్లాట" బీదరికపు కడుపు కోతలను హృదయ విదారితంగా, దేశ దౌర్భాగ్యాన్ని కన్నులకు కట్టినట్లు చెపుతున్నది. శ్రీధర్ "ప్రజాశక్తి" "జలమెంత చల్లనిదైనా ప్రళయాన్నే సృష్టిస్తుంది" అని, విరోధాభాస రూపకమైన సత్యాన్ని బిగువైన మాటలతో చెప్పినది. నవీన సంఘ సంస్కారులందరి పలెనే సరళాదేవి "కుల మతమ్ముల కుమ్ములాటలు మతంపేరిట జరుగు దొమ్మి సంప్రదాయం పేర జరిగే ఛాందసత్వం రూపుమాపగ కదలి రా రా తమ్ముడా" లని అభ్యుదయ కరమైన వాంఛను పలుకుతున్నది.

"కటిక దోపిడి కట్టుకొచ్చిన తెల్ల టోపీ పలు దోతి" వేషం యీనాడు జరుపబడే రాజకీయ అరాచకాన్ని కేశవ గోపాల్ ధైర్యంగా బయట బెట్టినాడు. "ఎర్రజెండా" (దాశరథి విరించి) "నవ నిర్మాణం" (దామోదర్) "పోరాటానికి పిలుపు" (యల తాయారు) తెల్లటోపీపై బడిడున్న సంగతే చెప్పినారు.. ఎక్కువ శీరికలు యీ స్థితి గతుల విమర్శనలే. ఎప్పుడో ఏండ్లకు ముందే — ఆ ధీమంతుడు కట్టమంచి రామలింగారెడ్డి "That White cap full of Black lies" అని కోరలుగల లతో పలికినాడు. తాయారమ్మ భవిష్యత్తుపై నిండు విశ్వాసంతో "కష్టజీవుల రాజ్యమొస్తే, కరువులుండవు కడుపు మంటుండదు" అని ఆశపడిందేగాని, దిన బత్తెపు నూకలకుగా అమెరికాకు పంపిన రష్యా సంగతి యీమెకు గమనం తప్పినట్లున్నది. వ్రాతగాండ్ర ఆవేశం యిట్లా ఉంటుంది. "గొల్లసుద్ది" (రంగాచారి) మంత్రులను పారబట్టటమే; ఇందలి తెలంగాణా గ్రామ్యం వినసొంపుగా ఉన్నది. "సింహాసన లోకనం" (కళారవి) "కళలకు నాథుడు—చిరంజీవి రాముడు, క్షయవ్యాధి దేహంతో గదిలోనే ప్రాణం వదిలాడు; ఇప్పి షాపుకు బాకీ ఇంటి బాడుగ, కిళ్లీ కొట్టుకు బాకీ స్మారక చిహ్నంగా నిలిపి చనిపోయాడు" మనసును కరగింపజేసే కవితా కలిక! ఈ దైన్యస్థితి బావురు భాషలో చెప్పబడినది.

ఇట్లా ఈ సంకలనం యువకుల రక్తపు పొంగుకు సంకేతంగా ఉన్నది.

— శ్రీ మరుపూరు కోదండరామ

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Pati Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 75226

BCI

KLVA104M126 BC

అమృతాంజన్ లిమిటెడ్

75 సంవత్సరాల పైగా గృహౌషధములు తయారు చేస్తున్నవారు!

- అమృతాంజనం బాధానివారిణి
  తలనొప్పి, ఒళ్ళునొప్పులు, బెణుకులు, జలుబు, దగ్గు, కండరాల నొప్పులకు.
- అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్
  పసిబిడ్డల అజీర్ణానికి, పళ్ళు వచ్చేటప్పుడు కలిగే బాధలకు.
- అమృతాంజన్ డెర్మల్ ఆయింట్ మెంట్
  తామర, తీట, గజ్జి వగైరాలకు.
- అమృతాంజన్ ఇన్‌హేలర్
  జలుబుచేసి ముక్కుదిబ్బడ, తుమ్ములు వగైరాలకు.
- అనోలియమ్-కోల్డ్ రబ్
  దగ్గు జలుబులను పారద్రోలే అమోఘమైన ఒక కొత్త శక్తి.
- కాలోఫెన్ - బాధానివారిణి మాత్రలు
  తలనొప్పి. ఫ్లూ. ఒళ్ళు నొప్పులకు

...ఇండియాలోను, ఇతర దేశాలలోను పేరు పొందినవి.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు-4



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA104M126
పుస్తకం పేరు	భారతి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI, II, [illegible], BCI
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	naveena
స్కాన్ చేసినది	naveena
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good